ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం

జిల్లా వార్తలు

ఆదివారం 19, మే 2024



బొట్లపాలెంలో టీడీపీ శ్రేణులపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు (ఫైల్)

కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో గత ఎన్నికల్లో వైసీపీకి పనిచేసిన కొన్ని కుటుంబాలు ఈసారి తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచాయి. ఆ అక్కసుతో వైసీపీ వర్గీయులు పోలింగ్ మరుసటి రోజు దాడులకు తెగబడ్డారు. వారి దాడిలో గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌కు తలపగిలింది. ప్రస్తుతం అక్కడ పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.

పోలింగ్ రోజున మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి కోడలు కావ్యారెడ్డి ఒంగోలు నగర పరిధి వెంగముక్కలపాలెంలోని బూత్‌లోకి సాయంత్రం 6 గంటల తర్వాత వెళ్లడాన్ని టీడీపీ మద్దతుదారు అయిన ధనలక్ష్మి అనే మహిళ ప్రశ్నించడం నేరమైంది. కావ్యారెడ్డి పక్కన ఉన్న మూకలు ధనలక్ష్మిపై చెప్పులు విసిరి దాడికి దిగారు. ఇదేమని అడిగిన వారిని కొట్టారు. అదేరోజు రాత్రి మరలా కావ్యారెడ్డి అనుచరులు పెద్దసంఖ్యలో వెళ్లి బాధితుల ఇంటిపై దాడిచేసి అద్దాలు పగులకొట్టారు. అయితే ధనలక్ష్మిపై కౌంటర్ కేసు నమోదు చేయడం పోలీసుల పక్షపాతానికి అద్దం పడుతోంది.

పోలింగ్ అయిన మరుసటి రోజు ఎర్రగొండపాలెం మండలం వాదంపల్లిలో ఓ మహిళకు ట్యాంకర్ ద్వారా నీరు ఇచ్చేందుకు వైసీపీ కార్యకర్త నిరాకరించాడు. మీరు టీడీపీకి ఓట్లు వేశారు.. మా నీరు పట్టుకోవద్దన్నాడు. ఇదేమని ప్రశ్నించిన టీడీపీ సానుభూతిపరుడితో ఘర్షణకు దిగాడు. అనంతరం ఇరువర్గాల మధ్య రాళ్లదాడి జరిగింది. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

దర్శి మండలం బొట్లపాలెంలో పోలింగ్ రోజు, అనంతరం బలహీనవర్గాల వారే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఎన్నికల ముందురోజు తెలుగు యువత నేత కల్లూరి సుబ్బుపై దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా మిన్నకుండిపోయారు. దాడిచేసిన వారే మరలా బలహీనవర్గాలకు చెందిన మహిళలపైనా దాడి చేశారు. దీంతో ఇరువురికి తలలు పగిలాయి. అయితే దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని అక్కడ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ధర్నా చేస్తే కానీ పోలీసులు స్పందించలేదు.

ఇదీ జిల్లాలో సాగిన, సాగుతున్న ఎన్నికల హింస. ఈ విషసంస్కృతిని అరికట్టాల్సిన పోలీసులు ఉదాసీనతను ప్రదర్శిస్తున్నారు. దీంతో అధికార వైసీపీ మూకలు మరింత రెచ్చిపోతున్నాయి. ఇప్పటికీ ఎక్కడో ఒకచోట దాడులు, ఆస్తుల ధ్వంసం, కవ్వింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. పోలింగ్ రోజే పోలీసులు కఠిన చర్యలు తీసుకుని అరాచక శక్తులను అరెస్టు చేసి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదని ప్రతిపక్షాలు అంటున్నాయి. పోలీసుల వ్యవహార శైలిపై అనేక ఆరోపణలు చేస్తున్నాయి.

- జిల్లాలో రెచ్చిపోతున్న వైసీపీ మూకలు
- పోలింగ్ రోజున ప్రత్యర్థులపై దాడులు
- ఎన్నికల అనంతరం అనేక ఘటనలు
- కొనసాగుతున్న కవ్వింపు చర్యలు
- పెచ్చరిల్లుతున్న అరాచకత్వం
- ఇప్పటికే నిఘా వర్గాల హెచ్చరికలు
- పోలీసు అధికారుల్లో కనిపించని అప్రమత్తత



కె.పల్లెపాలెంలో వైసీపీ గూండాల దాడిలో గాయపడిన యువకుడు (ఫైల్)

నివురుగప్పిన నిప్పు

ఒంగోలు (క్రైం), మే 18 : ఎన్నికల పోలింగ్ వేళ, ఆ తర్వాత జిల్లాలో వైసీపీ మూకలు ఉద్రిక్తతలు సృష్టించాయి. ప్రతీకార దాడులకు తెగబడుతూనే ఉన్నాయి. పోలింగ్ రోజు అనేక ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు విధ్వంసానికి పాల్పడ్డారు. పలుప్రాంతాలలో బూత్‌లను స్వాధీనం చేసుకోవాలని చూచారు. అనేక చోట్ల దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి ఘర్షణలకు దిగారు. దర్శి నియోజకవర్గంలో అయితే మరీ రెచ్చిపోయారు. టీడీపీకి పట్టున్న గ్రామాల్లో దాడులకు తెగబడ్డారు. పోలింగ్ మరుసటి రోజు కవ్వింపు చర్యలకు దిగి టీడీపీ శ్రేణులను దారుణంగా కొట్టారు. ఇక ఒంగోలు నియోజకవర్గం వెంగముక్కలపాలెంలో పోలింగ్ మరుసటి రోజు దళిత మహిళ ఇంటిపై వైసీపీ మూకలు అర్ధరాత్రి దాడి చేశాయి. ఇలా వైపాలెం నియోజకవర్గంలోనూ జరిగింది. ఆతర్వాత కూడా రోజుకో ఘటనతో అరాచకం సృష్టిస్తున్నారు. కవ్వింపు చర్యలతోపాటు ప్రత్యర్థి వర్గాల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రతిదాడులు కూడా చోటు చేసుకునే అవకాశం ఉందని నిఘావర్గాల సమాచారం. అయినా పోలీసుల నుంచి ఆశించిన స్థాయిలో అప్రమత్తత కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



బొట్లపాలెంలో వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన సుబ్బు (ఫైల్)

వైసీపీ విష సంస్కృతి

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల వేళ విషసంస్కృతి చొరబడింది. మొదట ఒంగోలు సమతానగర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా టీడీపీ నేతపై దాడి, ఆపై రిమ్స్ వద్ద మాజీ మంత్రి బాలినేని ఆధ్వర్యంలో వైసీపీ మూకల వీరంగం రాష్ట్రమంతా చర్చనీయాంశమైంది. దీంతో ఎన్నికల కమిషన్ స్పందించి ఒంగోలును సమస్యాత్మక నియోజకవర్గంగా ప్రకటించి పూర్తి వెబ్‌కాస్టింగ్‌తో ఎన్నికలు నిర్వహించింది. అలాగే జిల్లాలోనూ పెద్దఎత్తున పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక దృష్టిపెట్టింది. అదనపు బలగాలను కేటాయించింది. అయినా పోలింగ్ రోజు హింస జరిగింది. ఆ తర్వాత కొనసాగింది. వెంగముక్కలపాలెంలో పోలింగ్ రోజు అరాచకం సృష్టించిన వైసీపీ నాయకులు దాన్ని మరుసటి రోజు కూడా కొనసాగించారు. కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో దుర్గాప్రసాద్ అనే యువకుడిని వైసీపీకి చెందిన వారు తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఎప్పుడు ప్రతిదాడులు జరుగుతాయో తెలియని పరిస్థితి. దర్శి ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎన్నికల రోజు ప్రారంభమైన ఘర్షణలు తర్వాత కొనసాగాయి. ఇలా చిన్న చిన్న ఘటనలు అని పోలీసులు వదిలేస్తే అవి చినికిచినికి గాలివానగా మారే పరిస్థితి ఉంది. మూడురోజుల క్రితం ఒంగోలు గద్దలగుంటలో కొందరు వైసీపీ యువనేత అనుచరులమంటూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఆరుబయట అరుగు మీద పడుకుని ఉన్న వృద్ధుడిని పూటుగా తాగి ఉన్న యువకులు విచక్షణారహితంగా కొట్టారు. అదేమని ప్రశ్నించిన బాధితుడి తరపు వారిని తాము వైసీపీ వారమని బెదిరించారు. ఇలా అనేకచోట్ల ఎన్నికల అనంతరం దాడులు కొనసాగిస్తున్నారు. ఇంకా ఇవి అధికమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిణామాలను పరిశీలించి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. రాష్ట్రంలో కొన్నిప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలు జిల్లాలో జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

బాధితులపైనే కేసులు

దర్శి నియోజకవర్గంలోని బొట్లపాలెంలో పోలింగ్ రోజు, అనంతరం జరిగిన ఘటనల్లో గాయపడిన వారిపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల సందర్భంగా బాలినేని కోడలు కావ్యారెడ్డి వెంగముక్కలపాలెంలో టీడీపీ వారిపై చెప్పులతో దాడికి దిగారని, పోలింగ్ బూత్‌లోకి చొరబడ్డారని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదు. పైగా బైండోవర్ పేరుతో టీడీపీ వర్గీయులను ఇబ్బందులకు గురిచేయడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఆ పక్షపాత ధోరణిపై గత బుధవారం టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ వారికి కొమ్ముకాస్తున్నారని పోలీసు అధికారులపై మండిపడ్డారు. ఇలా కౌంటర్ కేసుల పేరుతో కొందరు పోలీసు అధికారులు బాధితులను వేధిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. దాడులను అరికట్టాల్సిన వారే ఇలా వారికి సహకరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిఘా వర్గాల హెచ్చరికలు

రాష్ట్రంలో కౌంటింగ్ అనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉందని నిఘావర్గాలు హెచ్చరించాయి. దీంతో జూన్ 19 వరకు కేంద్ర బలగాలు ఆయా ప్రాంతాల్లో ఉండే విధంగా ఆదేశాలందాయి. అదేవిధంగా ఎస్పీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

అప్రమత్తమంగా ఉండాలని ఎస్పీ ఆదేశాలు

పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాలిచ్చారు. బైండోవర్ చేసిన వారికి హెచ్చరికలు జారీచేయాలన్నారు. అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా ఘటన జరిగితే కిందిస్థాయిలో ఉన్న పోలీసు అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. రాత్రి గస్తీ పెంచాలని ఆయన సూచించారు.



పోలింగ్ రోజు వెంగముక్కలపాలెంలోని బూత్‌లో బాలినేని కోడలు సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు (ఫైల్)

వైసీపీ నాయకుల దుశ్చర్య

- టీడీపీ నేత దానిమ్మతోటకు నిప్పు
- రూ.3లక్షల మేర ఆస్తినష్టం




వైసీపీ నాయకులు తగులబెట్టిన దానిమ్మతోట

మార్కాపురం, మే 18 : ఎన్నికల అనంతరం వైసీపీ నాయకుల అరాచకాలు కొనసాగుతున్నాయి. టీడీపీ నేతలపై అక్కసు పెంచుకొని వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పెద్దారవీడు మాజీ ఎంపీపీకి చెందిన దానిమ్మతోటకు శనివారం నిప్పుపెట్టారు. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం పట్టణంలో నివాసముండే టీడీపీ నాయకుడు తడికమళ్ల బాలసుబ్బారావు (బాలుడు) గతంలో టీడీపీ పెద్దారవీడు మండల అధ్యక్షుడిగా పనిచేశారు. గత ఎన్నికల తర్వాత వైసీపీలో చేరి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్నికల ముందు తిరిగి సొంతగూడైన టీడీపీలోకి చేరారు. ఎన్నికల్లో చురుగ్గా వ్యవహరించారు. దీంతో ఆయనపై వైసీపీ వర్గీయులు ఆగ్రహంగా ఉన్నారు. ఆయనకు స్వగ్రామమైన పెద్దారవీడు మండలం తంగిరాలపల్లిలో ఏడు ఎకరాల దానిమ్మ తోట ఉంది. ఎన్నికలలో టీడీపీకి మద్దతుగా ప్రచారం చేశారని, ఓటర్లను ప్రభావితం చేశారన్న అక్కసుతో గుర్తు తెలియని వైసీపీ నాయకులు దానిమ్మ తోటకు నిప్పుపెట్టారు. దీంతో సుమారు 2.50 ఎకరాల మేర దానిమ్మ తోట పూర్తిగా కాలిపోయింది. అందులోని డ్రిప్ పైపులు, లేటర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షల మేర ఉంటుందని చెబుతున్నారు. ఈమేరకు బాలుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ధరలు పైపైకి..

- పొగాకు మార్కెట్‌లో కొనసాగుతున్న జోరు
- కిలో రూ.311 పలికిన గరిష్ఠ ధర



ఒంగోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో జోరు కొనసాగుతూనే ఉంది. రోజురోజుకూ ధరలు పైపైకి పోతున్నాయి. శనివారం మేలురకం గరిష్ఠ ధర గతం కన్నా మరో రూ.3 పెరిగి కిలో రూ.311 లభించింది. ఈ సీజన్ ప్రారంభం నుంచి మార్కెట్ పరుగులు తీస్తోంది. తొలుత నెలరోజులకుపైగా మేలురకం ధరలు కిలో రూ.250కి అటుఇటు నిలకడగా సాగుతూ మీడియం, లోగ్రేడ్‌లకు డిమాండ్ వచ్చి ధరలు పెరిగాయి. దీంతో రైతులు కూడా మేలురకం బేళ్లను ఇళ్ల వద్ద ఉంచుకొని లోగ్రేడ్ బేళ్లను వేలం కేంద్రాలకు తెస్తున్నారు. ఇప్పటికి కూడా ఆయా వేలం కేంద్రాలలో చూస్తే మేలురకం కన్నా మీడియం, లోగ్రేడ్ బేళ్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొద్దిమొత్తంలోనే మేలురకం తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్షం రోజులుగా మేలురకం ధరలను కూడా వ్యాపారులు పెంచారు. క్రమంగా ఆ ధరలు పెరుగుతున్నాయి. వారం క్రితం కిలో గరిష్ఠ ధర రూ.300కు చేరుకోగా, మూడు రోజుల క్రితం రూ.305, శుక్రవారం రూ.308, శనివారం మరో రూ.3 పెరిగి రూ.311కు చేరింది. ఒంగోలు-2 వేలం కేంద్రంలో ఈ ధర లభించగా, ఒంగోలు-1లో గరిష్ఠ ధర రూ.310.. ఇతర కేంద్రాల్లోనూ రూ.305 అంతకన్నా ఎక్కువగానే పలికింది. ఇక బ్రౌన్, లోగ్రేడ్‌లోని పచ్చధరలు కూడా బాగానే ఉండటంతోపాటు బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీ పడుతుండటం మార్కెట్లో కనిపిస్తోంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో సుమారు 50 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.339 వరకు ధర లభించింది. రానున్న రోజుల్లో మేలురకం బేళ్ల ధరలు మరికొంత పెరిగే అవకాశం ఉంది.

వాహనాలకు మాత్రమే..!

- సీసాలు, డ్రమ్ములకు డీజిల్, పెట్రోల్ కొడితే చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక



ఒంగోలు (కలెక్టరేట్), మే 18 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం నుంచి వచ్చేనెల 10వతేదీ వరకు వాహనాలకు మాత్రమే అవసరమైన మేరకు పెట్రోలు, డీజిల్‌ను నింపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను తప్పనిసరిగా పెట్రోలు బంకుల యజమానులు పాటించాలన్నారు. ఆ మేరకు కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బంకుల నుంచి పెట్రోలు, డీజల్ కంటైనర్లకు, బాటిల్స్‌కు, డ్రమ్ములు, ఇతర పాత్రలకు సరఫరా చేస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌తో నిఘాను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్‌ను పెట్రోలు బంకుల వారు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

తొమ్మిది ప్రైవేటు ఆసుపత్రులకు నోటీసులు

- గర్భిణులకు ఎక్కువగా సిజేరియన్లు చేయడమే కారణం

ఒంగోలు (కలెక్టరేట్), మే 18: జిల్లాలో గర్భిణులకు అత్యధికంగా ఆపరేషన్లు చేసిన తొమ్మిది ప్రైవేటు వైద్యశాలలకు వైద్యారోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. గర్భిణులు ప్రసవం కోసం ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. అయితే వందకు 80శాతం మంది మహిళలకు సిజేరియన్ (ఆపరేషన్లు) చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒంగోలులో ఆరు, మార్కాపురంలో రెండు, గిద్దలూరులోని ఒక ఆస్పత్రిలో ఎక్కువ సిజేరియన్‌లు చేసినట్లు తేలింది. సాధారణ కాన్పునకు ప్రాధాన్యత ఇచ్చి ఆ తర్వాతనే అవసరమైతే సిజేరియన్ చేయాల్సి ఉంది. కానీ ఆయా ప్రైవేటు హాస్పిటల్స్‌లో చేరిన గర్భిణులందరికీ ఆపరేషన్లు చేసినట్లుగా నిర్ధారించి ఈ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆయా ఆస్పత్రుల నుంచి వివరణ తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన

సివిల్స్ ర్యాంకర్ రాహుల్

కనిగిరి, మే 18 : ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సివిల్స్ ర్యాంకర్ వంగేపురం రాహుల్ అన్నారు. ఇటీవల యూపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో ఆయన 504 ర్యాంకు సాధించారు. స్థానిక ఐడీఎల్ కంప్యూటర్స్‌లో శనివారం విద్యార్థులతో కలసి తన అనుభవాలు పంచుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని అందుకోవడానికి క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఆ క్రమంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనా వాటిని అధిగమించేందుకు తమకు తాము బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభ గుర్తించేది మొదటిగా గురువులేనని చెప్పారు. వారిపట్ల గౌరవంతో మెలగాలన్నారు. ప్రతిఒక్కరూ సమాజ హితం కోసం పాటుపడే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఆ తపనతోనే తాను ఐఏఎస్ సాధించగలిగానన్నారు. సివిల్స్ సాధనలో రోజుకు 18 గంటల పఠనం ఎంతో అవసరమన్నారు. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఒక కుటుంబంలో వ్యక్తి ఉన్నతస్థాయికి ఎదిగితే ఆతర్వాత తరం అంతా ఉన్నత స్థానాలు అధిరోహించేందుకు బాటలు పడతాయన్నారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు గయాజ్‌బాషా, ప్రవీణ్‌కుమార్, పాపారాయుడు, ఫణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత సివిల్ ర్యాంకు సాధించి కనిగిరి ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన రాహుల్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ రాహుల్

ఎంత మోసం!

- ఎన్నికలు ముగిసే.. ట్యాంకర్ పోయే..!
- నీటి సరఫరా నిలిపివేసిన వైసీపీ ఎంపీ అభ్యర్థి



మార్కాపురం, మే 18: సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీ దిగుమతి నేతలకు ప్రాధాన్యం ఇచ్చింది. అందులో భాగంగా ఒంగోలు పార్లమెంట్‌కు చిత్తూరు జిల్లా నుంచి వలస వచ్చిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైసీపీ తరపున పోటీ చేశారు. ఈ క్రమంలోనే ఇక్కడి కరువు నేలపై ఓటర్లను ఆకట్టుకొనేందుకు ఆయన ట్యాంకర్లతో నీటిసరఫరా చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ట్యాంకర్లతో నీటిని అందించారు. అది ప్రజలమీద ప్రేమ అంటే కాదు. కేవలం ఓట్ల మీద మాత్రమే. ఈ క్రమంలోనే ఎన్నికలు ముగియడంతో ఆకస్మికంగా ప్రజలపై ప్రేమ మాయమైంది. ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాను నిలిపివేశాడు.


పశ్చిమ ప్రాంతంలో ముఖ్యంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కరువు తాండవిస్తోంది. తాగటానికి కనీసం నీళ్లు కూడా దొరకని పరిస్థితి. ఏటా వేసవిలో ఈ నియోజకవర్గంలో ప్రభుత్వమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినవారికి బిల్లులు చెల్లించలేదు. దీంతో నీరు సక్రమంగా అందడం లేదు. ఈ తరుణంలో ఎన్నికలకు రావడంతో గ్రామీణ స్థాయి నాయకుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం కొంతమేర మాత్రమే బిల్లులు విడుదల చేసింది. ప్రభుత్వంపై విశ్వాసం లేని ట్యాంకర్ల యజమానులు నీటి సరఫరాకు ముందుకు రాలేదు. దీంతో వైసీపీ తరపున ఒంగోలు నుంచి పోటీ చేయడానికి వలస వచ్చిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను తాను అపర భగీరథుడిగా ప్రకటించుకున్నారు. గ్రామాలలో అవసరమైనన్ని ట్యాంకర్లను ఏర్పాటు చేయండి, డబ్బులు నేనిస్తానని ప్రగల్భాలు పలికారు. దీనిపై సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేయించుకున్నారు. దీంతో చెవిరెడ్డిని చూసి వైసీపీ నాయకులు రెచ్చిపోయి గ్రామాలలో ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచి ట్యాంకర్లతో నీటి సరఫరా ప్రారంభించాడు. అయితే ఎన్నికలు మే 13న ముగియగా, మే 14వ తేదీ నుంచి నీటి సరఫరాను చెవిరెడ్డి నిలిపివేశారు. దీంతో ఆయన ప్రేమ ప్రజల మీద కాదు...! ఓట్లమీదే అనేది స్పష్టమైంది. ప్రస్తుతం నీటిసరఫరా లేకపోవడంతో గ్రామాల్లో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి.

ట్యాంకర్ల యజమానులు లబోదిబో

ఓట్ల లబ్ధికోసం చెవిరెడ్డి ట్యాంకర్లు ఏర్పాటు చేయగా, ఆయన మెప్పు కోసం ట్యాంకర్ల యజమానులు, వైసీపీ నాయకులు నీటిని సరఫరా చేశారు. దీని కోసం ట్యాంకర్‌కు రూ.500 చెవిరెడ్డి చెల్లించాల్సి ఉంది. మొత్తం రెండు నెలల్లో తొలినెల ట్యాంకర్ల యజమానులకు బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత బిల్లులు ఇవ్వకపోవడంతో ట్యాంకర్ల యజమానులు లబోదిబోమంటున్నారు. దీంతో తమ పరిస్థితి 'సింగడు రానూవచ్చాడు.. పోనూపోయాడు' అన్న తీరుగా ఉన్నదని స్థానిక నేతలు వాపోతున్నారు.

పేరుకుపోయిన బకాయిలు

- పంచాయతీల్లో పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం
- ఎన్నికల షెడ్యూల్ పేరుతో పట్టించుకోని వైనం
- జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో రూ.11.39 కోట్లు



ఒంగోలు (కలెక్టరేట్), మే 18 : జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్నులు భారీగా పేరుకుపోయాయి. ఆర్థిక సంవత్సరం ముగిసి రెండునెలలు గడుస్తున్నా ఇంకా రూ.11.39 కోట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలుగా వసూళ్లు మందగించాయి. జిల్లాలో 728 గ్రామపంచాయతీలు ఉండగా ఇంటి, ఇతర పన్నులు డిమాండ్ రూ.38.83 కోట్లు ఉంది. ఇప్పటివరకు రూ.27.44 కోట్లు మాత్రమే వసూలు కాగా రూ.11.39 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా చూస్తే జిల్లావ్యాప్తంగా సరాసరిన 71శాతం పన్నులు మాత్రమే వచ్చాయి. సాధారణంగా 2023-24 ఆర్థిక సంవత్సరం గత మార్చితో ముగిసి 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు నూరుశాతం పన్నులు కట్టించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పట్టించుకోకపోవడంతో పన్నులు వసూలు కాలేదని తెలుస్తోంది.

మూడు డివిజన్లలోనూ బకాయిలు

ఒంగోలు డివిజన్‌లో రూ.20.91 కోట్లు చేయాల్సి ఉండగా రూ.14.83 కోట్లు వచ్చాయి. ఇంకా రూ.6.08 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కనిగిరి డివిజన్‌లో రూ.8.76 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.6.01 కోట్లు వచ్చాయి. ఇంకా రూ.2.75 కోట్లు పెండింగ్‌లో ఉంది. మార్కాపురం డివిజన్‌లో రూ.9.16 కోట్లు డిమాండ్ ఉండగా రూ.6.60కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.2.56 కోట్లు పెండింగ్‌లో ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కునారిల్లుతుండగా కనీసం రావాల్సిన ఇంటి పన్నులు కూడా సకాలంలో కట్టించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సర్పంచ్‌లు ఆయా గ్రామపంచాయతీల్లో లక్షల్లో అప్పులు తెచ్చి వివిధ రకాల పనులు చేపట్టారు. ఆ పనులకు చెల్లించాల్సిన బిల్లులు రావడం లేదు. కనీసం పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేస్తే అత్యవసర పనులు చేసుకునేందుకైనా అవకాశం ఉండేది. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

స్ట్రాంగ్‌రూం భద్రత పరిశీలన



స్ట్రాంగ్‌రూం సీలును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూం భద్రతను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. శనివారం రాత్రి ఎస్పీ గరుడ్ సుమిత్‌తో కలిసి స్ట్రాంగ్‌రూంలకు వేసిన సీల్‌ను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను పటిష్ఠంగా చేపట్టడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో కలెక్టర్, ఎస్పీ సంతకం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పట్టించుకోరా..?

● నగరంలో వాహనదారుల నరకయాతన



గాంధీరోడ్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఒంగోలు(క్రైం), మే18: ఒంగోలు నగరంలో ట్రాఫిక్ సమస్యను పోలీసులు గాలికి వదిలేశారు. దీంతో ఇంటి నుంచి బయిటకు రావాలంటే భయ పడాల్సి వస్తోంది. నిత్యం ట్రాఫిక్ ఎక్కడిక్కడ స్తంభిస్తుండడంతో నగరం ప్రయాణం నరకంగా మారింది. శనివారం రాత్రి స్థానిక గాంధీరోడ్‌లో ద్విచక్రవాహనంపై ప్రయాణం చేయడం గగనంగా మారింది. సుమారు గంట పాటు ట్రాఫిక్‌లో ఉండిపోవడతో వాహనదారులు గగ్గోలు పెట్టారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాగర్ సెంటర్, మంగమూరు రోడ్డు జంక్షన్ తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ నియంత్రణను పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో పోలీసులు నియంత్రణ చర్యలు చేయకుండా వారు తమ ఇష్టానుసారం వహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

దక్షిణకొరియా యూనివర్సిటీతో

క్విస్ విద్యాసంస్థల ఒప్పందం



ఒప్పందపత్రాలను స్వీకరిస్తున్న సూర్యకళ్యాణ్‌చక్రవర్తి

ఒంగోలు(విద్య), మే 18 : దక్షిణ కొరియాలోని క్యుంగ్‌డాంగ్ యూనివర్సిటీ గ్లోబల్‌తో ఒంగోలులోని క్విస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(క్విస్‌సెట్) ల్యాండ్ మార్క్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. యూనివర్శిటీ ప్రెసిడెంట్ డాక్టర్ జాన్‌క్యులీ, క్విస్ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్య కళ్యాణ్‌చక్రవర్తి ఈ ఎంఓయూపై అధికారికంగా సంతకం చేశారు. రెండు సంస్థల విద్యార్థులకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్, క్రాస్-కల్చరల్ లెర్నింగ్ అనుభవాలను సులభతరం చేయడం, బోధన, పరిశోధన అవకాశాల ద్వారా విద్యా, వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం, వివిధ రంగాల్లో ఆవిష్కరణలు, పురోగమనాలను నడపడానికి జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్టుల్లో పాల్గొనడం వంటివి జరుగుతాయి. క్యుంగ్‌డాంగ్ యూనివర్శిటీ గ్లోబల్‌తో చేతులు కలపడానికి ఎంతో సంతోషిస్తున్నామని క్విస్ విద్యా సంస్థల చైర్మన సూర్యకళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు, అధ్యాపకులకు విద్యా అనుభవాన్ని పెంపొందించేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల ఫ్యాకల్టీ అసోసియేట్ డీన్‌డాక్టర్ నూర్ ఆలం ఎండీ, కొరియన్ యూనివర్శిటీ అడ్మిషన్ సెంటర్ ఎండీ జూలియాజంగ్, క్విస్‌సెట్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ.హనుమంతరావు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ బీవీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్‌ల్యాబ్ ట్యాబ్‌లను

సమర్థవంతంగా వినియోగించాలి

● డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ఒంగోలు(విద్య), మే 18 : పాల్‌ల్యాబ్ సౌకర్యం ఉన్న పాఠశాలల్లో పాల్‌ల్యాబ్ ట్యాబ్‌లను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఎంఆర్.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఒంగోలులో శనివారం ప్రకాశం, బాపట్ల, అలాగే ప్రకాశం జిల్లాల్లో పాల్‌ల్యాబ్ సౌకర్యం ఉన్న 74 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ చేసినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పాల్‌ల్యాబ్ సౌకర్యం అన్ని పాఠశాలల్లో లేదని, అలాంటి సౌకర్యం ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డీఈవో సుభద్ర మాట్లాడుతూ పాల్‌ల్యాబ్‌లను విద్యార్థులు ఎక్కువ సమయం పాటు సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలన్నారు. పాఠశాలల ప్రగతిని ఆయా సిబ్బందితో సమీక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కిషోర్, కన్వీజినియస్ సీనియర్ మేనేజర్లు సౌరవ్‌గౌడ్, ఉజ్వల్, రూపేష్, సమగ్ర శిక్ష జిల్లా నోడల్ అధికారి మాధవీలత, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్, బండ్లమిట్ట పాఠశాల హెచ్‌ఎం జి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను

సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, మే 18 : విద్యార్థులు గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ సూచించారు. ఉప్పుగుండూరులోని గ్రంథాలయంలో శనివారం శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు విద్యార్థులతో పుస్తక పఠనం, పలు ఆటల పోటీలను నిర్వహించారు. గ్రంథపాలకులు ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం ● 24నుంచి ఇంటర్, టెన్త్, వచ్చేనెల 1నుంచి ఓపెన్ స్కూల్స్ సప్లిమెంటరీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: జిల్లాలో ఈనెల 24వతేదీ నుంచి ప్రారంభం కానున్న సప్లిమెంటరీ పరీక్షలను పడక్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 24నుంచి ఇంటర్మీడియట్, టెన్త్ పరీక్షలు, వచ్చేనెల 1నుంచి జరగనున్న ఏపీ ఓపెన్ స్కూల్స్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24నుంచి జూన్ 1వతేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి 5.30 గంటల వరకు రెండో సంవత్సరం వారికి పరీక్షలు జరుగతాయని చెప్పారు. పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 15,291 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 7,075 మంది హాజరుకానుండగా, అందుకోసం 43 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24నుంచి వచ్చేనెల 3వతేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు 3,871 మంది హాజరుకానుండగా 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్స్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలకు 896 మంది విద్యార్థులు హాజరుకానుండగా 6 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇంటర్ పరీక్షలకు 2,612 మంది హాజరుకానుండగా అందుకోసం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల్లో మాస్ కాపియింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించాలన్నారు. సమావేశంలో ఆడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, ఆర్ఐవో సైమన్‌విక్టర్, డీఈవో సుభద్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్టీసీ, విద్యుత్, తపాలా, ట్రెజరీశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇతర జిల్లాల పోస్టల్ బ్యాలెట్ బాక్సులు రాక

● స్ట్రాంగ్‌రూంలకు తరలించిన అధికారులు



పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: ఇతర జిల్లాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ల బాక్సులు జిల్లాకు చేరారు. శనివారం ఒంగోలులోని స్పందనహాలులో ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్ల బాక్సులను రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఒంగోలు పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.రుూన్సీలక్ష్మి, జిల్లా పోస్టల్ ఎన్నికల అధికారి యు.విశ్వేశ్వరరావు పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల బాక్సులను సీల్ ఓపెన్ చేసి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల వారీగా విభజన చేసి అసెంబ్లీలకు సంబంధించిన పోస్టల్ ఓట్లను ఆయా నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూములకు పంపారు. ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలెక్టరేట్‌లోని పార్లమెంట్ స్ట్రాంగ్ రూములో భద్రపర్చారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్ పార్లమెంట్ ఓట్లు 2,330, అసెంబ్లీ ఓట్లు 2,343 బాక్సుల్లో పెట్టి సీల్ వేసి పోలీస్ బందోబస్తుతో స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఆర్వో జీవీ.సుబ్బారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, రసూల్, బి.రాజశేఖర్, స్వరూప్, రాయపాటి జగదీష్, కొండారెడ్డి, యోహాన్, కోటేశ్వరరావు, బాలాంజనేయులు, టి.హరిప్రసాద్, బి.ఏడుకొండలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంత్యుత్సవం





హరిహరక్షేత్రంలో వాసవీమాత, కలశాలను తీసుకువస్తున్న లక్ష్మీపద్మావతి, వాసవీమహిళలు



సంతనూతలపాడులో పూజలు చేస్తున్న భక్తులు

చీమకుర్తి, మే18 : చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో వాసవీమాత జయంతి మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శిద్దా లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. వాసవీ మహిళలు కలశాలతో అమ్మవారికి అభిషేకం జరిపారు. నగరేశ్వరస్వామి ఆలయం నుంచి 102కలశాలతో ఆర్యవైశ్య మహిళలు పట్టణంలో ఊరేగింపుగా తీసుకువచ్చిన జలాలతో అభిషేకం సామూహిక లలితాసహస్రనామ పారాయణ, కుంకుమార్చన నిర్వహించారు. తదుపరి జరిగిన అమ్మవారి నగరోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పాండురంగారావు, శిద్దా పెద్దబాబు, సాయిబాబు, శిద్దా సుధాకర్, బాలాజీ, సురేష్, జయశ్రీ, పుష్పలత, జయభారతి, పల్లపోతు పద్మ, సువర్ణ, అరుణ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడులో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వర అమ్మవారికి శనివారం కుంకుమపూజలను సీతారామస్వామి నిత్య భజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయపూజారి జి.శివరామక్రిష్ణ వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకోగా వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మందిరం కమిటీ అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, పి.ఆంజనేయులు, సత్యనారాయణ, వెంకటచినక్రిష్ణారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



ఒంగోలులో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఉప్పుగుండూరులో స్వామివారి కల్యాణం

ఒంగోలు(కల్చరల్), మే 18: ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని శ్రీఅచలానంద ఆశ్రమంలో గత మూడు రోజులుగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీగోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి వారి కళ్యాణోత్సవం శనివారం మధ్యాహ్నం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అచలానంద ఆశ్రమం నిర్వాహకులు స్వామి పరిపూర్ణ సిద్ధానంద పర్యవేక్షణలో అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, మాంగల్య పూజ, మాంగల్య ధారణ మొదలైన క్రతువులు నిర్వహించారు. లోక కళ్యాణం కోసం జన్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి తన కాలజ్ఞానం ద్వారా అనేక విషయాలను లోకానికి తేటతెల్లం చేశారన్నారు. స్వామి వారి కళ్యాణం కూడా లోకకళ్యాణమేనని, దానిని చూసే భక్తులను స్వామి వారు అనుగ్రహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శనివారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు గోనుగుంట వీర బ్రహ్మచారి శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపారు. స్వామి వారి కళ్యాణోత్సవం అనంతరం పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. కమిటీ సభ్యులు పూర్ణచంద్రరావు, ప్రకాశరావు, నాగకుమారశర్మ, కేఎల్.నాగేశ్వరరావు, మురళీ, మధుసూదనరావు, హనుమంతరావు, జి.నాగేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి



ఒంగోలు గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి



సంతనూతలపాడులో పరిశీలిస్తున్న ఎంఈవో వెంకారెడ్డి

ఒంగోలు (కల్చరల్), మే 18: ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాను ఆదిలక్ష్మి కోరారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి శిక్షణ ద్వారా వివిధ కళలు, విజ్ఞాన సంబంధ విషయాలలో ఆయా రంగాల ప్రముఖులచే శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ గ్రంథాలయానికి తరచూ రావటం విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాలన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమ నాయకులు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో కథలు చెప్పటం, చదవటం, వ్యక్తిత్వ వికాసం, మోటివేషన్ ఆఫ్ రీడింగ్, ఇంటరాక్షన్ విత్ బుక్స్ మొదలైన అంశాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జాలాది మోహన్, సీహెచ్.సుధాకరరావు, డి.సందీప్, పి.ఇమ్మానియేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞానశిబిరాన్ని శనివారం ఎంఈవో వెంకారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ వేసవి శిబిరం వల్ల ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, పాఠశాలలు పునఃప్రారంభం అయిన తర్వాత శిక్షణ కార్యక్రమాలు ఉప యోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆటో, మినీ లారీ ఢీ

● ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

పొదిలి, మే 18: ఆటో-మినీలారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పొదిలి మండలం కంభాలపాడు గ్రామ సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన రమాదేవి, తన కొడుకు, కోడలు అరుణ్‌కుమార్, పుష్పాలు, మరో కుమారుడు మధురోహిత్ (21) కలిసి విజయవాడ కనకదుర్గమ్మతల్లిని దర్శించుకోవడానికి సొంత ఆటోలో వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి, తిరిగి స్వగ్రామం నంద్యాలకు బయలు దేరారు. ఈ క్రమంలో కంభాలపాడు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న మినీలారి వీరి ఆటోను అకస్మాత్తుగా ఢీకొట్టింది. దీంతో ఆటోలోని మధురోహిత్ అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఆటోనడుపుతున్న అరుణ్‌కుమార్ తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. రమాదేవికి కుడికాలు, కుడిచేయి విరిగింది. అరుణ్‌కుమార్ భార్య పుష్పకు ఎడమకాలు, కుడిచేయి విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

అవీ..ఇవీ..

జిల్లా జైలులో ఖైదీల వసతుల పరిశీలన



జైలు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు(క్రైం), మే18: ఒంగోలులోని జిల్లా జైలులో ఖైదీలకు ఉన్న వసతులను జిల్లా న్యాయాధికారి ఎ.భారతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబుతో కలిసి ఆమె జైలులోని వసతులను తనిఖీ చేశారు. ఖైదీలకు ఇస్తున్న ఆహార పదార్థాలు, మౌలిక వసతులు గురించి ఖైదీలతో మాట్లాడి తెలుసుకున్నారు. అదేవిధంగా వైద్యసదుపాయం, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అనంతరం జైలుశాఖ నడుపుతున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న జీవిత ఖైదీలతో మాట్లాడారు. వారి వెంట జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, డాక్టర్ బ్రహ్మతేజ, జైలర్ రమేష్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్దిపాడు, మే 18: మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివార్లకు అజస్ర దీపారాధన, దీక్షాధారణ మొదలైన కార్యక్రమాలను అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖర్, కొండూరు శ్రీనివాస రాఘవ అయ్యంగార్లు వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. దండే శ్రీనివాసరావు, కవిత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

వైభవంగా దత్తాత్రేయస్వామి ఉత్సవాలు



స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిపాడు, మే 18: మద్దిపాడు మండలం నేలటూరులో దత్తాత్రేయ స్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురవయ్య గురుస్వామి మాలధారణ చేసి వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలలో గ్రామస్తులతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దత్తాత్రేయ భజన, అభిషేకాలు, కలశాలను తీసుకు వెళ్లి లింగసముద్రం మండలం మొగిలిచర్లలోని దత్తాత్రేయ ఆలయంలో సమర్పణ మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా సీతమ్మతల్లి జన్మదినోత్సవం



ఆలయం వద్ద నృత్యం చేస్తున్న చిన్నారులు

ఒంగోలు (కల్చరల్), మే 18: ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని శ్రీఅనంత కోదండరామ స్వామి దేవస్థానంలో సీతమ్మ తల్లి జన్మదిన వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ, విశేషపూజలు జరిగాయి. అనంతరం ఆల్ ఇండియా కళారంగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరిలో ఎ.మనోహర్, డి.కోటేశ్వరరావు, టి.శ్రీదేవి, ఎస్.లక్ష్మి తదితరులు తమ గానంతో భక్తులను అలరించారు. అదేవిధంగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వేంకట శ్రీనివాసులు ఆధ్యాత్మిక ఉపన్యాసం చేస్తూ సీతాదేవి చరిత్రను అద్భుతంగా వర్ణించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, అర్చకులు రాము శర్మ, కిషోర్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

టీఎస్ ఎంసెట్‌లో శ్రీసరస్వతి విద్యార్థి ప్రతిభ



సాకేత్‌సాయిరాంను అభినందిస్తున్న రమణారెడ్డి, సిబ్బంది

ఒంగోలు(విద్య), మే 18: తెలంగాణ ఎంసెట్-24 ఫలితాల్లో ఒంగోలుకు చెందిన శ్రీసరస్వతి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కె.సాకేత్‌సాయిరాం 854వ ర్యాంకు సాధించి తన సత్తా చాటారు. 2వేల లోపు ర్యాంకులు ఇద్దరు, 5వేల లోపు ర్యాంకులు పది మంది, 10వేల లోపు ర్యాంకులు 22మంది సాధించారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ఏవీ.రమణారెడ్డి మాట్లాడుతూ ఆల్ ఇండియా స్థాయిలో శ్రీసరస్వతి విద్యా సంస్థలకు గుర్తింపు తీసుకువచ్చేందుకు సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఈ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యా సంస్థల డైరెక్టర్ ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.310

సంతనూతలపాడు, మే 18: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శనివారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.310 పలికింది. మంగమూరు నుంచి 1,219 పొగాకు బేళ్లు రాగా 1,074 బేళ్లు అమ్ముడయ్యాయి. 136 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర కిలో రూ.205, సరాసరి ధర రూ.252.88 వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

49 ద్విచక్రవాహనాలు సీజ్



వాహన తనిఖీలను చేపడుతున్న సీఐ, సిబ్బంది

ఒంగోలు(క్రైం), మే 18: ఒంగోలు నగరంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీలను చేపట్టారు. స్థానిక అద్దంకి బస్టాండ్, కోలాస్ సెంటర్‌లో వన్‌టౌన్ సీఐ అలిసాహేబ్, సిబ్బందితో కలిసి వాహనాలకు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వారి వాహనాలు సీజ్ చేశారు. 49 వాహనాలను రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. కార్యక్రమలో ఎస్ఐ కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సంయమనం పాటించాలి : సీఐ

ఒంగోలు(క్రైం), మే 18: ఎన్నికల సందర్భంగా నగరంలో చిన్నచిన్న ఘటనలు మినహ ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రజలు సహకరించారని, అదే విధంగా కౌంటింగ్ కూడా సహకరిచాలని వన్‌టౌన్ సీఐ అలిసాహెబ్ కోరారు. శనివారం ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులు, పోలింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు సహకరించాలన్నారు. అదేవిధంగా కౌంటింగ్ రోజు, అనంతరం సయమనం పాటించాలని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్‌బాబు, స్టేషన్‌రైటర్ రసూల్ పాల్గొన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

నాగులుప్పలపాడు, మే 18 : గుర్తుతెలియని వ్యక్తులు బైక్ చోరీ చేయడంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పుగుండూరు గ్రామంలోని దిన్నెమీద అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో నివసిస్తున్న బెల్లం శ్రీనివాసరావు తన హోండా షైన్ బైకు (ఏపీ 40 బీహెచ్ 1883)ను శుక్రవారం రాత్రి ఇంటి బయట నిలిపి నిద్రించారు. అర్థరాత్రి దొంగలు బైకును చోరీ చేయగా ఉదయాన్నే గుర్తించిన యజమాని నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి : ఎంపీడీవో

నాగులుప్పలపాడు, మే 18: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు పనిచేయాలని ఎంపీడీవో మహాలక్ష్మి సూచించారు. శనివారం ఉప్పుగుండూరు గ్రామంలో పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. చెత్త, మురుగు నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు సూచించాలన్నారు. ప్రజలతో అధికారులు భాగస్వామ్యమై గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, కార్యదర్శి హరిబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వీసు ఓటర్ల బ్యాలెట్ బాక్సును భద్రపరిచిన గది వద్ద ఏఆర్వో సుధాకర్‌రావు, పోలీసు

24 సర్వీసు ఓట్లను భద్రపరిచి సీల్

కొండపి, మే 18 : నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన సర్వీసు ఓటర్లు 93 మంది బ్యాలెట్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరు పోస్టు ద్వారా తమ ఓట్లను ఆర్వోకి పంపుతున్నారు. అలా శనివారానికి 24 మంది నుంచి అందాయి. నియోజకవర్గ ఏఆర్వో, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సుధాకర్‌రావు సమక్షంలో 24 ఓట్లు ఉన్న బాక్సుకు సీల్ వేసి కొండపిలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. అక్కడ ఓ పోలీసును కాపలా ఉంచారు. సర్వీసు ఓటర్లు వచ్చేనెల 3వ తేదీ కౌంటింగ్ రోజు ఉదయం 7 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. కౌంటింగ్ రోజున వీటిని లెక్కిస్తారని అధికారులు తెలిపారు.



టంగుటూరు వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

పొగాకు కిలో రూ.307

● కొండపిలో లభించిన గరిష్ఠ ధర

కొండపి, మే 18 : కొండపి వేలం కేంద్రంలో మేలు రకం పొగాకు ధర కిలో రూ.307 పలికింది. శనివారం చౌటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, దాసరెడ్డిపాలెం, కొండపి గ్రామాలకు చెందిన రైతులు 961 బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. వ్యాపారులు 909 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు.

టంగుటూరులో కిలో రూ.305

టంగుటూరు : టంగుటూరు వేలం కేంద్రంలో మేలు రకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.305 లభించింది. శనివారం కె.ఉప్పలపాడు రైతులకు చెందిన 654 బేళ్లు అనుమతించారు. ఇందులో 625 బేళ్లన వ్యాపారులు కొనుగోలు చేశారు. 29 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 పలికింది. సరాసరి ధర రూ.261.80 రైతులకు లభించింది.



టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్

చంద్రబాబును కలిసిన లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, మే 18: టీడీపీ అధినేత చంద్రబాబును దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్, ఆమె చినమామ, ఏఎంసీ మాజీ చైర్మన్ కడియాల రమేష్‌లు కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో శనివారం వారు కలిసి దర్శి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ తీరును వివరించారు. ఈసందర్భంగా చంద్రబాబు అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని, కుటుంబ సభ్యులను, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకలను అభినందించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేశారని ప్రశంసించారు. వైసీపీ దాడులను, దుష్ప్రచారాన్ని విజయవంతంగా తిప్పికొట్టారని అన్నారు. ప్రజల్లో టీడీపీ కూటమి పట్ల విశ్వాసం మరింత పెరిగే విధంగా కృషి చేశారని చంద్రబాబు అభినందించినట్లు వారు వివరించారు. దర్శి అసెంబ్లీలో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీగా ఓట్లు వేసినట్లు పరిశీలనలో తేలిందని చంద్రబాబు వివరించినట్లు తెలిపారు. అహర్నిశలు కష్టపడి పని చేసిన కార్యకర్తలను అభినందించారు.



ఆకు పూజలో పాల్గొన్న భక్తులు

శింగరకొండలో భక్తుల రద్దీ

అద్దంకి, మే 18 : శింగరకొండలో శనివారం భక్తుల రద్దీగా పెరిగింది. విద్యార్థులకు వేసవి సెలవులు కావడం, పలు పరీక్షల ఫలితాలు రావడంతో పిల్లలతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో మొక్కు తీర్చుకునేందుకు తరలివచ్చారు. అదే సమయంలో పొలం పనులు పూర్తి కావడంతో రైతులు కూడా తమ కుటుంబాలతో వచ్చి పొంగళ్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆకు, వాహనపూజలలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న గొట్టిపాటి

అద్దంకి, మే 18 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం శబరిమల లో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం మూడు రోజుల పాటు అద్దంకి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల టీడీపీ నేతలతో సమీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అనంతరం హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి శబరిమలకు వెళ్లిన రవికుమార్ సాయంత్రం అయ్యప్పస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

ఇళ్లకు చేరిన అభ్యర్థులు

- రెండు పార్టీల తరపున పోటీ చేసింది 26 మంది
- శనివారం నియోజకవర్గాల్లో ఉన్నది ఐదుగురే
- కూడికలు తీసివేతలు పూర్తికాగానే నివాసిత ప్రాంతాలకు చేరిక
- అత్యవసర చెల్లింపులపై దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత కొంతకాలంగా ఎన్నికల సమరంలో నిమగ్నమై నియోజకవర్గాలకే పరిమితమైన ప్రధాన పార్టీల అభ్యర్థులు స్వగ్రామాలకు లేక సొంత ఇళ్లకు చేరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల్లో కేవలం ఐదుగురు మాత్రమే నియోజకవర్గాల్లో కనిపించారు. మొత్తం 26 మంది ఈ రెండు పార్టీల మధ్య పోటీలో ఉండగా అందులో 21మంది విశ్రాంతి కోసమో, అత్యవసర పనుల కోసమో నియోజకవర్గాన్ని వీడారు. సహజంగా పోలింగ్ అనంతరం కింది స్థాయిలో ప్రధాన పార్టీల శ్రేణుల మధ్య వివాదాలు, ఘర్షణలు చెలరేగుతుంటాయి. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఆ పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నియోజకవర్గాల్లోనే ఉండి పార్టీశ్రేణులకు చేదోడుగా ఉండాల్సిన అవసరం ఉంది. పోలింగ్ రోజు దర్శి, ఒంగోలు, చీరాలలాంటి ప్రాంతాల్లో చెదురుమదురు ఘర్షణలు జరగ్గా ఒంగోలులో పోలింగ్ అనంతరం కూడా ఘర్షణలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో పోటీచేసిన అభ్యర్థులు నియోజకవర్గాల్లో ఉన్నారా? లేదా? కాకపోతే ఎక్కడ ఉన్నారన్న శనివారం మధ్యాహ్నం ఆంధ్రజ్యోతి బృందం ఒక పరిశీలన చేసింది. ఆ ప్రకారం చూస్తే అత్యధిక శాతం అభ్యర్థులు నియోజకవర్గాల్లో కనిపించలేదు. టీడీపీ అభ్యర్థుల్లో ఎమ్మెల్యే స్వామి, ఉగ్రనరసింహారెడ్డి, ఎరిక్షన్‌బాబులు, వైసీపీ తరుపున అన్నా రాంబాబు, దద్దాల నారాయణయాదవ్ మాత్రమే నియోజకవర్గాల్లో కనిపించారు.



వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజల అనంతరం దేవస్థాన ప్రాంగణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే స్వామి

కొందరు పోలింగ్ మరుసటి రోజే..

ఎన్నికల సమరంలో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నెల నుంచి మూడు నెలలపాటు ఆయా నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. ఆ సందర్భంగా అభ్యర్థుల్లో స్థానికులు, స్థానికేతరులు అన్న ప్రచారం ముమ్మరం కావడంతో ఎవరికివారు అనుక్షణం నియోజకవర్గంలోనే ఉంటాం, మీకు అండగా ఉంటాం అని ప్రకటనలు చేశారు. కానీ చాలామంది పోలింగ్ అయిన ఒకటి రెండురోజుల వ్యవధిలోనే ఎక్కడో నివాసం ఉండే సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఆయా నియోజకవర్గాల వారీ చూస్తే ఒంగోలు లోక్‌సభ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన, స్థానికేతరుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోలింగ్ సోమవారం జరగ్గా, మంగళవారం నుంచే నియోజకవర్గంలో కనిపించలేదు. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి మాత్రం రెండు రోజులపాటు ఒంగోలులోని తన కార్యాలయంలో అందుబాటులో ఉండి, ఆ తర్వాత చెన్నై వెళ్లారు. ఒంగోలు అసెంబ్లీలో పోటీచేసిన వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పోలింగ్ సోమవారం జరగ్గా బుధవారం నుంచే కుటుంబంతో నివాసం ఉండే హైదరాబాద్ చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి శనివారం ఉదయం బయలుదేరి బెంగళూరు వెళ్లారు. కొండపి అసెంబ్లీలో వైసీపీ నుంచి పోటీచేసిన మంత్రి సురేష్ మోకాలికి శస్త్రచికిత్సకు అవసరం ఉందని తెలియజేస్తూ బుధవారం ఉదయమే హైదరాబాద్ చెక్కేశారు. ఆయన కుటుంబం కూడా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. అయితే టీడీపీ అభ్యర్థి స్వామి మాత్రం నియోజకవర్గాన్ని వీడలేదు. మధ్యలో ఒకరోజు కొన్ని గంటలపాటు ఒంగోలు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకున్నారు. సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి విజయకుమార్ మూడు రోజులపాటు పార్టీశ్రేణులతో మమేకమై హైదరాబాద్ వెళ్లిపోయారు. వైసీపీ అభ్యర్థి అయిన మంత్రి నాగార్జున పోలింగ్ అయిన రెండో రోజే తన వ్యాపారాలు విస్తరించి ఉన్నాయని ప్రజలు భావిస్తున్న విశాఖపట్టణం చేరారు. కనిగిరి నియోజకవర్గంలో ఇటు టీడీపీ, అటు వైసీపీ అభ్యర్థులు అయిన డాక్టర్ ఉగ్ర, దద్దాల శనివారం మధ్యాహ్నం కూడా నియోజకవర్గంలోనే కనిపించారు. అయితే శనివారం రాత్రికి డాక్టర్ ఉగ్ర కుటుంబంతో బయటకు వెళ్తారని తెలిసింది. గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి రెండోరోజే హైదరాబాద్ వెళ్లారు. స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి నాలుగు రోజులపాటు గిద్దలూరులోనే ఉండి, తర్వాత స్వస్థలమైన మార్కాపురం చేరారు. మార్కాపురంలో వైసీపీ అభ్యర్థి రాంబాబు ఆ రోజు నుంచి ఇప్పటి వరకు మార్కాపురంలోనే ఉన్నారు. టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి మాత్రం రోడ్డుప్రమాదంలో దెబ్బతిన్న కాలి వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ చేరారు.

ఎర్రగొండపాలెంలో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు పోలింగ్ జరిగిన మరుసటి రోజు మధ్యాహ్నం నుంచి గతంలో వలే నియోజకవర్గంలో పర్యటిస్తుండటం విశేషం. శనివారం కూడా గ్రామాల్లో ప్రజలతో మమేకమై అతను కనిపించారు. స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పోలింగ్ అయిన రెండోరోజే హైదరాబాద్ చెక్కేశాడు. దర్శిలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్థానికుడినని చెప్పుకున్న శివప్రసాద్‌రెడ్డి రెండో రోజే విశాఖపట్టణంలో కనిపించారు. ప్రస్తుతం ఆయన కుటుంబం నివాసం ఉండే హైదరాబాద్‌లో ఉన్నారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మి మూడు రోజుల అనంతరం నరసరావుపేటకు వెళ్లిపోయారు. మధ్యలో ఒక పూట దర్శి వచ్చి వెళ్లారు. శనివారం సాయంత్రం మాత్రం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబుని కలిశారు.

కందుకూరులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావు కుటుంబం హైదరాబాద్‌లో, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ కుటుంబం బెంగళూరులో ఉంటారు. పోలింగ్ అయిన రెండో రోజు నుంచి ఆ ఇద్దరు నియోజకవర్గానికి గుడ్‌బై చెప్పి ఒకరు హైదరాబాద్, ఒకరు బెంగళూరు వెళ్లి కుటుంబాలతో గడుపుతున్నారు. అద్దంకిలో స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి రెండోరోజు హైదరాబాద్ చెక్కేశారు. మూడు రోజులపాటు ఆయా మండలాలకు వెళ్లి సమీక్షలు చేసుకున్న టీడీపీ అభ్యర్థి రవికుమార్ కుటుంబంతో నివాసం ఉండే హైదరాబాద్‌కు చేరారు. పర్చూరులో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన స్థానికేతరుడైన బాలాజీ రెండోరోజే హైదరాబాద్ చేరారు. టీడీపీ అభ్యర్థి సాంబశివరావు కూడా గురువారం రాత్రి హైదరాబాద్ వెళ్లిపోయారు. చీరాల వైసీపీ, టీడీపీ అభ్యర్థులు ఇరువురూ స్థానికంగాలేరు. తొలి రెండు రోజులు కనిపించి చివరికి వారు నివాసం ఉండే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆయా ప్రాంతాలకు వెళ్లిన అభ్యర్థులు కూడా ఎన్నికల్లో భారీగా వ్యయం చేయాల్సి వచ్చి చివరలో అప్పులు కూడా చేశారు. అలాంటి వారు అత్యవసరంగా సర్దుబాటు చేసే పనిలో కూడా వారు ఉన్నట్లు తెలుస్తోంది.

వరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, మే 18 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం దర్శించుకున్నారు. వరాహ లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లు, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సింగరాయకొండ రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రయాణికులతో రద్దీగా ఉన్న కనిగిరి డిపో

వలస ఓటర్లు తిరుగు ప్రయాణం

● రద్దీగా బస్సులు ● గమ్యస్థానాలకు చేరేందుకు పడిగాపులు

కనిగిరి, మే 18: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కనిగిరి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వలస ఓటర్లు స్వగ్రామాల్లో ఓటు వేసేందుకు వచ్చారు. ఈనెల 13న తమ ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు తమ జీవనపోరాటం నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వేళ్ళేందుకు ఆర్టీసీలో తగినన్ని సీట్లు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయివేటు బస్సులను ఆశ్రయించాల్సి వస్తుంది. బస్సుల యాజమాన్యాలు అవకాశాన్ని అదనుగా తీసుకుని రేట్లు విపరీతంగా పెంచేశారు. దీంతో చేసేది లేక అదనపు చార్జీలు చెల్లించి తిరుగు ప్రయాణం అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళాలంటే ఒక్కో వ్యక్తికి దాదాపు రూ.1500లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదనపు చార్జీలు భారం మోయలేని పేద కుటుంబాలు ఆర్టీసీ బస్సులే దిక్కయ్యాయి. దీంతో డిపో ప్రయాణికులతో కిటకిట లాడుతుంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం బెంగుళూరు, హైద్రాబాద్, చెన్నై, ప్రాంతాలకు అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మార్టూరు, మే 18 : జాతీయ రహదారిపై మండల పరిధి రాజుపాలెం కూడలి వద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న తాళ్లూరి వెంకయ్య (27)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధ రాత్రి జరిగింది. వెంకయ్య జె.పంగులూరు మండలం బైట మంజులూరు గ్రామానికి చెందిన వాడు. అతనికి భార్య మరియరాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో వెంకయ్య ద్విచక్రవాహనంపై బైట మంజులూరు నుంచి భార్య సొంత ఊరు మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి వస్తున్నాడు. బైకుపై అతను గుంటూరు వైపు వెళుతుండగా రాజుపాలెం కూడలి వద్ద హైవే నుంచి రాజుపాలెం రోడ్డులోకి రావడానికి ఎడమవైపు సర్వీసు రోడ్డులోకి వస్తుండగా గుంటూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి వెంకయ్య బైక్‌ను ఢీకొన్నది. దాంతో బైక్‌తో రోడ్డుపై వెంకయ్య పడి పోగా అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వెంకయ్యను స్థానికులు మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం చిలకలూరిపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందిన తర్వాత ఇంటికి తీసుకు వస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. వెంకయ్య తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ సాయిరాం తెలిపారు.

అందని సంధికాలపు భత్యం

- గంగపుత్రుల గగ్గోలు
- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్ర వేట నిషేధం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం

చీరాల, మే 18 : ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేట నిషేధం జరుగుతుంది. ఆ సమయంలో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరిగుతుంది. ఆప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం వేటను నిషేధిస్తుంది. సముద్రంలో వేట నిషేధిత సమయాన్ని సంధికాలం అంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం రూ.10వేలు సంధికాలపు భత్యంగా వేట నిషేధం మొదలైన రోజునే అర్హులైన మత్స్యకారుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలి. సముద్రంలో వేట నిషేధించి నెల దాటింది. అయినా నేటికి సంధి కాలం భత్యం జమకాకపోవడంతో గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు.



ఆగిన వేటతో.. వాడరేవు తీరంలో ఒడ్డున ఉన్న పడవలు

కడలిని నమ్ముకున్న కష్టజీవులు

సముద్రమే వారి ప్రపంచం. వేటే వారి జీవనాధారం. సముద్రంలో వేటాడిన మత్స్యసంపదను టోకుగా కొంత విక్రయించగా ఇంటి వద్ద మహిళలు రిటైల్‌గా ఆ సరుకును విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆ కుటుంబాలకు వేట జరిగితేనే భృతి. అయితే సముద్రంలో వేట నిషేధిత సమయంలో ప్రభుత్వపరంగా అందించే భత్యం రూకలే వారికి ఆదరవు.

ఎవరు లబ్ధిదారులు

సముద్రంలో వేటకు సంబంధించి మత్స్యశాఖ వద్ద బోట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలి. 21 సంవత్సరం నుంచి 60 సంవత్సరాలలోపు అర్హులైన వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తారు. కుటుంబానికి ఒకరు మాత్రమే లబ్ధిదారుడు ఉంటాడు. అయితే కొందరు ఉమ్మడి కుటుంబాలవారు తమకు ప్రత్యేకంగా రేషన్ కార్డు లేనందున నష్టపోతున్నామని చెప్తున్నారు. ఆ క్రమంలో ఇటీవల కొందరు వేరుగా ఉంటున్నట్లు (స్ప్లిట్టింగ్) దరఖాస్తు చేసుకుని కొత్త రేషన్‌కార్డులు పొందారు. అలాంటి వారిని కూడా అర్హుల జాబితాలో చేర్చారు. ఇంకా పలువురు తమను అర్హులు జాబితాలో చేర్చాల్సి ఉందని చెప్తున్నారు.

ఆదాయపు పన్ను చెల్లించేవారు అనర్హులు

ఇటీవల కాలంలో మత్స్యకార గ్రామాల్లోని యువత లో చాలామంది సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. అలా ఆదాయపు పన్ను చెల్లించేవారి కుటుంబ సభ్యుడు భత్యపు సొమ్ము పొందేందుకు అనర్హుడు అవుతున్నాడు. విద్యార్థులు కూడా అనర్హుల జాబితాలో చేరుతున్నారు. ఈ క్రమంలో వారిని కూడా అర్హుల జాబితాలో స్థానం కల్పించాలని కోరుతున్నారు.

నూకల కోసం రూకలు అరువు

నెల రోజులుగా ఎలాంటి సంపాదన లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. చేతిలో ఉన్న కొద్దిపాటి పొదుపు సొమ్ము కూడా ఖర్చయింది. బతుకు పోరాటంలో నూకల కోసం రూకలు అరువు తెచ్చుకోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భత్యం సొమ్ము చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అరువు తీసుకునే రొక్కానికి వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాల్సి వస్తోందని వారు వాపోపుతున్నారు. బోట్లు, వలలు మరమ్మతులతో సంధి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని, వెంటనే భత్యం సొమ్మును తమ ఖాతాల్లోకి జమ చేయాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కురిచేడులో భారీ వర్షం

కురిచేడు, మే 18: కురిచేడు మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం గంట పాటు కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. మురికి కాలువలు నిండి మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. రోడ్లన్నీ చెత్తతో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కెనరా బ్యాంకు వీధిలో మురుగునీరు గృహాలలోకి చేరింది. కల్లూరు గ్రామంలో మల్లవరపు సురేష్, మల్లవరపు పిచ్చమ్మ గృహాలు గాలులకు కూలిపోయాయి. గత నెల రోజుల నుంచి వేసవి గాలులతో అట్టుడికిన ప్రజలు ఈ వర్షంతో సేద తీరుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పిడుగు పడి ఆవు మృతి

కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ కొత్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృతి చెందింది. ఆవు యజమాని చట్టం రామయ్య ఆవులతో పొలం వెళ్ళాడు. సాయంత్రం ఉరుములతో కూడిన కురిసిన వర్షంతోపాటు పిడుగు పడింది. పిడుగుపాటుకు రామయ్యకు చెందిన ఆవు మృతి చెందింది. దీంతో రూ.40 వేల నష్టం జరిగినట్లు రామయ్య తెలిపారు.



కురిచేడులో కురుస్తున్న భారీ వర్షం (ఇన్‌సెట్లో) పిడుగుపాటుకు మృతిచెందిన ఆవు

వర్షంతో ఉపశమనం

దొనకొండ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కురిసింది. రుద్రసముద్రం గ్రామ సమీపంలోని పదేళ్లుగా ఎండిపోయిన నీటి కుంటకు శనివారం కురిసిన భారీ వర్షానికి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పి ఏబీసీలో పడిన బైక్

వృద్ధుడు మృతి

బల్లికురవ, మే 18 : మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య(65) శనివారం ఉదయం ఏబీసీ కాలువ మలుపులో ద్విచక్ర వాహనంతో కాలవలో పడిపోయి మృతి చెందారు. కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య శుక్రవారం ఉదయం అద్దంకిలో బైకు బస్టాండ్‌లో పెట్టి బ్రహ్మంగారి మఠం ఆరాధన కార్యక్రమానికి వెళ్లి శనివారం ఉదయం అద్దంకి నుంచి బైకుపై కొణిదెనకు వస్తుండగా వల్లాపల్లి సమీపంలో ఉన్న ఏబీసీ కాలువ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి మలుపు అర్థంకాక బైకుతో సహా కాలవలోకి పడిపోయాడు. వెంటనే బాటసారులు గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ అందుబాటులో వైద్యులు లేకపోవడం ఆక్సిజన్ అందుబాటులో లేక పోవడంతో వెంటనే మార్టూరు వైద్యశాలకు తరలించే లోపే ఆయన మృతి చెందారు. కాలవ వద్ద రక్షణ గోడలు లేకపోవటం వలనే ప్రమాదం జరిగిందని బంధువులు ఆరోపిస్తున్నారు. లక్ష్మయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



తన్నీరు లక్ష్మయ్య మృతదేహం



నరసింహస్వామి ఆలయంలో పూజల అనంతరం ఎమ్మెల్యే స్వామి

ఇళ్లకు చేరిన అభ్యర్థులు

- రెండు పార్టీల తరపున పోటీ చేసింది 26 మంది
- కూడికలు తీసివేతలు పూర్తికాగానే నివాసిత ప్రాంతాలకు చేరిక
- శనివారం నియోజకవర్గాల్లో ఉంది ఐదుగురే
- అత్యవసర చెల్లింపులపై దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కొంతకాలంగా ఎన్నికల సమరంలో నిమగ్నమై నియోజకవర్గాలకే పరిమితమైన ప్రధాన పార్టీల అభ్యర్థులు స్వగ్రామాలకు లేక సొంత ఇళ్లకు చేరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల్లో కేవలం ఐదుగురు మాత్రమే నియోజకవర్గాల్లో కనిపించారు. మొత్తం 26 మంది ఈ రెండు పార్టీల మధ్య పోటీలో ఉండగా అందులో 21మంది విశ్రాంతి కోసమో, అత్యవసర పనుల కోసమో నియోజకవర్గాన్ని వీడారు. సహజంగా పోలింగ్ అనంతరం కిందిస్థాయిలో ప్రధాన పార్టీల శ్రేణుల మధ్య వివాదాలు, ఘర్షణలు చెలరేగుతుంటాయి. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఆ పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నియోజకవర్గాల్లోనే ఉండి పార్టీశ్రేణులకు చేదోడుగా ఉండాల్సిన అవసరం ఉంది. పోలింగ్ రోజు దర్శి, ఒంగోలు, చీరాలలాంటి ప్రాంతాల్లో చెదురుమదురు ఘర్షణలు జరగ్గా ఒంగోలులో పోలింగ్ అనంతరం కూడా ఘర్షణలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో పోటీచేసిన అభ్యర్థులు నియోజకవర్గాల్లో ఉన్నారా? లేదా? కాకపోతే ఎక్కడ ఉన్నారన్న శనివారం మధ్యాహ్నం ఆంధ్రజ్యోతి బృందం ఒక పరిశీలన చేసింది. ఆ ప్రకారం చూస్తే అత్యధికశాతం అభ్యర్థులు నియోజకవర్గాల్లో కనిపించలేదు. టీడీపీ అభ్యర్థుల్లో ఎమ్మెల్యే స్వామి, ఉగ్రనరసింహారెడ్డి, ఎరిక్షన్ బాబులు, వైసీపీ తరుపున అన్నా రాంబాబు, దద్దాల నారాయణయాదవ్ మాత్రమే నియోజకవర్గాల్లో కనిపించారు.

పోలింగ్ మరుసటి రోజే కొందరు

ఎన్నికల సమరంలో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నెల నుంచి మూడు నెలలపాటు ఆయా నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. ఆ సందర్భంగా అభ్యర్థుల్లో స్థానికులు, స్థానికేతరులు అన్న ప్రచారం ముమ్మరం కావడంతో ఎవరికివారు అనుక్షణం నియోజకవర్గంలోనే ఉంటాం, మీకు అండగా ఉంటాం అని ప్రకటనలు చేశారు. కానీ చాలామంది పోలింగ్ అయిన ఒకటి రెండురోజుల వ్యవధిలోనే ఎక్కడో నివాసం ఉండే సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఆయా నియోజకవర్గాల వారీ చూస్తే ఒంగోలు లోక్‌సభ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన, స్థానికేతరుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోలింగ్ సోమవారం జరగ్గా, మంగళవారం నుంచే నియోజకవర్గంలో కనిపించలేదు. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి మాత్రం రెండు రోజులపాటు ఒంగోలులోని తన కార్యాలయంలో అందుబాటులో ఉండి, ఆ తర్వాత చెన్నై వెళ్లారు. ఒంగోలు అసెంబ్లీలో పోటీచేసిన వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పోలింగ్ సోమవారం జరగ్గా బుధవారం నుంచే కుటుంబంతో నివాసం ఉండే హైదరాబాద్ చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి శనివారం ఉదయం బయలుదేరి బెంగుళూరు వెళ్లారు. కొండపి అసెంబ్లీలో వైసీపీ నుంచి పోటీచేసిన మంత్రి సురేష్ మోకాలికి శస్త్రచికిత్సకు అవసరం ఉందని తెలియజేస్తూ బుధవారం ఉదయమే హైదరాబాద్ చెక్కేశారు. ఆయన కుటుంబం కూడా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. అయితే టీడీపీ అభ్యర్థి స్వామి మాత్రం నియోజకవర్గాన్ని వీడలేదు. మధ్యలో ఒకరోజు కొన్ని గంటలపాటు ఒంగోలు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకున్నారు. సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి విజయకుమార్ మూడు రోజులపాటు పార్టీశ్రేణులతో మమేకమై హైదరాబాద్ వెళ్లిపోయారు. వైసీపీ అభ్యర్థి అయిన మంత్రి నాగార్జున పోలింగ్ అయిన రెండో రోజే తన వ్యాపారాలు విస్తరించి ఉన్నాయని ప్రజలు భావిస్తున్న విశాఖపట్టణం చేరారు. కనిగిరి నియోజకవర్గంలో ఇటు టీడీపీ, అటు వైసీపీ అభ్యర్థులు అయిన డాక్టర్ ఉగ్ర, దద్దాల శనివారం మధ్యాహ్నం కూడా నియోజకవర్గంలోనే కనిపించారు. అయితే శనివారం రాత్రికి డాక్టర్ ఉగ్ర కుటుంబంతో బయటకు వెళ్తారని తెలిసింది. గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి రెండోరోజే హైదరాబాద్ వెళ్లారు. స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి నాలుగు రోజులపాటు గిద్దలూరులోనే ఉండి, తర్వాత స్వస్థలమైన మార్కాపురం చేరారు. మార్కాపురంలో వైసీపీ అభ్యర్థి రాంబాబు ఆ రోజు నుంచి ఇప్పటి వరకు మార్కాపురంలోనే ఉన్నారు. టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డి మాత్రం రోడ్డుప్రమాదంలో దెబ్బతిన్న కాలి వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ చేరారు. ఎర్రగొండపాలెంలో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు పోలింగ్ జరిగిన మరుసటి రోజు మధ్యాహ్నం నుంచి గతంలో వలే నియోజకవర్గంలో పర్యటిస్తుండటం విశేషం. శనివారం కూడా గ్రామాల్లో ప్రజలతో మమేకమై అతను కనిపించారు. స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పోలింగ్ అయిన రెండోరోజే హైదరాబాద్ చెక్కేశాడు. దర్శిలో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి స్థానికుడినని చెప్పుకున్న శివప్రసాద్‌రెడ్డి రెండోరోజే విశాఖపట్టణంలో కనిపించారు. ప్రస్తుతం ఆయన కుటుంబం నివాసం ఉండే హైదరాబాద్‌లో ఉన్నారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మి మూడు రోజుల అనంతరం నరసరావుపేటకు వెళ్లిపోయారు. మధ్యలో ఒకపూట దర్శి వచ్చి వెళ్లారు. శనివారం సాయంత్రం మాత్రం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబుని కలిశారు. కందుకూరులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావు కుటుంబం హైదరాబాద్‌లో, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కుటుంబం బెంగళూరులో ఉంటారు. పోలింగ్ అయిన రెండో రోజు నుంచి ఆ ఇద్దరు నియోజకవర్గానికి గుడ్‌బై చెప్పి ఒకరు హైదరాబాద్, ఒకరు బెంగుళూరు వెళ్లి కుటుంబాలతో గడుపుతున్నారు. అద్దంకిలో స్థానికేతరుడైన వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి రెండోరోజు హైదరాబాద్ చెక్కేశారు. మూడు రోజులపాటు ఆయా మండలాలకు వెళ్లి సమీక్షలు చేసుకున్న టీడీపీ అభ్యర్థి రవికుమార్ కుటుంబంతో నివాసం ఉండే హైదరాబాద్‌కు చేరారు. పర్చూరులో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన స్థానికేతరుడైన బాలాజీ రెండోరోజే హైదరాబాద్ చేరారు. టీడీపీ అభ్యర్థి సాంబశివరావు కూడా గురువారం రాత్రి హైదరాబాద్ వెళ్లిపోయారు. చీరాల వైసీపీ, టీడీపీ అభ్యర్థులు ఇరువురూ స్థానికంగాలేరు. తొలి రెండు రోజులు కనిపించి చివరికి వారు నివాసం ఉండే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆయా ప్రాంతాలకు వెళ్లిన అభ్యర్థులు కూడా ఎన్నికల్లో భారీగా వ్యయం చేయాల్సి వచ్చి చివరలో అప్పులు కూడా చేశారు. అలాంటి వారు అత్యవసరంగా సర్దుబాటు చేసే పనిలో కూడా వారు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆటో - మినీలారీ ఢీ

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు





మృతిచెందిన మధురోహిత్, చికిత్స పొందుతున్న రమాదేవి

పొదిలి, మే 18 : ప్రమాదవశాత్తు ఆటో- మినిలారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాల య్యాయి. ఈ ఘటన మండలంలోని కంభాల పాడు గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాలకు చెందిన రమాదేవి తన ఇద్దరు కుమారులు తన కొడుకు కోడలు అరుణ్‌కుమార్, పుష్పాలు, మరో కుమారు డు మధురోహిత్ (21), కలిసి విజయవాడ కనకదుర్గమ్మతల్లిని దర్శించుకోవడానికి సొంత ఆటోలో వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి, తిరిగి స్వగ్రామం నంద్యాలకు బయలుదేరారు. ఈ క్రమంలో కంభాలపాడు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ఐచర్ మినీలారి వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలని మధురోహిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోనడుపుతున్న అరుణ్‌కుమార్ తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. రమాదేవికి కుడికాలు, కుడిచేయి విరిగింది. అరుణ్‌కుమార్ భార్య పుష్పకు ఎడమకాలు, కుడిచేయి విరిగింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- బైకు, మినీ ట్రక్ ఢీకొనడంతో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుధాకర్

తర్లుపాడు, మే 18: ఎదురుగా వస్తున్న బైకును అతివేగంగా వస్తున్న మిని ట్రక్ వాహనం ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తర్లుపాడు, సీతా నాగులవరం మధ్య చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బేస్తవారిపేట గ్రామానికి చెందిన దూదేకుల మాబు సుభాని(31) మార్కాపురం సొంత పనిమీద బైకుపై వెళ్లాడు. పనులు చూసుకుని తిరిగి బేస్తవారిపేట వస్తుండగా, తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్తున్న మినీ ట్రక్ ఆటోను క్రాస్ చేసి అతివేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. దీంతో మాబు సుభాని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ట్రక్ వాహనం డ్రైవర్ పరారయ్యాడు. ఘటనా స్థలాన్ని తర్లుపాడు ఎస్‌ఐ వేముల సుధాకర్ పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. సుభానీకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు విజయవాడలో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. వారం రోజుల క్రితమే విజయవాడ నుంచి బేస్తవారిపేటకు వచ్చినట్లు బంధువులు పేర్కొన్నారు. యువకుడు మాబు సుభాని మృతి చెందటంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

చెరువులో చేపలు మృతి



చచ్చి నీళ్లపైకి తేలిన చేపలు

పెద్ద దోర్నాల, మే 18: చెరువులో ఆకస్మికంగా చేపలు చచ్చి పైకితేలిన ఘటన మండలంలోని ఎగువ చెర్లోపల్లిలో చోటుచేసుకొంది. ఈఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇస్రాయేలు తనకున్న వ్యవసాయ భూమిలో 75 సెంట్లలో చేపలచెరువు తవ్వి 2వేల చేపలతో పెంపకం చేపట్టాడు. 7 నెలల కాలం గడిచింది. కొద్ది రోజులకు పంట చేతికంది వచ్చే సమయంలో ఈనెల 16న తెల్లవారు జామున చెరువులో చేపలు చనిపోయి పైకి తేలాయి. ఏడాది కష్టం ఒకపూటతో పోయిందని, ఇస్రాయేలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై అనుమానం వెలిబుచ్చుతూ పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఎస్సై అంకమరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనకు ఉన్న కారణాలపై ఆరా తీశాడు. అని నీటి శాంపిల్‌ను పరిశీలనకు పంపించినట్లు ఎస్సై తెలిపారు. అనుమానస్పద ఘటనగా కేసునమోదు చేసి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గిద్దలూరు టౌన్, మే 18 : జూన్ 29వ తేదిన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ సూచించారు. స్థానిక కోరులో శనివారం న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంక్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులతో న్యాయాధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ అధికారులు ఎక్కువ కేసులు రాజీ చేయాలని, ఇందుకు దృష్టి పెట్టాలన్నారు. ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేయడం ద్వారా సమాజంలో, కుటుంబంలో శాంతి నెలకొంటుందని, ఇందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల్లో కక్షిదారులు ముందు రావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారా దానమ్మ, అధికారులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రజల అవస్థలు

రెండు గంటల పాటు ప్రయాణికులతో కిక్కిరిసిన మార్కాపురం బస్టాండ్



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

మార్కాపురం వన్‌టౌన్, మే 18: మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. దాదాపు రెండు గంటల పాటు బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నా బస్టాండ్‌లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది స్పందించ లేదు. శ్రీశైలం, విజయవాడ, ఒంగోలు, గిద్దలూరు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ఎవరిని అడగాలో తెలియని స్థితిలో ప్రయాణికులు ఉన్నారు. కొంతమంది ఆర్టీసీ ఎంక్వైరీలో విచారించగా బస్సులు ఎప్పుడొస్తాయో తెలియదంటున్నారని ప్రయాణికులు మండిపడ్డారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ డీఎం ఏఎస్ నరసింహులు ఆర్డీనరి బస్సులను రప్పించి ప్రయాణికులను పంపారు.



గమ్యస్థానాలకు వెళుతున్న ప్రయాణికులు

రైళ్లు లేకపోవడంతో ఇబ్బందులు

రైళ్లు లేకపోవడంతోనే ఆకస్మాత్తుగా ప్రయాణికులు మార్కాపురం బస్టాండ్‌కు వచ్చారని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. బ్రహ్మంగారి మఠం వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులు అధికంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌కు 5 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒంగోలు, విజయవాడ, శ్రీశైలం, గిద్దలూరు వైపు బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

- వేసవి ఎండల నుంచి ఉపశమనం
- పండ్ల తోటలకు జీవం



త్రిపురాంతకంలో కురుస్తున్న వర్షం

ఎర్రగొండపాలెం, మే 18 : అల్పపీడనద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఎర్రగొండపాలెం మండల కేంద్రంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం గంట పాటు వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.20 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకబిగువున గంట పాటు కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. రెండుమూడు రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతుండడంతో వేసవి తాకిడి నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

పండ్లతోటలకు జీవం

మండలంలో సాగులో ఉన్న బొప్పాయి, అరటి, జామ,దానిమ్మ తోటలకు ఈ వర్షం జీవం పోసింది. 15 రోజుల వరకు నీటి తడులు అవసరం ఉండదని, వై.కొత్తపల్లి, గోళ్లవీడపి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల కంటే ముందే వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. ఎక్కువ వర్షాలు కురిసి గ్రామాల్లో తాగునీటి కుంటలలోకి నీళ్లు చేరాలని ప్రజలు వరుణదేవుని ప్రార్థిస్తున్నారు.

త్రిపురాంతకం : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లపై నీరు నిలిచింది. త్రిపురాంతకంలోని చాలా చోట్ల అంతర్గత రోడ్లుకు సీసీలు లేకపోవడంతో వర్షపు నీరు మోకాళ్ళ లోతు నిలిచింది. కొన్ని చోట్ల చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. కాగా మండలంలోని డీపీఎన్ కాలనీలో పిడుపాటుకు గుర్రై అలగసాని నారాయణ (32) మృతి చెందాడు. తీవ్ర వర్షం, మెరుపులు, ఉరుములు రావడంతో తన పెంపుడు కోళ్లను కప్పి పెట్టేందుకు వెళ్లిన నారాయణ సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి పిడిగుపాటుకు గురయ్యాడు. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో నారాయణ కుటుంబం తీవ్ర విషాధంలో మునిగిపోయింది. నారాయణకు భార్య ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కంభంలోని సింధూరి మార్ట్‌లో చోరీ

- 80 వేల నగదు, లక్ష విలువైన వస్తువులు అపహరణ



మార్టును పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్

కంభం, మే 18 : కంభం సింధూరి మార్ట్‌లో దొంగలుపడి క్యాష్ కౌంటర్‌లో ఉన్న 80వేల నగదు, 1 లక్ష రూపాయాల విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున 3గంటల సమయంలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే... కంభం వైజంక్షన్ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న సింధూరి మార్ట్‌లో రెండు అంతస్తులలో అన్ని రకాల వస్తువులు విక్రయిస్తుంటారు. శుక్రవారం రాత్రి 10గంటల తరువాత షెటర్లు మూసి తాళాలు వేసి వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తెల్లవారు జామమున వెళ్ళిన దొంగ సీసీ టీవీలను కత్తిరించి, క్యాష్ కౌంటర్‌లోని 80వేల నగదు, సుమారు లక్ష రూపాయల విలువ చేసే వస్తువులను దొంగిలించినట్లు తెలిసింది. జాతీయ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్న రహదారి పక్కనే ఉన్న షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి డబ్బు, వస్తువులను దొంగిలించిన దొంగ పోలీసులకు సవాల్ విసిరాడని పలువురు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజేష్ సిబ్బందితో మార్ట్‌ను పరిశీలించారు. సాయంత్రం ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వాసవీమాత జన్మదిన వేడుకలు





గిద్దలూరులో అమ్మవారి విశేష అలంకర, త్రిపురాంతకంలో అమ్మవారికి పూజలు

గిద్దలూరు, మే 18 : పట్టణంలోని అమ్మవారి శాలలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. దేవాలయం ఆవరణలో ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరించి పూజలు ప్రారంభించారు. 102 మంది కన్యకలు, ముత్తైదువులు సామూహికంగా తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అలాగే మహిళలు తీసుకొని వచ్చిన కళశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం సామూహికంగా కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : వాసవీమాత జన్మదిన వేడుకలను స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కౌతా అనంతయ్య ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, నగరసంకీర్తన, వాసవీ అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన, అష్టోత్తర శతనామావలి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



అన్నాభిషేకంలో అమ్మవారు

పెద్ద దోర్నాల : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బిదరే రాంప్రసాద్ శర్మ వాసవీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేడుకల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యల్లో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటి పెద్దలు వెచ్చా వెంకటరమణ, హరగోపాల్, నాగెళ్ల సత్యనారాయణ, పీ సీతారామయ్య, పెరుమాళ్ల రామారావు, యోగి వెంకట నారాయణ, పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, క్షీరాభిషేకం నిర్వహించారు. వైశ్య పతాకావిష్కరణ నిర్వహించారు. అమ్మవారికి జొన్నబట్ల రాముశర్మ ఆధ్వర్యంలో లక్షకుంకుమార్చన, గారెల మహానివేదన, అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ కనులు తెరిచి కుడిచేతిని ఎత్తి భక్తులను ఆశీర్వదించే విధంగా తయారు చేశారు. ఈ ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంది. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ, భక్తుల కోలాట ప్రదర్శనలు, మంగళ వాయిద్యాలు, తీన్మార్ తప్పెట్ల నడుమ అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు.

అవీ..ఇవీ..

పశువుల యజమానులకు అవగాహన



పశుపోషకులతో మాట్లాడుతున్న రైల్వే పోలీసులు

గిద్దలూరు, మే 18 : గిద్దలూరు - కంభం రైల్వేలైన్‌పై పశువులను మేత కోసం పంపితే రైల్వే యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే శిక్షార్హులు కూడా అవుతారని ఆర్‌పీఎఫ్ సీఐ ఈ.నాగభూషణ్, ఎస్సై కె.పిచ్చిరెడ్డి అన్నారు. రైల్వే పరిసర గ్రామాలలో ఆర్‌పీఎఫ్ పోలీసులు పశు యజమానులకు అవగాహన కల్పించారు. పశువులను మేతకోసం రైల్వే ట్రాక్‌పై వదలడం వలన ఇటీవల కాలంలో 20 గేదెలు మృతిచెందాయని పేర్కొన్నారు. పశువుల ప్రాణాలు పోవడమే కాకుండా కొన్ని సందర్భాలలో రైలు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందన్నారు. రైల్వేట్రాక్‌పై పశువులను వదిలితే శిక్షార్హులు అవుతారన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మే 18: గ్రంథాలయాల సేవలు ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం సచివాలయం మహిళా పోలీసు వై.శిరీష విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. చదరంగంలో మెలుకువలు, చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు.

వేసవి శిక్షణ తరగతులు

గిద్దలూరు : పట్టణంలోనిశాఖ గ్రంథాలయం ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. మూడవ రోజు శనివారం విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు రాయడం నేర్పించారు. స్పోకెన్ ఇంగ్లీషు, సైన్స్‌పై ఉపాధ్యాయుడు వై.జె.పోలిరెడ్డి అవగాహన కల్పించి వైకుంఠపాలి ఆట ఆడించారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి తరగతులు

బేస్తవారపేట : బేస్తవారపేట గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి తరగతులు గ్రంథపాలకుడు పీ.వీ.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. శనివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, కథలు తదితర అంశాలపై బోధకుడు గురుస్వామి వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి కాలంలో సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయంలో ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. మండలంలోని విద్యార్థులు తప్పని సరిగా శిక్షణలో పాల్గొనాలని ఆయన విద్యార్థులను కోరారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



సాగుకు సిద్ధం చేసిన నవధాన్యాలు

పెద్దదోర్నాల, మే 18: నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ప్రకృతి విభాగం ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి సూచించారు. ఆమె ఆదేశాల మేరకు పెద్ద బొమ్మలాపురం రైతు శ్రీనివాసరెడ్డి నవధాన్యాల సాగు చేపట్టాడు. వ్యవసాయ పొలంలో ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు 30 రకాల విత్తనాలు 12 కేజీల బీజామృతంతో కలిపి విత్తన శుద్ధి చేసి ఘన జీవామృతం, గట్టుమన్ను బూడిద మిశ్రమంతో పొలంలో చల్లాలన్నారు. అవి మొలిచిన 45 రోజులకు పొలంలో కలియ దున్నడం ద్వారా నేల సారవంతమవుతందన్నారు. భూమిలోని తేమశాతాన్ని తగ్గకుండా చేస్తుందన్నారు. సూక్ష్మజీవుల వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా అధిక దిగుబడులు వస్తాయని రైతులకు అవగాహన కల్పించారు.

ఒరిగిన స్తంభాన్ని సరిచేశారు..!

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సరిచేసిన విద్యుత్‌స్తంభం

మార్కాపురం, మే 18: పూర్తిగా ఒరిగి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అధికారులు సరిచేశారు. 'ఒరిగిన విద్యుత్ స్తంభం' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు మార్కాపురం చెరువుకట్టపై బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేశారు. పూర్తిగా ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టి పునాదిని బలోపేతం చేశారు. దీంతో ప్రమాదం జరుగకుండా స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21న లక్ష్మీనరసింహస్వామి జయంతి

మార్కాపురం వన్‌టౌన్, మే 18: పట్టణ సమీపంలోని కొండేపల్లి రహదారిలో ఉన్న శ్రీ కపిలగిరి లక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవ కార్యక్రమం ఈ నెల 21న మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బొగ్గరపు శేషయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం 7 గంటలకు బిందెతీర్థం ధ్వజారోహణం, 8 గంటలకు పంచామృతం స్నపన సహస్రనామార్చన, 11 గంటలకు పంచామృత స్నపన తిరుమంజనం (ఉత్సవమూర్తులకు) సాయంత్రం 4 గంటలకు భక్త బృందంతో భజనం కార్యక్రమం, 6 గంటలకు చందనోత్సవం, 6.45గంటలకు సంధ్యా సమయంలో స్వామి జననం, రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారి కల్యాణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామి వారి కల్యాణ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు రూ.1000 రుసుము చెల్లించాలన్నారు. స్వామివారి జయంతి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శేషయ్య ప్రకటనలో పిలుపునిచ్చారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి మహా నైవేద్యం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తర్లుపాడు, మే 18: తర్లుపాడులో వెలసిన గోవిందాబ, శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా స్వామి అమ్మవార్లకు మహానైవేద్య కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అలుగు బాల బ్రహ్మం స్వామివారికి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి మహానైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, మే 18: స్థానిక రమా సహిత సత్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు బాసాని సుధాకర్‌రావు, పొత్తంశెట్టి చిన్నసుబ్బారావులు తెలిపారు. ఈ నెల 19న రాత్రి కళ్యాణం, 20న హనుమంత వాహనం, 21న గరుడ వాహనం, 22న గజవాహనం, 23న రథోత్సవం, 24న అన్నదానం నిర్వహించనున్నారు.

కంకర వేశారు.. తారు వేయడం మరిచారు..!

» అధ్వానస్థితిలో రెడ్డినగర్, బసవాపురం రహదారి
» పలుగ్రామాల ప్రజల అవస్థలు


ముండ్లమూరు: పసుపుగల్లు- వేములబండ రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

ముండ్లమూరు, మే 18: అధ్వాన రోడ్డుతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని రెడ్డినగర్ నుంచి బసవాపురం, శ్రీనివాసనగర్ వెళ్ళే పంచాయతీరాజ్ రహదారిలో ప్రయాణమంటే భయపడే పరిస్థితి నెలకొంది. అడుగడుగునా గోతులమయం కావటంతో ఆ రహదారిపై ప్రయాణం చేసే వాహన చోదకులు అల్లాడిపోతున్నారు. రెడ్డినగర్ నుంచి బసవాపురం వరకు రెండు కిలోమీటర్లు ఉండే ఈరహదారికి వైసీపీ ప్రభుత్వంలో 2021-22 సంవత్సరంలో రూ 1.60 కోట్లు నిధులు పంచాయతీ రాజ్ స్పెషల్ గ్రాంట్ నుంచి తారు రోడ్డు కోసం నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ దక్కించుకున్న గుత్తేదారు పనులు మొదలుపెట్టి 50 శాతంమేర పూర్తి చేశారు. ఆతరువాత ఇప్పటి వరకు సంబంధిత కాంట్రాక్టర్ కన్నెత్తి కూడా చూడలేదు. రహదారికి వాడిన కంకరు లేచిపోవటంతో గోతులమయమైంది. చిన్న చినుకు పడినా ఆగోతుల్లో నీరుచేరి వాహన చోదకులు అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా ఈ రహదారిపై రెడ్డినగర్, శ్రీనివాసనగర్, జగత్‌నగర్‌లతో పాటు కెల్లంపల్లి గ్రామాలకు చెందిన వారు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. కేవలం పది నిమిషాలు పట్టే ప్రయాణం అరగంట పైన పడుతుందంటే ఆ రహదారి దుస్థితి అర్థం చేసుకోవచ్చు. కొత్త వ్యక్తులు ఆ రహదారిపై రాత్రుల పూట ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురైన సందర్భాలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా గోతులు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పీసీపల్లిలో అధ్వానంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు

అలాగే, మండలంలోని పసుపుగల్లు నుంచి వేములబండ వెళ్ళే ఆర్ అండ్‌బీ రహదారిని చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ఆస్పత్రి పాలైన సందర్భాలు లేకపోలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు తొలగించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేయరూ..

పీసీపల్లి, మే 18: పీసీపల్లి బస్టాండు సెంటరు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు అడుగుకో గుంత మూరకో గొయ్యిలా తయారైంది. వర్షం పడితే అడుగు తీసి అడుగు కూడా వేయలేని దుస్థితి నెలకొంది. వర్షం కురిసినప్పుడు ఆ గోతుల్లో మోకాలులోతు నీరు నిలిచి ఉంటుంది. ఆ మార్గం గుండా వాహనాలు వెళ్తున్న సమయంలో ఆ గుంతల్లోని మురుగునీరు ఎగిరి పక్కన ఉన్న ఇళ్లల్లో పడుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండానే ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోతుంటారు. ఈ రోడ్డు మరమ్మతులు గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ రోడ్డు దుస్థితిపై ప్రజలు అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చలనంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


ముండ్లమూరు: అధ్వానంగా రెడ్డినగర్, బసవాపురం రహదారి

రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపునీరు

పామూరు, మే 18: మండలంలోని పడమట కట్టకిందపల్లి పంచాయతి కందులవారిపల్లి గ్రామ బీసీ కాలనీలో రోడ్డు ఎత్తు తగ్గడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచి పోతుంది. దీంతో ఆప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మధ్యలో రోడ్డు ఎత్తు తగ్గించడంతో వర్షపు నీరు రోడ్డుపై సక్రమంగా ప్రవహించక ఎత్తు తక్కువగా ఉన్న దగ్గర నిలిచిపోతుంది. దాంతో బురద నీరులో నడవడానికి ఆవీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిరోడ్డుపై నీరు నిలువ చేరడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దాంతో ఎక్కడ దోమ కాటుకు గురై వ్యాధులు బారిన పడాల్సివస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు ఎత్తు తక్కువ ఉన్న ప్రాంతంలో మెరక పనులు చేసి నీరు రోడ్డుపై నిలువ చేరకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై సచివాలయ కార్యదర్శి షేక్ జాని మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ సమయంలో ఆ ప్రాంతంలో బావి ఉండటంతో రోడ్డు ఎత్తు తగ్గించారని చెప్పారు. ప్రస్తుతం బావిని పూడ్చి వేశారని తెలిపారు. ఎత్తు తక్కువగా ఉన్న ప్రాంతంలో రోడ్డు మెరక పనులు చేపట్టి స్థానికుల ఇబ్బందులు తొలగిస్తామని పేర్కొన్నారు.


పామూరు: కందులవారిపల్లిలో రోడ్డుపై నిలిచిఉన్న మురుగు నీరు


టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్

చంద్రబాబును కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, మే 18: టీడీపీ అధినేత చంద్రబాబును దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్, ఆమె చిన మామ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కడియాల రమేష్‌లు కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో శనివారం వారు కలిసి దర్శి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ తీరును వివరించారు. ఈసందర్భంగా చంద్రబాబు అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని, కుటుంబ సభ్యులను, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకలను అభినందించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేశారని ప్రశంసించారు. వైసీపీ దాడులను, దుష్ప్రచారాన్ని విజయవంతంగా తిప్పికొట్టారని అన్నారు. ప్రజల్లో టీడీపీ కూటమి పట్ల విశ్వాసం మరింత పెరిగే విధంగా కృషి చేశారని చంద్రబాబు అభినందించినట్లు వారు వివరించారు. దర్శి అసెంబ్లీలో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీగా ఓట్లు వేసినట్లు పరిశీలనలో తేలిందని చంద్రబాబు వివరించినట్లు తెలిపారు. అహర్నిశలు కష్టపడి పని చేసిన కార్యకర్తలను అభినందించారు.

వలస ఓటర్లు తిరుగుప్రయాణం

» రద్దీగా బస్సులు
» గమ్యస్థానాలకు చేరేందుకు పడిగాపులు


ప్రయాణికులతో రద్దీగా ఉన్న కనిగిరి డిపో

కనిగిరి, మే 18: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కనిగిరి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వలస ఓటర్లు స్వగ్రామాల్లో ఓటు వేసేందుకు వచ్చారు. ఈనెల 13న తమ ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు తమ జీవనపోరాటం నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్ళేందుకు ఆర్టీసీలో తగినన్ని సీట్లు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయివేటు బస్సులను ఆశ్రయించాల్సి వస్తుంది. బస్సుల యాజమాన్యాలు అవకాశాన్ని అదనుగా తీసుకుని రేట్లు విపరీతంగా పెంచేశారు. దీంతో చేసేది లేక అదనపు చార్జీలు చెల్లించి తిరుగు ప్రయాణం అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళాలంటే ఒక్కో వ్యక్తికి దాదాపు రూ.1500 వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదనపు చార్జీలు భారం మోయలేని పేద కుటుంబాలు ఆర్టీసీ బస్సులే దిక్కయ్యాయి. దీంతో డిపో ప్రయాణికులతో కిటకిట లాడుతుంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం బెంగుళూరు, హైద్రాబాద్, చైన్నై, ప్రాంతాలకు అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దానిమ్మతోట కంచె దగ్ధం

దర్శి మే 18 : మండలంలోని బసిరెడ్డిపల్లెకు చెందిన రైతు, టీడీపీ నాయకుడు చింతపూడి నాగిరెడ్డికి చెందిన దానిమ్మతోట కంచె శనివారం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు తేనె తుట్టెలకు నిప్పు పెట్టారు. ఆ మంటలు అంటుకోవటంతో దానిమ్మ తోట కంచె కాలిపోయింది.విషయం తెలుసుకున్న రైతు నాగిరెడ్డి, మరి కొందరు వ్యక్తులు మంటలను ఆర్పారు. సకాలంలో స్పందించటంతో భారీ నష్టం తప్పింది. లేకుంటే తోట పూర్తిగా కాలిపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లేది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పీసీపల్లి, మే 18: మండలంలోని పెదయిర్లపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ లక్ష్మీరాజేష్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని చింతగుంపల్లి, వెలుతుర్లవారిపల్లి, పెదయిర్లపాడు, వితలాపురం, పల్లివారిపల్లి, అడివిలోపల్లి, లక్ష్మక్కపల్లి, లింగన్నపాలెం, వెంగళాయపల్లి, దివాకరపురం, వేపగుంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: జిల్లాలో ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న సప్లిమెంటరీ పరీక్షలను పడక్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసు కోవాలని కలెక్టర దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 24నుంచి ఇంటర్మీడియట్, టెన్త్ పరీక్షలు, వచ్చేనెల 1నుంచి జరగనున్న ఏపీ ఓపెన్ స్కూల్స్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ 1వతేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి 5.30 గంటల వరకు రెండో సంవత్సరం వారికి పరీక్షలు జరుగతాయని చెప్పారు. పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 15,291 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 7,075 మంది హాజరుకానుండగా, అందుకోసం 43 పరీక్షా కేంద్రాలను ఎంపికచేసినట్లు పేర్కొన్నారు. అలాగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24నుంచి వచ్చేనెల 3వతేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు 3,871 మంది హాజరుకానుండగా 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్స్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలకు 896 మంది విద్యార్థులు హాజరుకానుండగా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చే యడంతో పాటు పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశం చారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించాలన్నారు. సమావేశంలో ఆడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, ఆర్ఐవో సైమన్‌విక్టర్, డీఈవో సుభద్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్టీసీ, విద్యుత్, తపాలా, ట్రెజరీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కురిచేడులో భారీ వర్షం

కురిచేడు, మే 18: కురిచేడు మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం గంట పాటు కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. మురికి కాలువలు నిండి మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. రోడ్లన్నీ చెత్తతో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కెనరా బ్యాంకు వీధిలో మురుగునీరు గృహాలలోకి చేరింది. కల్లూరు గ్రామంలో మల్లవరపు సురేష్, మల్లవరపు పిచ్చమ్మ గృహాలు గాలులకు కూలిపోయాయి. గత నెల రోజుల నుంచి వేసవి గాలులతో అట్టుడికిన ప్రజలు ఈ వర్షంతో సేద తీరుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గాలులతో కూడిన వర్షానికి కూలిన గృహం

పిడుగు పడి ఆవు మృతి

కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ కొత్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృతి చెందింది. ఆవు యజమాని చట్టం రామయ్య ఆవులతో పొలం వెళ్ళాడు. సాయంత్రం ఉరుములతో కూడిన కురిసిన వర్షంతోపాటు పిడుగు పడింది. పిడుగుపాటుకు రామయ్యకు చెందిన ఆవు మృతి చెందింది. దీంతో రూ.40 వేల నష్టం జరిగినట్లు రామయ్య తెలిపారు.

వర్షంతో ఉపశమనం

దొనకొండ, మే 18: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కురిసింది. రుద్రసముద్రం గ్రామ సమీపంలోని పదేళ్లుగా ఎండిపోయిన నీటి కుంటకు శనివారం కురిసిన భారీ వర్షానికి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కురిచేడులో కురుస్తున్న వర్షం


పిడుగుపడి మృతి చెందిన ఆవు


దొనకొండ: రుద్రసముద్రం గ్రామ సమీపంలోని నీటికుంటకు చేరిన వర్షపునీరు

వైభవంగా వాసవీ అమ్మవారి జన్మదినం


కురిచేడు: ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు, లక్ష కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కురిచేడు, మే 18: కురిచేడులోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి నారాయణం వెంకటేశ్వర్లు ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం వారిచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లూరులో ఘనంగా ఉత్సవాలు

తాళ్లూరు మే 18: వాసవీమాత జయంతి సందర్భంగా శనివారం మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. తాళ్లూరులో భక్తులు వేకువ జామునే ఆలయానికి చేరుకుని ప్రత్యేకంగా అలంకరించిన వాసవీమాతకు విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర నామపూజలు, గోత్ర నామపూజలు, కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశా రు. వాసవీమాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవాల నిర్వహకులు చందోలు ఆంజనేయులు, చందోలు రామారావు, చందోలు రవికుమార్, నేరెళ్ల రవి, నేరెళ్ల కిషోర్, మోటమర్రి ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు. మహిళలు కన్యకా మాతకు ప్రత్యేక పూజలు జరిపారు. తాళ్లూరులో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి ఊరేగింపు సందర్భంగా కోలాటం ప్రదర్శన చేశారు.

భక్తి శ్రద్ధలతో వేడుకలు..

పామూరు, మే, 18: పామూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం అమ్మవారి దివ్య జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అమ్మవారికి అభిషేకం కోసం కలశాలతో నెల్లూరు రోడ్డులోగల శ్రీరమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకువచ్చి అమ్మవారికి విశేష మంగళ ద్రవ్యాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలచే సాముహిక కుంకుమార్చన పూజలు, మహానైవేద్యం, మంగళహారతి, మంత్ర పుష్పం, పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారికి చీర సారె సమర్పణ చేసి అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


తాళ్లూరు:విశేషాలంకారంలో వాసవీమాత విగ్రహం


పీసీపల్లి: భక్తులకు దర్శనమిచ్చిన బ్రహ్మంగారు,గోవిందమాంబల మూలవిరాట్‌లు

ఘనంగా పట్టాభిరామస్వామి శాంతి కల్యాణం

సీఎస్‌పురం(పామూరు), మే 18: సీఎస్‌పురం మండలంలోని రామాపురం గ్రామంలో శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థానం తిరునాళ్ల శనివారం ప్రారంభమైంది. స్వామివార్ల శాంతి కల్యాణ వేడుకలను రుత్వికులు రావి నూతల రమేష్ వేద మంత్రాల నడుమ నిర్వాహించారు. ముందుగా ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహ మూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, నిర్వహించి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం వసంతోత్సవం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం వనభోజనాల కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఐదు జిల్లాలస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

పీసీపల్లి, మే 18: మండలంలోని మలినేనివారిపల్లిలో మూడు రోజులపాటు నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవం శనివారం ముగిసింది. గురువారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి నిధిలో జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం మహిళా భక్తులు పొంగళ్లు పెట్టి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత


పట్టుకొన్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎస్ఐ ప్రేమ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు), మే 18: సీఎస్‌పురంలో అక్రమ మద్యం బాటిళ్ల కలిగిఉన్న వ్యక్తిని శనివారం రాత్రి ఎస్ఐ ప్రేమ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సీఎస్‌పురం బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇతర జిల్లాల నుంచి పోస్టల్ బ్యాలెట్ల బాక్సులు రాక

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: ఇతర జిల్లాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ల బాక్సులు జిల్లాకు చేరారు. శనివారం ఒంగోలులోని స్పందన హాలులో ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్ల బాక్సులను రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఒంగోలు పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి, జిల్లా పోస్టల్ ఎన్నికల అధికారి యు.విశ్వేశ్వరరావు పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల బాక్సులను సీల్ ఓపెన్ చేసి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల వారీగా విభజన చేసి అసెంబ్లీలకు సంబంధించిన పోస్టల్ ఓట్లను ఆయా నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూములకు పంపారు.

ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలెక్టరేట్‌లోని పార్లమెంట్ స్ట్రాంగ్ రూములో భద్రపర్చారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్ పార్లమెంట్ ఓట్లు 2,330ఓట్లు, అసెంబ్లీ ఓట్లు 2,343 ఓట్లను బాక్సుల్లో పెట్టి సీల్ వేసి పోలీస్ బందోబస్తుతో స్ట్రాంగు రూములకు తరలించారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఆర్వో జీవీ.సుబ్బారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, రసూల్, బి.రాజశేఖర్, స్వరూప్, రాయపాటి జగదీష్, కొండారెడ్డి, యోహాన్, కోటేశ్వరరావు, బాలాంజనేయులు, టి.హరిప్రసాద్, బి.ఏడుకొండలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాల్‌ల్యాబ్ ట్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలి

ఒంగోలు(విద్య), మే 18: పాల్‌ల్యాబ్ సౌకర్యం ఉన్న పాఠశాలల్లో పాల్‌ల్యాబ్ ట్యాబ్‌లను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఎంఆర్.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఒంగోలులో శనివారం ప్రకాశం, బాపట్ల, అలాగే ప్రకాశం జిల్లాల్లో పాల్‌ల్యాబ్ సౌకర్యం ఉన్న 74 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ చేసినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పాల్ ల్యాబ్ సౌకర్యం అన్ని పాఠశాలల్లో లేదని, అలాంటి సౌకర్యం ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డీఈవో సుభద్ర మాట్లాడుతూ పాల్‌ల్యాబ్‌లను విద్యార్థులు ఎక్కువ సమయం పాటు సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలన్నారు. పాఠశాలల ప్రగతిని ఆయా సిబ్బందితో సమీక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కిషోర్, కన్వీజినియస్ సీనియర్ మేనేజర్లు సౌరవ్‌గౌడ్, ఉజ్వల్, రూపేష్, సమగ్ర శిక్ష జిల్లా నోడల్ అధికారి మాధవీలత, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్, బండ్లమిట్ట బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.





పల్నాడుకు కొత్త బాస్‌లు

- కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేష్ బాలాజీ
- ఎస్పీగా మలికా గార్గ్

నరసరావుపేట, మే 18: పల్నాడు జిల్లాకు కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేష్ బాలాజీ, ఎస్పీగా మలికా గార్గ్ నియమితులయ్యారు. జిల్లాలో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన హింసపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాలో కీలక అధికారులపై కొరడా ఝుళిపించింది. కలెక్టర్ శివ శంకర్ లోతేటిని బదిలీ చేసింది. ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు జిల్లాలో ఆరుగురు పోలీసు అధికారులను సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. సదరు అధికారులపై శాఖపరమైన చర్యలకు ఈసీ ఆదేశించింది.

* మలికా గార్గ్ గతంలో కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకు పైగా పనిచేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. మలికా గార్గ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పోలీస్ అధికారిని. ఆమె భర్త వకుల్ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు.

* లత్కర్ శ్రీకేష్ బాలాజీ 2011 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన అధికారి. గతంలో ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కో-ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం లత్కర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై కలెక్టర్‌గా రానున్నారు.



గ్రహణం వీడేనా?



రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామిక జిల్లాల్లో ఒకటిగా ఉన్న గుంటూరు జిల్లాలో పారిశ్రామిక రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా జిల్లాలో కొత్తగా పరిశ్రమలు వచ్చే పరిస్థితే లేకుండా పోయింది. పరిశ్రమాధిపతులపై అధికార వైసీపీ నేతల బెదిరింపులు, వేధింపులు, రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యల కారణంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎవరూ జిల్లాలో పరిశ్రమలు పెట్టేందుకు ముందు కు రాలేదు. అధికార పార్టీకి కప్పం కట్టలేక చాలా మంది తమ ప్రయత్నాలను మాను కున్నారు. లేదంటే పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో జిల్లాలో చెప్పుకో దగిన పరిశ్రమ ఒక్కటీ రాలేదంటే ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

- గడిచిన ఐదేళ్లలో జిల్లా పారిశ్రామిక రంగం కుదేలు
- జిల్లాలో మచ్చుకైనా కానరాని పారిశ్రామిక ప్రగతి
- భారీ, మధ్య తరహా పరిశ్రమల స్థాపన శూన్యం
- ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనలోనూ అదే దుస్థితి
- ప్రభుత్వ వైఖరితో పక్క రాష్ట్రాల వైపే అందరి చూపు
- రానున్న రోజుల్లోనైనా పరిస్థితి మారేనా?

గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన ఉమ్మడి జిల్లాకు పారిశ్రామికరంగంలో శాపంగా పరిణమించింది. విభజిత గుంటూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ఏమాత్రం అవకాశం లేకుండాపోయింది. కాగా సున్నపురాయి, నాపరాయి వంటి వనరులు, అటవీ సంపదను కలిగి వుండి, ఉమ్మడి జిల్లాలోని మొత్తం పరిశ్రమల్లో రెండింట మూడొంతుల పరిశ్రమలను పొందిన పల్నాడు జిల్లా పరిస్థితి కూడా అలానే వుండడం విషాదం. సముద్రతీరం, ఆక్వారంగం విస్తారంగా వున్న బాపట్ల జిల్లా పరిస్థితి కూడా ఇంచుమించు అలానే వుంది. 2022 ఏప్రిల్‌లో జరిగిన జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 16,020 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, కోటి నుంచి 50 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు 15,938 ఉన్నాయి. విభజనలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 81 భారీ పరిశ్రమల్లో 53 పరిశ్రమలు పల్నాడు జిల్లాకే దక్కాయి. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి భారీ సిమెంటు పరిశ్ర మలు, పిడుగురాళ్ల కేంద్రంగా ఉన్న సున్నపు బట్టీల పరిశ్రమ, చిలకలూరి పేట స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్ హబ్‌లు అన్నీ పల్నాడు పరమయ్యాయి. బాపట్ల జిల్లాకు 2 భారీ పరిశ్రమలు పోగా మిగిలిన 26 పరిశ్రమలతో గుంటూరు జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. కాగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 15,938 ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో దాదాపు 8 వేల ఎంఎస్ఎంఈలు పల్నాడుకే దక్కాయి. మిగిలిన వాటిలో సుమారు 1500 ఎంఎస్ఎంఈలు బాపట్ల జిల్లాకు పోగా గుంటూరు జిల్లాకు 6,425 పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. అయితే భారీగా పరి శ్రమలు వున్న పల్నాడు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని భావించినా, గడిచిన రెండేళ్లలో అలాంటి పరి స్థితి ఏమాత్రం కనిపించలేదు. రాజధాని జిల్లాగా వున్న గుం టూరులో రోడ్లు, రైలుమార్గాలు విస్తారంగా వున్నా పరిశ్రమల స్థాపన జరగలేదు. అందుకు కారణం ప్రభుత్వ కక్ష సాధింపు వైఖరే అని తెలుస్తోంది.

సూక్ష్మ పరిశ్రమలదీ అదే దుస్థితి

సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు జిల్లాలో తగిన స్థానం దక్కలేదు. కిందటేడాది రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు భారీ లక్ష్యాలను నిర్ణయించుకుని నానా హడావుడి చేసినా పరిశ్రమల స్థాపన జరగలేదు. రూ.లక్ష నుంచి 5 లక్షల లోపు పెట్టుబడులతో ఒకరు లేక ఇద్దరికి ఉపాధి కల్పించే అతి చిన్న పరిశ్రమలు స్థాపించడానికి కూడా సాహసించలేని పరిస్థితి ఉండడంతో లక్ష్యాల్లో మూడొవంతు పరిశ్రమలు కూడా స్థాపించలేకపోయారు. గుంటూరు జిల్లాలో రూ.750 కోట్లతో 6,000 ఎంఎస్ఎంఈలు స్థాపించి 7,500 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 365.4 కోట్ల పెట్టుబడులతో 2,197 ఎంఎస్ఎంఈలను స్థాపించారు. బాపట్ల జిల్లాలో రూ.500 కోట్లతో 4,000 ఎంఎస్ఎంఈలను స్థాపించాలనుకోగా రూ.239 కోట్లతో 1,516 ఎంఎస్ఎంఈలను స్థాపించారు. పల్నాడు జిల్లాలో రూ.625 కోట్ల పెట్టుబడితో 5000 ఎంఎస్ఎంఈలను స్థాపించాలనుకోగా రూ.16.6 కోట్లతో కేవలం 410 ఎంఎస్ఎంఈలు మాత్రమే స్థాపించారు.

ఐదేళ్ల గ్రహణం వీడేనా?


గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అనేది జిల్లాలోని యువతకు కలగానే మిగిలిపోయింది. ఖనిజ, సహజ వనరుల ఖిల్లాగా ఉన్నా, రోడ్లు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల కల్పన విస్తారంగా వున్నా జిల్లాలో పారిశ్రామిక ప్రగతి కుంటుబడిపోయింది. ఈ కారణంగా జిల్లాలోని యువతకు పని దొరకడమే కష్టంగా మారిపోయింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఇకనైనా తమ రాతలు మారాలని వారు బలంగా కోరుకుంటున్నారు. ఇదే ప్రభుత్వం మళ్లీ వస్తే తమ బతుకుదెరువు, భవిష్యత్తు రెండూ కనుచూపు మేరలో కనిపించవన్న భయం వారిని వెంటాడుతోంది. ఈ క్రమంలోనే వారంతా ప్రభుత్వం మారాలని, తద్వారానే తమ తలరాతలు మారతాయని బలంగా నమ్ముతున్నారు.

రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

గత చంద్రబాబు ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. 2014- 21 మధ్య కాలంలో గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా 2,485.47 కోట్ల రూపాయల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. కాగా 2021- 22, 2022- 23 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగాని, ఒక్క రూపాయి పెట్టుబడిగానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని సాక్ష్యాత్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వేనే చెబుతోంది.



ఫుల్‌గా.. తాగేశారు..



- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దిమ్మ తిరిగేలా మద్యం అమ్మకాలు
- 56 రోజుల్లో 235.31 కోట్ల లిక్కర్ అమ్మకాలు
- కోట్ల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కుమ్మరించారు...

గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): గతంలో ఏ ఎన్నికల్లో లేని రీతిలో ఈ పర్యాయం మద్యం ఏరులై పారింది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఓటర్లను మత్తులో ముంచే ప్రయత్నం చేశారు. తమ పాలనతో ప్రజలు అన్ని రకాలుగా విసుగు చెందారని ముందుగానే గుర్తించిన వైసీపీ అభ్యర్థులు ఓటర్లకు అవేవీ గుర్తుండకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మత్తు దిగగానే వారు తమ ప్రతాపం చూపించారు. ఈ ఐదేళ్లలో మద్యం వ్యాపారాన్ని సైతం ప్రభుత్వం పేరుతో వైసీపీ పాలకులు తమ హస్తగతం చేసుకున్న విషయం తెలి సిందే. దీంతో మద్యం దుకా ణాల మధ్య పోటీ లేకపోవటం తో పాలకుల ఇష్టారాజ్యం అయి పోయింది. జె బ్రాండ్‌గా ప్రజలు పిలు చుకునే నాసిరకం మద్యంను మాత్రమే షాపుల్లో ఉంచి అమ్మించారు. వాటికి కూడా అధిక ధరలు పెట్టి పేదలను దోచుకున్నారు. కేవలం నగదుతోనే అమ్మకాలు జరిపించి లాభాల లెక్కలను గోల్‌మాల్ చేసి ఎన్నికల ఫండ్‌కు వాటిని మరలించినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇలా పేదల నుంచి దోచుకున్న సొమ్ముతోనే తిరిగి మద్యం రూపంలో వారికే ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ అధిష్టానం పన్నిన కుయుక్తులు పారలేదు. ఎన్నికలకు రెండు, మూడు నెలలు ముందు కూడా నాసిరకం మద్యం సీసాలతోనే షాపులను నింపిన వైసీపీ ప్రభుత్వం హఠాత్తుగా ఓటర్లపై ప్రేమ చూపుతూ మంచిరకం మద్యం కూడా వైన్‌షాపుల్లో ఉండేలా చూశారు. దీనికి కూడా ప్రధాన కారణం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన ఎన్నికల ప్రచార సభల్లో జె బ్రాండ్ పేరుతో పేదలను దోచుకోవటమే కాకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, సీఎం జగన్‌పై ఆగ్రహం వెలిబుచ్చుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంచి మద్యాన్ని మాత్రమే అమ్మిస్తామనే చెప్పటంతో ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్య పెట్టేందుకు కొద్దిరోజుల పాటు మురిపించారు. కాగా ఎన్నికల జాతర ప్రారంభమై ముగిసిన 56 రోజుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ.235.31 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు రికార్డుల్లో చూపారు. వాస్తవానికి ఇందులో 10 శాతం కూడా ప్రజలు నేరుగా కొనుక్కొని తాగింది ఉండదు. మిగతా అంతా కూడా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ముఖ్యంగా వైసీపీ క్యాండెట్స్ కొనుగోలు చేసి పంపిణీ చేసేందేనని చెప్పుకోవచ్చు. గత్యంతరం లేక టీడీపీ అభ్యర్థులు కూడా తాము మద్యం పంపిణీ చేసేందుకు కొనుగోలు చేయాలని ప్రయత్నించినప్పటికీ సింహభాగం తమ పార్టీ అభ్యర్థులకే దక్కేలా వైసీపీ పెద్దలు అధికార దర్పంతో చేశారు. దీంతో ప్రతిపక్షంలో ఉన్న కూటమి అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉండే బార్ యజమానుల నుంచి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేయాల్సి వచ్చింది. నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16 నుంచి ఈనెల 11వ తేదీ వరకు (పోలింగ్ తేదీకి రెండు రోజులు ముందు షాపులు మూసివేశారు) 2,60,200 కేసులు లిక్కర్ అమ్మకాలు జరిగాయి. అంటే బ్రాందీ, విస్కీ వంటి మద్యం, బీరు అమ్మకాలు 76,100 కేసులు అమ్మారు. ఇదంతా అధికారుల లెక్కల్లోఉండే మద్యం అమ్మకాల చలామ ణీ మాత్రమే ఇక ఏపీలో కంటే పొరుగురాష్ట్రాల్లో మద్యం చౌకగా లభిస్తుండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ఆ రాష్ట్రాల నుంచి లారీల్లో తమ తమ నియోజకవర్గాలకు తరలింప చేసుకొని గడ్డివాముల్లో నిల్వ చేసి విడతల వారీగా ఎన్ని కల ప్రక్రియ ముగిసే వరకు పంపి ణీ చేశారు. దీని విలువ అంచనాకు అందనప్పటికీ కోట్లల్లోనే ఉంటుందని చెప్పవచ్చు. విశేషమేమిటంటే ప్రభుత్వం ఎన్నికల నియమావళి ప్రకారం 11వ తేదీనే దుకాణాలను మూయించి సీల్ వేసినప్పటికీ అప్పటికే తమ తమ స్థావరాల్లో రహస్యంగా ఉంచిన మద్యాన్ని సాధారణ రోజుల్లో కంటే ఎక్కువగా పారేలా చేశారు.

దాడులు జరుగుతుంటే..

ఏం చేస్తున్నారు

- పోలీసులపై సిట్ బృందం ప్రశ్నల వర్షం
- పోలింగ్ అరాచకాలపై విచారణ ప్రారంభం
- నరసరావుపేట, రెంటచింతల పోలీస్‌స్టేషన్లలో విచారణ

నరసరావుపేట, రెంటచింతల, మే 18: దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.. ఘటనలపై ముందస్తు సమాచారం ఉంది కదా.. ముందస్తు ఏం చర్యలు తీసుకున్నారు.. విధ్వంసం సృష్టిస్తున్న వారిని ఎందుకు అడ్డు కోలేకపోయా రు.. అంటూ సిట్ బృందం పోలీసు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక సంఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో విచారణకు నియ మించిన సిట్ బృందం శనివారం రంగంలోకి దిగింది. సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు సిట్ బృందంలోని సభ్యురాలు ఏసీబీ ఏఎస్పీ సౌమ్యలత విచారణ చేశారు. నరసరావుపేట రెండో పట్టణ, రెంటచింతల పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఘటనలు, నమోదైన కేసుల వివరాలను స్థానిక పోలీసు అధికారుల నుంచి సేకరించారు. నరసరావుపేటలో పోలింగ్ రోజున జరిగిన రెండు హత్యాయత్నం, రెండు అట్రాసిటీ, ఓ కారు దహనం కేసుల వివరాలను సౌమ్యలత పరిశీలించారు. అనంతరం రెంటచింతల పోలీసు స్టేషన్ సందర్శించిన సిట్ బృందం మండలంలో జరిగిన ఘటనలపై వివరాలను సేకరించింది. నమోదైన కేసులు, వాటి ఎఫ్ఐఆర్‌లను పరిశీలించింది. దాడుల్లో గాయపడిన వారి వివరాలతో పాటు వారు ఎక్కడ చికిత్స పొందుతున్నారన్న వివరాలను తీసుకున్నారు. పిన్నెల్లిలో ఈవీఎంలను ధ్వంసం రెంటాలలో పోలింగ్ ఏజంట్లపై వేట కొడవళ్లతో దాడి, జెట్టిపాలెం, తుమృకోట గ్రామాల్లో జరిగిన ఘర్షణలపై సిట్ వివరాలను సేకరించింది. కారంపూడిలో మరణాయుధాలతో స్వైర్యవిహారం చేసిన సంఘటన వివరాలను సిట్ సేకరిస్తోంది. గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల్లో జరిగిన ఘటలపై సిట్ వివరాలు సేకరించనున్నది.


విచారణలో సిట్ అధికారి సౌమ్యలత

అరెస్టులు.. ఆందోళనలు

జిల్లాలో పోలింగ్ విధ్వంసాలు, దాడులపై సిట్ బృందం విచారణను ముమ్మ రం చేసింది. ఆదివారానికి విచారణను పూర్తి చేసి ఈసీకి నివేదిక పంపనుంది. ఈ క్రమంలో గొడవలతో సంబంధం ఉన్న రాజకీయ పార్టీ నేతల అరెస్టుకు రంగం సిద్ధమవుతుందని సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపైనా చర్యలుకు సమాయత్తమవుతున్నారు. అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు కఠినంగా ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. దీంతో అటు పోలీసు అధికారులు, ఇటు రాజకీయ నేతలు ఆందోళనలో ఉన్నారు. ఘటనలకు సంబంధించిన రాజకీయ పార్టీల నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇప్పటికే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు మాచర్ల వదలి పరారైన విషయం తెలిసిందే.

శరవేగంగా రహదారి పనులు

- నాలుగు వరుసల్లో వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు
- రెండేళ్లలో పనులు పూర్తి అవుతాయని అధికారుల అంచనా

పర్చూరు, మే 18: వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం చొరవతో రోడ్డు పనులకు గ్రహణం వీడింది. నేషనల్ హైవే 167(ఏ) ఎన్‌హెచ్ఏఐ కింద రోడ్డు నిర్మాణానికి రూ.825.76 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆశాఖ అధికారులు తెలిపారు. భూసేకరణ పూర్తి కావడంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో పనులను ప్రారంభించారు. దీంతో రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. వాడరేవు నుంచి చిలకలూరిపేట 47 కిలో మీటర్లు ఒక భాగం గా, చిలకలూరిపేట - పిడుగురాళ్ల వరకు మరో భాగంగా విస్తరించి పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు. గతంతో విస్తరించి ఉన్న రెండు వరుసల మార్గాన్ని నాలుగు వరుసలుగా పెంచే పనులు అత్యధికశాతం పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా పర్చూరు వై జంక్షన్ వద్ద, అన్నంబొట్లవారిపాలెం సమీపంలో, కారంచేడు- పర్చూరు మార్గంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డును చదును చేసే పనులు సాగుతున్నాయి. పర్చూరు వాగుపై ఫ్లైవోవర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఉప్పుటూరు సమీపంలో పనులు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఈ రహదారి పనులు పూర్తి అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణంతో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రయాణం సులభతరం కానుంది.

కుంకలమర్రు రోడ్డులో కొమ్మమూరు కాలువ మీదుగా రహదారి నిర్మాణానికి చేపడుతున్న పనులు



అన్నంబొట్లవారిపాలెం సమీపంలోని ఈపూరివారిపాలెం వద్ద చేస్తున్న రహదారి నిర్మాణం

మద్యం.. డోర్ డెలివరీ

- క్వార్టర్‌కు రూ.50 అదనంగా వసూలు
- బెల్ట్ దుకాణాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు


మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వ్యాపారి

మేదరమెట్ల, మే 18: రూ.50 అదనంగా చెల్లిస్తే చాలు.. ఎప్పుడు కావా లంటే అప్పుడు.. ఎక్కడికి కావాలంటే అక్కడికి.. ఏ సమయంలోనైనా మద్యం అందుతుంది. మందుబాబుల సేవకు బెల్టు షాపుల నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనల మేరకు విక్రయాలు జరగాలి. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మామూళ్లకు అలవాటు పడిన సిబ్బంది ఇష్టారీతిన మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా చెల్లించి రాజకీయ నాయకులు పెద్దసంఖ్యలో మద్యం తరలించారు. ఇలా మద్యం దుకాణాల్లో పని చేసే వారు రూ.3 నుంచి 4 లక్షలకు వరకు సంపాదించినట్లు సమాచారం. శనివారం మేదరమెట్లలో తమ్మవరం రోడ్డులోని మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి ఒకేసారి పది బాటిళ్ల మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఉన్నా, స్థానికులు ఇదంతా వీడియోలు తీసినా అటు దుకాణంలోని సిబ్బంది కాని, ఇటు ఆ వ్యక్తి కానీ భయపడలేదంటే వారెంతకు బరితెగించారో అర్థమవుతుంది. అనధికారికంగా బార్లు నడిపే వారు కూడా మద్యం దుకాణాల్లోని సిబ్బందిని ప్రసన్నం చేసుకుని మద్యం తీసుకెళ్లి అదనపు మొత్తాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అనాధికారికంగా బార్లు నిర్వహించేవారికి మద్యం మీదనే రోజుకు రూ.5 వేల ఆదాయం వస్తుందంటే ఎంత మొత్తంలో వీరు మద్యం తీసుకువెళ్తున్నారో అర్థంచేసుకోవచ్చు. ప్రతి గ్రామంలో పదికి పైగా బెల్టు షాపులు ఉన్నాయి. మేదరమెట్ల లాంటి మేజర్ పంచాయతీలో 30 మందికి పైగా మద్యం విక్రయిస్తున్నారు అంటే షాపుల నుంచి ఎంత పెద్ద మొత్తంలో మద్యం బయటకు వెళ్తుందో తెలుసుకోవచ్చు. వీరు కాకుండా రాత్రి 9 గంటల తర్వాత మోటర్ సైకిళ్లపై తిరుగుతూ అడిగిన వారికి ఎక్కడికైనా మద్యం సరఫరా చేసే వారు ఇటీవల ఎక్కువయ్యారు. బెల్టు షాపులు నిర్వహించే వారు ఒక్క మద్యం పైనే రోజుకు వెయ్యి సంపాదిస్తున్నారని తెలిసింది. మేదరమెట్లలో ఓ షాపులో కేసు మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ఓ ఇటీవల అధికారులు పట్టుకున్నారు. దీంతో ఆ సూపర్‌వైజర్ ఎస్ఈబీ అధికారులకు రూ.2 లక్షలు చెల్లించి కేసు లేకుండా చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మేదరమెట్లలో తెలంగాణ మద్యం పెద్ద మొత్తంలో పట్టుకున్న అధికారులు 4 బాటిళ్లు మాత్రమే చూపి ఆ వ్యక్తి నుంచి మద్యంతో పాటు లక్ష తీసుకున్నారని తెలిసింది. ఇప్పటికైనా ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు షాపుల్లో పని చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటే అనాధికారిక బార్లు, బెల్టు షాపులు పెరిగిపోయే అవకాశం ఉంది.



టంగుటూరు వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

పొగాకు ధరలు పైపైకి..

- మార్కెట్‌లో కొనసాగుతున్న జోరు
- కిలో రూ.311 పలికిన గరిష్ఠ ధర

ఒంగోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో జోరు కొనసాగుతూనే ఉంది. రోజురోజుకు ధరలు పైపైకి పోతున్నాయి. తాజాగా శనివారం మేలురకం గరిష్ఠ ధర గతం కన్నా మరో రూ.3 పెరిగి కిలో రూ.311 లభించింది. అలా గత నాలుగైదు రోజుల్లోనే కిలోకు రూ.10 నుంచి రూ.11 వరకు ధరలు పెరిగాయి. ఈ సీజన్ ప్రారంభం నుంచి మార్కెట్ వేగంగానే సాగుతోంది. తొలుత నెలరోజులకుపైగా మేలురకం ధరలు కిలో రూ.250కి అటుఇటు నిలకడగా సాగుతూ మీడియం, లోగ్రేడ్‌లకు డిమాండ్ వచ్చి ధరలు పెరిగాయి. దీంతో రైతులు కూడా మేలురకం బేళ్లను ఇళ్ల వద్ద ఉంచుకొని లోగ్రేడ్ బేళ్లను వేలంకేంద్రాలకు తెస్తున్నారు. ఇప్పటికి కూడా ఆయా వేలం కేంద్రాలలో చూస్తే మేలురకం కన్నా మీడియం, లోగ్రేడ్ బేళ్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొద్దిమొత్తంలో మేలురకం తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్షం రోజులుగా మేలురకం ధరలను కూడా వ్యాపారులు పెంచారు. క్రమంగా ఆ ధరలు పెరుగుతూ వారం క్రితం కిలో గరిష్ఠ ధర రూ.300లకు చేరుకోగా, మూడు రోజుల క్రితం రూ.305, శుక్రవారం రూ.308, శనివారం మరో రూ.3 పెరిగి రూ.311కు చేరింది. ఒంగోలు-2 వేలం కేంద్రంలో ఈ ధర లభించగా, ఒంగోలు-1లో గరిష్ఠ ధర రూ.310 అలాగే ఇతర కేంద్రాల్లోనూ రూ.305 అంతకన్నా ఎక్కువగానే పలికాయి. ఇక బ్రౌన్, లోగ్రేడ్‌లోని పచ్చధరలు కూడా బాగానే ఉండటంతోపాటు బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీ పడుతుండటం మార్కెట్లో కనిపిస్తోంది. కాగా ఇప్పటివరకు ఈ సీజన్‌లో సుమారు 50 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.339 వరకు ధర లభించింది. లోగ్రేడ్ బేళ్లు మూడొంతులకుపైగా అమ్మకాలు పూర్తికాగా మీడియం, లోగ్రేడ్ బేళ్లు అధికంగా ఇక నుంచి రానున్నాయి. అయితే రానున్న రోజుల్లో మేలురకం బేళ్ళ ధరలు మరికొంత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వాహనాలకు మాత్రమే..

- సీసాలు, డ్రమ్ములకు డీజిల్, పెట్రోలు సరఫరా చేస్తే చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

ఒంగోలు(కలెక్టరేట), మే 18 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం నుంచి వచ్చేనెల 10వతేదీ వరకు వాహనాలకు మాత్రమే అవసరమైన మేరకు పెట్రోలు, డీజల్‌ను నింపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను తప్పనిసరిగా పెట్రోలు బంకుల యజమానులు పాటించాలన్నారు. ఆ మేరకు కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోలు బంకుల నుంచి పెట్రోలు, డీజల్ కంటైనర్లకు, బాటిల్స్‌కు, డ్రమ్ములు, ఇతర పాత్రలకు సరఫరా చేస్తే సంబంధిత బంకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతో నిఘాను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్‌ను పెట్రో బంకులు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు కోసం సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. బంకులకు వచ్చే వాహనాలకు మాత్రమే డీజల్, పెట్రోలు నింపాలని కలెక్టర్ సూచించారు.

తొమ్మిది ప్రైవేటు వైద్యశాలలకు నోటీసులు జారీ

గర్భిణులకు అత్యధికంగా సిజేరియన్లు చేయడమే కారణం

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో గర్భిణులకు అత్యధికంగా ఆపరేషన్లు చేసిన తొమ్మిది ప్రైవేటు వైద్యశాలలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. గర్భిణులు డెలివరీ కోసం ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. అయితే వందకు 80శాతం మంది మహిళలకు సిజేరియన్(ఆపరేషన్లు) చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒంగోలులో ఆరు, మార్కాపురంలో రెండు, గిద్దలూరులోని ఒక ఆస్పత్రిలో ఎక్కువగా సిజేరియన్‌లు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు డేటా ద్వారా గుర్తించారు. సాధారణ కాన్పునకు ప్రాధాన్యత ఇచ్చి ఆ తర్వాతనే అవసరమైతే సిజేరియన్ చేయాల్సి ఉంది. కానీ ఆయా ప్రైవేటు హాస్పిటల్స్‌లో చేరిన గర్భిణులందరికి ఆపరేషన్లు చేసినట్లుగా నిర్ధారించి ఈ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆయా ఆస్పత్రుల నుంచి వివరణ తీసుకుంటామని ఆయన తెలిపారు.



టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్

చంద్రబాబును కలిసిన లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, మే 18: టీడీపీ అధినేత చంద్రబాబును దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్, ఆమె చినమామ, ఏఎంసీ మాజీ చైర్మన్ కడియాల రమేష్‌లు కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో శనివారం వారు కలిసి దర్శి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ తీరును వివరించారు. ఈసందర్భంగా చంద్రబాబు అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని, కుటుంబ సభ్యులను, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకలను అభినందించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేశారని ప్రశంసించారు. వైసీపీ దాడులను, దుష్ప్రచారాన్ని విజయవంతంగా తిప్పికొట్టారని అన్నారు. ప్రజల్లో టీడీపీ కూటమి పట్ల విశ్వాసం మరింత పెరిగే విధంగా కృషి చేశారని చంద్రబాబు అభినందించినట్లు వారు వివరించారు.

వలస ఓటర్లు తిరుగు ప్రయాణం

- రద్దీగా బస్సులు ● గమ్యస్థానాలకు చేరేందుకు పడిగాపులు

కనిగిరి, మే 18: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కనిగిరి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వలస ఓటర్లు స్వగ్రామాల్లో ఓటు వేసేందుకు వచ్చారు. ఈనెల 13న తమ ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు తిరిగి ఇతర రాష్ట్రాలకు వేళ్ళేందుకు ఆర్టీసీలో తగినన్ని సీట్లు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయివేటు బస్సులను ఆశ్రయించాల్సి వస్తుంది. బస్సుల యాజమాన్యాలు అవకాశాన్ని అదనుగా తీసుకుని రేట్లు విపరీతంగా పెంచేశారు. దీంతో చేసేది లేక అదనపు చార్జీలు చెల్లించి తిరిగి వెళుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళాలంటే ఒక్కో వ్యక్తి నుంచి దాదాపు రూ.1500లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదనపు చార్జీలు భారం మోయలేని పేద కుటుంబాలు ఆర్టీసీ బస్సులే దిక్కయ్యాయి. దీంతో డిపోలో బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు.

పంచాయతీ వార్డు సభ్యుడు మృతి

అద్దంకిటౌన్, మే 18: మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన 1వ వార్డు మెంబరు మోటుపల్లి మల్లికార్జునరావు(47) అక్కడిక్కడే అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. వార్డు మెంబరుగా గ్రామానికి మల్లికార్జునరావు చేసిన సేవలను గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు.

జిల్లాలో రెచ్చిపోతున్న వైసీపీ మూకలు

పోలింగ్ రోజున రెచ్చగొట్టి దాడులు

ఎన్నికల అనంతరం అనేక ఘటనలు

కొనసాగుతున్న కవ్వింపు చర్యలు

పెచ్చరిల్లుతున్న అరాచకత్వం

ఇప్పటికే నిఘా వర్గాల హెచ్చరికలు

పోలీసు అధికారులు కనిపించని అప్రమత్తత

ఒంగోలు(క్రైం), మే 18: ఎన్నికల పోలింగ్ వేళ, ఆ తర్వాత జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించబడ్డాయి. అధికార వైసీపీ నాయకులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. అంతేకాదు పోలింగ్ రోజు పలు ప్రాంతాలలో బూత్‌లను స్వాధీనం చేసుకునేందుకు యత్నం చేశారు. అనేక ప్రాంతాలలో దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి ఘర్షణలకు దిగారు. దర్శి నియోజంకవర్గంలో అయితే మరీ రెచ్చిపోయారు. టీడీపీకి పట్టు ఉన్న గ్రామాల్లో దాడులకు తెగబడ్డారు. పోలింగ్ మరుసటి రోజు కవ్వింపుచర్యలకు దిగి దారుణంగా కొట్టారు. ఇక ఒంగోలు నియోజకవర్గం వెంగముక్కలపాలెంలో పోలింగ్ మరుసటి రోజు దళిత మహిళ ఇంటిపై వైసీపీ మూకలు అర్థరాత్రి దాడి చేశాయి. ఇలా వైపాలెం నియోజకవర్గంలోనూ జరిగింది. అలాగే రోజుకొక ఘటనతో అధికారపార్టీ దారుణాలు ఆగడం లేదు. కవ్వింపు చర్యలు, ప్రత్యర్థి వర్గాల ఆస్తుల ధ్వంసం కొనసాగుతూనే ఉంది. ఇది ఇలాగే కొనసాగితే దాడులకు ప్రతిదాడులు కూడా చోటుచేసుకునే అవకాశం ఉందని నిఘావర్గాల సమాచారం. అయినా పోలీసుల నుంచి ఆశించిన స్థాయిలో అప్రమత్తత కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల వేళ విషసంస్కృతి చొరబడింది. మొదట ఒంగోలు సమతనగర్‌లో ఎన్నికల ప్రచార సందర్భంగా టీడీపీ నేతపై దాడి, ఆపై రిమ్స్ వద్ద మాజీ మంత్రి బాలినేని ఆధ్వర్యంలో వైసీపీ మూకల వీరంగం రాష్ట్రమంతా చర్చనీయాంశమైంది. దీంతో ఎన్నికల కమిషన్ స్పందించి ఒంగోలును సమస్యాత్మక నియోజకవర్గంగా ప్రకటించి పూర్తి వెబ్‌కాస్టింగ్‌తో ఎన్నికలు నిర్వహించారు. అలాగే జిల్లాలోనూ పెద్ద ఎత్తున పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక దృష్టిపెట్టింది. అదనపు బలగాలను కేటాయించింది. అయినా పోలింగ్ రోజు హింస జరిగింది. ఆ తర్వాత కొనసాగింది. వెంగముక్కపాలెంలో పోలింగ్ రోజు చోటుచేసుకున్న ఘటన తర్వాత దాడులకు ప్రేరణగా మారింది. అంతేకాదు కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో దుర్గాప్రసాద్ అనే యువకుడిని వైసీపీకి చెందిన వారు తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ పరిస్థితి నివురుగప్పిన నిప్పుల ఉంది. ఎప్పుడు ప్రతిదాడులు జరుగుతాయో తెలియని పరిస్థితి. ఇలా దర్శిలో, ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎన్నికల రోజు ప్రారంభమైన ఘర్షణలు తర్వాత కొనసాగాయి. ఇలా చిన్న చిన్న ఘటనలు అనీ పోలీసులు వదిలేస్తే అవి చినికి చినికి గాలివానగా మారే పరిస్థితి ఉంది. అంతేకాదు మూడురోజుల క్రితం ఒంగోలు గద్దలగుంటలో కొందరు వైసీపీ యువనేత అనుచరులమంటూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఆరుబయట అరుగు మీద పడుకుని ఉన్న వృద్ధుడిని పూటుగా తాగి ఉన్న యువకులు విచక్షణరహితంగా కొట్టారు. అదేమని ప్రశ్నించిన బాధితుడి తరపు వారిని తాము వైసీపీ వారమని బెదిరించారు. ఇలా అనేకచోట్ల ఎన్నికల అనంతరం దాడులు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఇంకా దాడులకు తెగపడే పరిస్థితి ఉందని ప్రచారం జరుగుతుంది. ఇలాంటి పరిణామాలను పరిశీలించి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో చోటుచేసుకున్న ఘటనలు జిల్లాలో జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

బాధితులపై కేసు నమోదు

దర్శి నియోజకవర్గంలో బొట్లపాలెంలో పోలింగ్ రోజు, అనంతరం జరిగిన ఘటనలో గాయపడిన వారిపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడం విశేషం. ఎన్నికల సందర్భంగా బాలినేని కోడలు కావ్యారెడ్డి వెంగముక్కపాలెంలో టీడీపీ వారిపై చెప్పులతో దాడికి దిగారని పోలింగ్ బూత్‌లోకి చొరబడినట్లు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదు. పైగా బైండోవర్ పేరుతో టీడీపీ వర్గీయులను ఇబ్బందులకు గురిచేయడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఆ పక్షపాత ధోరణిపై గత బుధవారం టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ వారికి కొమ్ముకాస్తున్నారని పోలీసు అధికారులపై మండిపడ్డారు. ఇలా కౌంటర్ కేసుల పేరుతో కొందరు పోలీసు అధికారులు బాధితులను వేధిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. దాడులను అరికట్టాల్సిన వారే ఇలా వారికి సహకరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిఘావర్గాల హెచ్చరికలు

రాష్ట్రంలో కౌంటింగ్ అనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉందని నిఘావర్గాలు హెచ్చరించాయి. దీంతో జూన్ 19 వరకు కేంద్ర బలగాలు ఆయా ప్రాంతాల్లో ఉండే విధంగా ఆదేశాలందాయి. అదేవిధంగా ఎస్పీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

పోలీసు గస్తీ పెంచాలి

ఎన్నికల అనంతరం ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ఉండాలంటే పోలీసులు గస్తీ ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా రాత్రుళ్లు నిఘా పెంచాలి. ఏదైనా ఘటన జరిగితే వెంటనే స్పందించాలి. అదే విధంగా ఘర్షణ జరిగిన చోట మరలా అలాంటి అవాంచనీయ ఘటనలకు చోటు లేకుండా చర్యలు చేపట్టాలి. అరాచకశక్తులను అరెస్టు చేయాలి. కేసులు నమోదు చేయాలి. అంతటా శాంతియుత వాతావరణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తమంగా ఉండాలని ఎస్పీ ఆదేశాలు

పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాలిచ్చారు. బైండోవర్ చేసిన వారికి హెచ్చరికలు జారీచేయాలన్నారు. అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా ఘటన జరిగితే కిందిస్థాయిలో ఉన్న పోలీసు అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు.

నివురు గప్పిన నిప్పు

కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో గత ఎన్నికల్లో వైసీపీ పనిచేసిన కొన్ని కుటుంబాలు ఈసారి తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచాయి. ఆ అక్కసు వైసీపీ వర్గీయులు పోలింగ్ మరుసటి రోజు దాడులకు తెగబడ్డారు. వారి దాడిలో గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌కు తలపగిలింది. ప్రస్తుతం అక్కడ పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.

పోలింగ్ రోజున మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు కావ్యారెడ్డి ఒంగోలు నగర పరిధిలోని వెంగముక్కలపాలెంలోని బూత్‌లోకి సాయంత్రం 6 గంటల తర్వాత వెళ్లడాన్ని ధనలక్ష్మి అనే మహిళ ప్రశ్నించడం నేరమైంది. కావ్యారెడ్డి పక్కన ఉన్న మూకలు ఆమెపై చెప్పులు విసిరి దాడికి దిగారు. ఇదేమని అడిగిన వారిని కొట్టారు. అదేరోజు రాత్రి మరలా కావ్యారెడ్డి అనుచరులు పెద్దసంఖ్యలో వెళ్లి బాధితుల ఇంటిపై దాడిచేసి ఇంటి అద్దలు పగులకొట్టారు. అయితే ధనలక్ష్మిపై కౌంటర్ కేసు నమోదు చేయడం పోలీసుల పనితీరుకు అద్దం పడుతుంది.

యర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం ముటుకులలో వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పోలింగ్ బూత్‌లోకి వెళ్లి హల్‌చల్ చేశారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ వర్గీయులు ఇదేమిటి అని ప్రశ్నించడంతో వైసీపీ వర్గీయులు రెచ్చిపోయి రాళ్ల దాడికి దిగారు. ఇరువర్గాలు తలపడటంతో పోలీసులు రెండు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు.

దర్శి మండలం బొట్లపాలెంలో పోలింగ్ రోజు, అనంతరం బలహీనవర్గాల వారే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఎన్నికల ముందురోజు తెలుగు యువత నేత కల్లూరి సుబ్బుపై దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన మిన్నకుండిపోయారు. దాడిచేసిన వారే మరలా బలహీనవర్గాలకు చెందిన మహిళలపైనా దాడి చేశారు. దీంతో ఇరువురికి తలలు పగిలాయి. అయితే దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని అక్కడ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ధర్నా చేస్తే కానీ పోలీసులు స్పందించలేదు.

- ఇదీ జిల్లాలో సాగిన, సాగుతున్న ఎన్నికల హింస. ఈ విషసంస్కృతిని అరికట్టాల్సిన పోలీసులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు. దీంతో అధికార వైసీపీ వర్గాలు మరింత రెచ్చిపోతున్నాయి. ఎక్కడో ఒకచోట దాడులు, ఆస్తుల ధ్వంసం, కవ్వింపు చర్యలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. పోలింగ్ రోజే పోలీసులు కఠిన చర్యలు తీసుకుని, అరాచక శక్తులను అరెస్టులు చేసి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.



పోలింగ్ సందర్భంగా కొత్తపట్నం మండలం పల్లెపాలెం, దర్శి మండలం బొట్లపాలెంలో వైసీపీ వర్గీయుల దాడుల్లో గాయపడిన దుర్గాప్రసాద్, కల్లూరి సుబ్బు(ఫైల్)

వైసీపీ నాయకుల అరాచకం



వైసీపీ నాయకులు తగలపెట్టిన టీడీపీ నాయకుడు బాలుడి దానిమ్మతోట

టీడీపీ నేత దానిమ్మతోటకు నిప్పు

రూ.3లక్షల మేర ఆస్తినష్టం

మార్కాపురం, మే 18: వైసీపీ నాయకుల అకృత్యాలకు అడ్డు, అదుపు లేకుండా పోయింది. మార్కాపురం పట్టణంలో నివాసముండే టీడీపీ నాయకులు తడికమళ్ల బాలసుబ్బారావు(బాలుడు) గతంలో టీడీపీ పెద్దారవీడు మండల అధ్యక్షుడిగా పనిచేశాడు. గత ఎన్నికల తర్వాత వైసీపీలో చేరి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పనిచేశాడు. ఎన్నికల ముందు తిరిగి సొంతగూడైన టీడీపీలోకి చేరాడు. పార్టీలో చురుగ్గా పాల్గొన్నాడు. దీంతో ఆయనపై వైసీపీ వర్గీయులు ఆగ్రహంగా ఉన్నారు. ఆయనకు తన స్వగ్రామమైన పెద్దారవీడు మండలం తంగిరాలపల్లిలో ఏడు ఎకరాల దానిమ్మ తోట ఉంది. ఎన్నికలలో టీడీపీకి మద్దతుగా ప్రచారం చేశాడని, ఆ మేరకు ఓటర్లను ప్రభావితం చేశాడన్న అక్కసుతో గుర్తు తెలియని వైసీపీ నాయకులు దానిమ్మ తోటకు నిప్పుపెట్టారు. దీంతో సుమారు 2.50 ఎకరాల మేర దానిమ్మ తోట పూర్తిగా కాలిపోయింది. అందులోని డ్రిప్ పైపులు, లేటర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షల మేర ఉంటుందని చెబుతున్నారు. ఈ మేరకు బాలుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎంత మోసం!

ఎన్నికలు ముగిసే.. ట్యాంకర్ పోయే..!

ట్యాంకర్లతో నీటిసరఫరా

నిలిపివేసిన ఎంపీ అభ్యర్థి



ఎన్నికల సమయంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి ప్రజల కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకరు (ఫైల్)

మార్కాపురం, మే 18: సార్వత్రిక ఎన్నికలలో అధికార వైసీపీ దిగుమతి నేతలకు ప్రాధాన్యత ఇచ్చింది. అందులో భాగంగా ఒంగోలు పార్లమెంటుకు చిత్తూరు జిల్లా నుంచి వలస వచ్చిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైసీపీ తరపున పోటీ చేశాడు. ఈ క్రమంలోనే ఇక్కడి కరువు నేలపై ఓటర్లను ఆకట్టుకొనేందుకు ఆయన ట్యాంకర్లతో నీటిసరఫరా చేశాడు. ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తూ ట్యాంకర్లతో నీటిని అందించారు. అది ప్రజలమీద ప్రేమ అంటే కాదు. కేవలం ఓట్ల మీద మాత్రమే ప్రేమ. ఈ క్రమంలోనే ఎన్నికలు ముగియడంతో ఆకస్మికంగా ప్రజలపై ప్రేమ మాయమైంది. ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాను నిలిపివేశాడు.

పశ్చిమ ప్రాంతంలో ముఖ్యంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కరువు తాండవిస్తుంది. తాగటానికి కనీసం నీళ్లు కూడా లేని పరిస్థితి. ఏటా ఈ నియోజకవర్గంలో ప్రభుత్వమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినవారికి బిల్లులు చెల్లించలేదు. దీంతో నీరు సక్రమంగా అందడం లేదు. దీంతో ఎన్నికలు వచ్చాయన్న తరుణంగా గ్రామీణ స్థాయి నాయకులలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొంతమేర మాత్రమే బిల్లులు విడుదల చేసింది. ప్రభుత్వంపై విశ్వాసం లేని ట్యాంకర్ల యజమానులు నీటి సరఫరాకు ముందుకు రాలేదు. దీంతో వైసీపీ తరపున ఒంగోలు నుంచి పోటీ చేయడానికి వలస వచ్చిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను తాను అపర భగీరథుడిగా ప్రకటించుకున్నారు. గ్రామాలలో అవసరమైనన్ని ట్యాంకులను ఏర్పాటు చేయండి, డబ్బులు నేనిస్తానని ప్రగల్భాలు పలికాడు. వీరుడు, శూరుడు, విక్రమార్కుడిగా, సామాజిక మాధ్యమా లలో ప్రచారాలు చేయించుకున్నాడు. దీంతో చెవిరెడ్డిని చూసి వైసీపీ నాయకులు రెచ్చిపోయి గ్రామాలలో ట్యాంకర్ల ఏర్పాటు చేశాడు. ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచి ట్యాంకర్లతో నీటి సరఫరా ప్రారంభించాడు. అయితే ఎన్నికలు మే 13న ముగియగా, మే 14వ తేదీ నుంచి నీటి సరఫరాను నిలిపివేశాడు. దీంతో ఆయన ప్రేమ ప్రజల మీద కాదు..! ఓట్లమీదే అనేది స్పష్టమైంది. ప్రస్తుతం నీటిసరఫరా లేకపోవడంతో గ్రామాల్లో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి.

ట్యాంకర్ల యజమానులు లబోదిబో

ఓట్ల లబ్ధికోసం చెవిరెడ్డి ట్యాంకర్లు ఏర్పాటు చేయగా, ఆయన మెప్పు కోసం ట్యాంకర్ల యజమానులు, వైసీపీ నాయకులు నీటి సరఫరా చేశారు. దీని కోసం ట్యాంకరుకు రూ.500 చెవిరెడ్డి చెల్లించాల్సి ఉంది. మొత్తం రెండు నెలలో తొలినెల ట్యాంకర్ల యజమానులకు బిల్లులు చెల్లించాడు. ఆ తర్వాత బిల్లులు ఇవ్వకపోవడంతో ట్యాంకర్ల యజమానులు లబోదిబోమంటున్నారు. దీంతో తమ పరిస్థితి సింగడు రానువచ్చాడు. పోనుపోయాడు అన్న తీరుగా తమ పరిస్థితి ఉందని స్థానిక నేతలు వాపోతున్నారు.

జిల్లాలో పేరుకుపోయిన పంచాయతీల బకాయిలు

ఇంటి పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం

ఆర్థిక సంవత్సరం ముగిసినా బకాయిలే

ఎన్నికల షెడ్యూల్ పేరుతో పట్టించుకోని వైనం

జిల్లావ్యాప్తంగా ఇంకా పెండింగ్‌లో ఉన్న రూ. 16.39 కోట్లు

ఒంగోలు(కలెక్టరేట్), మే 18: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్నులు భారీగా పెరుకుపోయాయి. ఆర్థిక సంవత్సరం ముగిసి రెండునెలలు గడుస్తున్నా ఇంకా రూ.16.39 కోట్లు ఇంటిపన్నులు వసూలు కావాల్సి ఉంది. ఎన్నికల నేపథ్యంలో గత మూడు నెలలుగా వసూళ్లు మందగించాయి. జిల్లాలో 728 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా ఇంటి పన్నులు, ఇతర పన్నులు రూ.38.83 కోట్లు వసూలే చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ. 27.44 కోట్లు మాత్రమే వసూలు కాగా రూ.16.39 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా చూస్తే జిల్లా వ్యాప్తంగా సరాసరిన 71శాతం పన్నులు మాత్రమే వచ్చాయి. సాధారణంగా 2023-24 ఆర్థిక సంవత్సరం గత మార్చితో ముగిసి 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు నూరు శాతం పన్నులు కట్టించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో సకాలంలో పట్టించుకోకపోవడంతో పన్నులు వసూలు కాలేదని తెలుస్తోంది. జిల్లాలో మూడు డివిజన్లు ఉండగా కనిగిరి డివిజన్‌లో కేవలం 68.64శాతం మాత్రమే వసూలు చేశారు. ఒంగోలు డివిజన్‌లో రూ.20.91 కోట్లు చేయాల్సి ఉండగా రూ.14.83 కోట్లు వచ్చాయి. ఇంకా రూ.6.08 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కనిగిరి డివిజన్‌లో రూ.8.76 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.6.01 కోట్లు వచ్చాయి. ఇంకా రూ.2.75 కోట్లు పెండింగ్‌లో ఉంది. మార్కాపురం డివిజన్‌లో రూ.9.16 కోట్లు డిమాండ్ ఉండగా రూ.6.60కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.2.56 కోట్లు పెండింగ్‌లో ఉంది. మూడు డివిజన్లలో భారీగా ఇంటి పన్నులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలకు రావాల్సిన పన్నుల బకాయిలను వసూలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కునారిల్లుతుండగా కనీసం రావాల్సిన ఇంటి పన్నులు కూడా సకాలంలో కట్టించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సర్పంచ్‌లు ఆయా గ్రామ పంచాయతీల్లో లక్షల్లో అప్పులు తెచ్చి వివిధ రకాల పనులు చేపట్టారు. ఆ పనులకు చెల్లించాల్సిన బిల్లులు రావడం లేదు. కనీసం పంచాయతీల్లో ఇంటిపన్నులు వసూలు చేస్తే కనీసం అత్యవసర పనులు చేసుకునేందుకైనా అవకాశం ఉండేది. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మార్టూరు, మే 18 : జాతీయ రహదారిపై మండల పరిధి రాజుపాలెం కూడలి వద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న తాళ్లూరి వెంకయ్య (27)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. వెంకయ్య జె.పంగులూరు మండలం భైట మంజులూరు గ్రామానికి చెందిన వాడు. అతనికి భార్య మరియరాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో వెంకయ్య ద్విచక్రవాహనంపై భైట మంజులూరు నుంచి భార్య సొంత ఊరు మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి వస్తున్నాడు. బైకుపై అతను గుంటూరు వైపు వెళుతుండగా రాజుపాలెం కూడలి వద్ద హైవే నుంచి రాజుపాలెం రోడ్డులోకి రావడానికి ఎడమవైపు సర్వీసు రోడ్డులోకి వస్తుండగా గుంటూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి వెంకయ్య బైక్‌ను ఢీకొన్నది. దాంతో బైక్‌తో రోడ్డుపై వెంకయ్య పడి పోగా అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అనంతరం వెంకయ్యను స్థానికులు మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం చిలకలూరిపేటలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందిన తర్వాత ఇంటికి తీసుకు వస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. వెంకయ్య తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టు మార్టమ్ నిర్వహించి అప్పగించారు. కుటుంబ సభ్యులు భైట మంజులూరుకు తీసుకు వెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ సాయిరాం తెలిపారు.

అందని సంధికాలపు భత్యం

- గంగపుత్రుల గగ్గోలు
- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్ర వేట నిషేధం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఆగిన వేటతో.. వాడరేవు తీరంలో ఒడ్డున ఉన్న పడవలు

చీరాల, మే 18 : ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేట నిషేధం జరుగుతుంది. ఆ సమయంలో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరిగుతుంది. ఆప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం వేటను నిషేధిస్తుంది. సముద్రంలో వేట నిషేధిత సమయాన్ని సంధికాలం అంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం రూ.10వేలు సంధికాలపు భత్యంగా వేట నిషేధం మొదలైన రోజునే అర్హులైన మత్స్యకారుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలి. సముద్రంలో వేట నిషేధించి నెల దాటింది. అయినా నేటికి సంధికాలం భత్యం జమకాకపోవడంతో గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు.

కడలిని నమ్ముకున్న కష్టజీవులు

సముద్రమే వారి ప్రపంచం. వేటే వారి జీవనాధారం. సముద్రంలో వేటాడిన మత్స్యసంపదను టోకుగా కొంత విక్రయించగా ఇంటి వద్ద మహిళలు రిటైల్‌గా ఆ సరుకును విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆ కుటుంబాలకు వేట జరిగితేనే భృతి. అయితే సముద్రంలో వేట నిషేధిత సమయంలో ప్రభుత్వపరంగా అందించే భత్యం రూకలే వారికి ఆదరవు.

ఎవరు లబ్ధిదారులు

సముద్రంలో వేటకు సంబంధించి మత్స్యశాఖ వద్ద బోట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలి. 21 సంవత్సరం నుంచి 60 సంవత్సరాలలోపు అర్హులైన వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తారు. కుటుంబానికి ఒకరు మాత్రమే లబ్ధిదారుడు ఉంటాడు. అయితే కొందరు ఉమ్మడి కుటుంబాలవారు తమకు ప్రత్యేకంగా రేషన్ కార్డు లేనందున నష్టపోతున్నామని చెప్తున్నారు. ఆ క్రమంలో ఇటీవల కొందరు వేరుగా ఉంటున్నట్లు (స్ప్లిట్టింగ్) దరఖాస్తు చేసుకుని కొత్త రేషన్‌కార్డులు పొందారు. అలాంటి వారిని కూడా అర్హుల జాబితాలో చేర్చారు. ఇంకా పలువురు తమను అర్హులు జాబితాలో చేర్చాల్సి ఉందని చెప్తున్నారు.

ఆదాయపు పన్ను చెల్లించేవారు అనర్హులు

ఇటీవల కాలంలో మత్స్యకార గ్రామాల్లోని యువతలో చాలామంది సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. అలా ఆదాయపు పన్ను చెల్లించేవారి కుటుంబ సభ్యుడు భత్యపు సొమ్ము పొందేందుకు అనర్హుడు అవుతున్నాడు. విద్యార్థులు కూడా అనర్హుల జాబితాలో చేరుతున్నారు. ఈ క్రమంలో వారిని కూడా అర్హుల జాబితాలో స్థానం కల్పించాలని కోరుతున్నారు.

నూకల కోసం రూకలు అరువు

నెల రోజులుగా ఎలాంటి సంపాదన లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. చేతిలో ఉన్న కొద్దిపాటి పొదుపు సొమ్ము కూడా ఖర్చయింది. బతుకు పోరాటంలో నూకల కోసం రూకలు అరువు తెచ్చుకోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భత్యం సొమ్ము చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అరువు తీసుకునే రొక్కానికి వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. బోట్లు, వలలు మరమ్మతులతో సంధి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని, వెంటనే భత్యం సొమ్మును తమ ఖాతాల్లోకి జమ చేయాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.



ఆకు పూజలో పాల్గొన్న భక్తులు

శింగరకొండలో భక్తుల రద్దీ

అద్దంకి, మే 18 : శింగరకొండలో శనివారం భక్తుల రద్దీగా పెరిగింది. విద్యార్థులకు వేసవి సెలవులు కావడం, పలు పరీక్షల ఫలితాలు రావడంతో పిల్లలతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో మొక్కు తీర్చుకునేందుకు తరలివచ్చారు. అదే సమయంలో పొలం పనులు పూర్తి కావడంతో రైతులు కూడా తమ కుటుంబాలతో వచ్చి పొంగళ్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆకు, వాహనపూజలలో భక్తులు భారీగా పాల్గొన్నారు.



కూల్ డ్రింక్ తాగుతున్న కోతి

కోతికి కూల్ డ్రింక్

ఆసక్తిగా గమనించిన భక్తులు

అద్దంకి, మే 18 : ఓ వానరం కూల్... కూల్‌గా కూల్ డ్రింక్ తాగుతూ భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. శింగరకొండలో కొండపైన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద శనివారం మధ్యాహ్నం మండుటెండకు భక్తులు కూల్ డ్రింక్ కొనుగోలు చేశారు. కోతి రక్కున వచ్చి ఆ కూల్ డ్రింక్‌ను లాక్కుంది. దర్జాగా అక్కడే కూర్చొని తాపీగా కూల్ డ్రింక్ బాటిల్ మూత తీసుకొని తాగటం ప్రారంభించింది. ఒక గుక్క తాగటం... మరలా కొద్ది సేపు ఆగటం చేస్తూ 250 ఎంఎల్ బాటిల్ తమ్స్‌ప్‌ను తాగేసింది. కోతి తాపీగా కూల్ డ్రింక్ తాగడాన్ని భక్తులు ఆసక్తిగా చూస్తూ తమ సెల్‌ఫోన్లలో వీడియోలు, ఫొటోలు తీసుకున్నారు. కోతి కూల్‌డ్రింక్ తాగి అలా ఎండ నుంచి సేదతీరింది.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

చీరాలటౌన్, మే 18 : ఖరీఫ్ 2024కు సంబంధించి చీరాల మండల పరిధిలోని రైతులు రాయితీతో కూడిన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో పొందాలని వ్యవసాయాధికారి సుమతి తెలిపారు. తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట పైర్లు విత్తనాలు ఇప్పటికే ఆర్బీకెల్లో ఉంచినట్లు చెప్పారు. సిబ్బందిని సంప్రదించాలని ఏవో తెలిపారు.

బల్లికురవ : రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలను అందజేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మండలానికి 40 క్వింటాళ్లు జీలుగ, 40 క్వింటాల్ల జనుములు, 30 క్వింటాల్ల పిల్లిపెసర విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని అవసరమైన రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సబ్సిడీ పోను జీలుగ, రూ.44, జనుములు రూ.44 పిల్లిపెసర రూ.67 వంతున అందజేస్తున్నామని ఏవో తెలిపారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన

మార్టూరు, మే 18 : జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యాకానుక స్టాక్ పాయింట్ ఉన్న గదులను విద్యా కానుక జిల్లా తనిఖీ బృందం సభ్యులు సీఎంవో శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ శనివారం పరిశీలించారు. అంతకు ముందు స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో సీఆర్‌పీలతో వారు సమావేశం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాకానుకపై సీఆర్‌పీలతో చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాం నాయక్, ప్రేమలత, సీఆర్‌పీలు రమేష్, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతుల తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మే 18 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభుని పేటలోని శ్రీచౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జ్యోతుల తిరునాళ్ల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు ఉదయం నుండే బారులు తీరారు. అంతేకాకుండా అమ్మవారి పసుపు, కుంకుమ మహోత్సవంను వైభవంగా జరిపారు. మధ్యాహ్నం నుండి గ్రామంలో కలశం ఊరేగింపునిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించగా ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

23న ఆంజనేయస్వామి తిరునాళ్ల

ఇంకొల్లు, మే 18 : శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి వారి 70వ వార్షిక జయంతి మహోత్సవం ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పావులూరు ఆంజనేయస్వామి తిరునాళ్ల ఈనెల 21 మంగళవారం మొదలై మూడు రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. చివరి రోజు గురువారం తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్రయాహ్నిక జయంత్యుత్సవం, శ్రీసువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణంతో పాటు ఆలయ ప్రాంగణంలో హరికథ, ఘంటశాల పాటల కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

అయ్యప్పని దర్శించుకున్న గొట్టిపాటి

అద్దంకి, మే 18 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం శబరిమల లో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం మూడు రోజుల పాటు అద్దంకి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల టీడీపీ నేతలతో సమీక్షలు నిర్వహించారు. శుక్రవారం శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అనంతరం హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి శబరిమలకు వెళ్ళిన రవికుమార్ సాయంత్రం అయ్యప్పస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.


ప్రత్యేక పూజలు.. అన్నప్రసాద వితరణ

చీరాల, మే 18 : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం చీరాల, పేరాల, వేటపాలెంలలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి జేవీవీ కిడ్స్ సమ్మర్ క్యాంప్

అద్దంకిటౌన్, మే 18 : జన విజ్ఞాన వేదిక అద్దంకి డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పట్టణంలోని ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల, గోరకాయపాలెం జడ్పీహెచ్‌ఎస్ నందు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏకకాలంలో జేవీవీ కిడ్స్ సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని బాధ్యులు తంగా శ్రీనివాసరావు, కావూరి రఘుచంద్ శనివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయని, ఈ క్యాంప్‌లో డ్రాయింగ్, ఫన్ మ్యాథ్స్, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, ఫన్ గేమ్స్, సాంగ్ వంటివి అంశాలలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్యాంప్‌కు వచ్చే విద్యార్థులు 50రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. కాగా గోరకాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో క్యాంప్‌లో తరగతులకు వెళ్లే విద్యార్థులు ఎటువంటి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వివరాలకు 9490598587, 9247176680 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఈఏపీసెట్‌లో సోపిరాల విద్యార్థికి ర్యాంక్



చినగంజాం, మే 18 : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన నరహరి రోహిత్ శివశంకర్ తెలంగాణ ఈఏపీ సెట్-2024 ఫలితాలలో 181వ ర్యాంక్ సాధించాడు. తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఈఏపీసెట్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 181వ ర్యాంక్ సాధించినట్లు రోహిత్ శివశంకర్ శనివారం తెలిపారు. తన తల్లిదండ్రులు పద్మ, శ్రీహరిరావు ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. తన తండ్రి శ్రీహరిరావు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పోటీ పరీక్షల కేంద్రాలలో అర్థమ్యాథ్స్, వేదిక్ మ్యాథ్స్‌ను బోధిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు శిక్షణ పొందుతున్నట్లు రోహిత్ శివశంకర్ తెలిపారు. ఈఏపీసెట్‌లో ర్యాంక్ సాధించిన రోహిత్ శివశంకర్‌కు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

పేరాల(చీరాలటౌన్), మే 18 : విద్యార్థి దశలో క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని తద్వారా ఉన్నతంగా రాణిస్తారని పద్మభాస్కర్ ఫౌండర్ ఘంటా అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల ఏడవ తరగతిలో ఉన్నతంగా రాణించిన పేరాలకు చెందిన విద్యార్థినికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాత అనిల్ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులను విద్యతో ముడివేయరాదని, లక్ష్యాలను చేరుకోవాలంటే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. విద్యతో ఉన్నత శిఖరాలను అందుకోవచ్చని చెప్పారు. ఫౌండేషన్ స్థాపించి నిరుపేదలకు, విద్యార్థులకు, వృద్ధులకు చేయూత అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సైకిల్‌ను అందజేస్తున్న అనిల్‌కుమార్

వైభవంగా వాసవీమాత జన్మదిన వేడుకలు



గుండ్లకమ్మ నది నుంచి 102 కలశాలతో నీరు తెచ్చిన మహిళా భక్తులు

అద్దంకి, మే 18 : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. గుండ్లకమ్మ నది నుంచి మహిళా భక్తులు 102 కలశాలతో జలం తీసుకు వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. గణపతి పూజ, నవ గ్రహ పూజ, వాసవీ మాత హోమం నిర్వహించారు. సామూహిక లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణాన్ని నిర్వహించారు. లక్ష మల్లెలతో అమ్మవారికి ప్రత్యేకార్చన చేశారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మార్టూరులో విశేష అలంకరణలో అమ్మవారు

చినగంజాం : మండలంలోని చినగంజాం, పెదగంజాం గ్రామాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని పూజారి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి విశేష పూజలు, సామూహిక సహస్ర కుంకుమార్చన పూజలు జరిపారు. అమ్మవారి చిత్రపటం, కలిశాలతో మహిళా భక్తులు, వాసవీ వనితా క్లబ్ సభ్యులు గ్రామపుర విధులలో గ్రామోత్సవం నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాలు, బాణసంచాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి మందిర కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, వాసవీ వనితా క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కలశాలతో గ్రామోత్సం నిర్వహిస్తున్న భక్తులు

పర్చూరు : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు శనివారం స్థానిక అమ్మవారి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేపట్టారు. 102 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించి పంచామృత అభిషేకాలు చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీరాం వెంకటసుబ్బారావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం శ్రీ భగవాన్ సత్యసాయిబాబా భక్త సమాజం వారిచే భజన జరిగింది.

మార్టూరు : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను శనివారం మార్టూరులో బొడ్డురాయి సెంటర్‌లో ఉన్న అమ్మవారి దేవ స్థానంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చిలకలూరిపేటలోని రాంలక్ష్మణ్ క్లాత్ షోరూం వారు బహూకరించిన పట్టు చీరతో అమ్మవారిని అందంగా అలంకరించారు. అదేవిధంగా మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అంతేగాకుండా అర్చకులు అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నిరుపయోగంగా కోట్ల విలువైన స్థలం

- పట్టించుకోని వ్యవసాయ శాఖాధికారులు
- వినియోగంలోకి తేవాలని రైతుల విజ్ఞప్తి



మార్టూరులో నిరుపయోగంగా వ్యవసాయ శాఖకు చెందిన భవనం

మార్టూరు, మే 18 : వ్యవసాయ శాఖకు చెందిన స్థలం దాదాపుగా ఐదు సెంట్ల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం రెండు కోట్ల రూపాయలు ఉంటుంది. మార్టూరులో నడిబొడ్డున ఈ స్థలం దాదాపుగా 20 ఏళ్ల నుంచి ఖాళీగానే ఉంది. మార్టూరులో గన్నవరం రోడ్డులో మంచి వ్యాపార కూడలిగా ఉన్న ప్రదేశంలో ఉన్న ఈ స్థలంలో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం భవనం శిథిలమైంది. దాంతో ఈ భవనం నిరుపయోగంగా పనికి రాకుండా ఉంది. వాస్తవంగా గతంలో మార్టూరు నియోజకవర్గం ఉన్నపుడు సంతమాగులూరు సమితి ఉన్నపుడు ఈ భవనాన్ని వ్యవసాయాధికారి కార్యాలయ భవనంగా వినియోగించేవారు. 2009నాటికి మార్టూరు నియోజకవర్గం రద్దు కావడం, అనంతరం మార్టూరు పర్చూరు నియోజకవర్గంలో చేరడం జరిగింది. వ్యవసాయ శాఖకు చెందిన స్థలంపై వ్యవసాయ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత ఐదేళ్ల క్రితం ఈ స్థలంలో రైతుల కోసం కార్యాలయం నిర్మించడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని అది కార్యరూపం దాల్చలేదు. ఇక అప్పటి నుంచి ఈ వైసీపీ ప్రభుత్వ పాలనలో కూడా ఈ శిథిలమైన భవనం సంగతి గాని, వ్యవసాయ శాఖకు చెందిన స్థలం పైగాని సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. మార్టూరులో వ్యవసాయాధి కార్యాలయం కొణిదెన రోడ్‌లో మార్కెట్ యార్డులో ఉన్న భవనాలలో నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖకు చెందిన ఈ స్థలంలో భవనం నిర్మిస్తే రైతులకు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయాధి కార్యాలయం నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతేగాకుండా మార్టూరు ఏడీఏ కార్యాలయం కూడా నిర్వహణకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏడీఏ కార్యాలయం కూడా మండల కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్నారు. ఇదిలావుండగా కొంతమంది ఆక్రమణ దారులు వ్యవసాయ శాఖకు చెందిన స్థలంపై కన్నేశారు. మరి కొంత మంది వాటి ముందు స్థలాన్ని ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎంతోవిలువైన స్థలాన్ని ఆ శాఖ వారు ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేసి ఉంచారో అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ స్థలంలో వ్యవసాయ శాఖ వారు భవనం నిరిస్తే రైతులతో పాటు, అడపాదడపా రైతు శిక్షణ తరగతులు, నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇకనైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

ఏబీసీలో పడి వృద్ధుడు మృతి



తన్నీరు లక్ష్మయ్య మృతదేహం

బల్లికురవ, మే 18 : మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య(65) శనివారం ఉదయం ఏబీసీ కాలువ మలుపులో ద్విచక్ర వాహనంతో కాలవలో పడిపోయి మృతి చెందారు. కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య శుక్రవారం ఉదయం అద్దంకిలో బైకు బస్టాండ్‌లో పెట్టి బ్రహ్మంగారి మఠం అరాధన కార్యక్రమానికి వెళ్లి శనివారం ఉదయం అద్దంకి నుంచి బైకుపై కొణిదెనకు వస్తుండగా వల్లాపల్లి సమీపంలో ఉన్న ఏబీసీ కాలవ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి మలుపు అర్థంకాక బైకుతో సహా కాలవలోకి పడిపోయాడు. వెంటనే బాటసారులు గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ అందుబాటులో వైద్యులు లేకపోవడం ఆక్సిజన్ అందుబాటులో లేకపోవడంతో వెంటనే మార్టూరు వైద్యశాలకు తరలించే లోపే అయన మృతి చెందారు. కాలవ వద్ద రక్షణ గోడలు లేకపోవటం వలనే ప్రమాదం జరిగిందని బంధువులు ఆరోపిస్తున్నారు. లక్ష్మయ్యకు భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆదమరిస్తే కాలువలోకే..!

- దడ పుట్టిస్తున్న వల్లాపల్లి ఏబీసీ బ్రిడ్జి
- రక్షణ గోడలు కరువు
- ఇప్పటికే పలువురి వాహనాలు బోల్తా
- తాజాగా కొణిదెనకు చెందిన వ్యక్తి కాలువలో పడి మృతి
- ఆందోళనలో ప్రయాణికులు
- రెడ్ లైట్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి



ప్రమాదకరంగా ఉన్న ఏబీసీ కాలువ బ్రిడ్జి

బల్లికురవ, మే 18 : కొత్త వ్యక్తులు ఎవరైనా ఆదమరిచి వాహనాలను నడిపితే వారి పని అంతే సంగతులు. ఏబీసీ కాలువలపై ఉన్న బ్రిడ్జిల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. వాహనాలను నడిపే వారు అయితే కాలువ మీద ఉన్న బ్రిడ్జి దాటే వరకు వారికి దడ పుడుతోంది. ఇరువైపులా దట్టంగా ఉన్న నీరు చుట్టూ రక్షణ లేకపోవడంతో వాహనాలను నడిపే వారు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికే సుమారు పది వాహనాల వరకు కాలవ బ్రిడ్జిలో బోల్తా కొట్టగా నలుగురు ప్రాణాలు వదిలారు. గత నెలలో వల్లాపల్లి వివాహానికి వస్తున్న ఒక వ్యక్తి కాలవ మలుపు అర్థంకాకపోవడంతో కాలువలో పడి తీవ్ర గాయాలపాయ్యాడు. ఈ మార్గంలో రాత్రుళ్ల ప్రయాణం అంటే కొత్త వ్యక్తులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవల్సిందే. అద్దంకి వైపు నుంచి దగ్గరకు వచ్చే వరకు ఈ మలుపు కనిపించటకపోవడంతో వాహనదారులు వేగంగా వచ్చి కాలువలోకి పడిపోతున్నారు. ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ నీరు విడుదలైన సమయాలలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోతున్నాయి. కాలువకు రెండు వైపులా రెడ్ లైట్ సిగ్నల్స్, రక్షణ గోడలు కట్టి వేగ నియంత్రణ చర్యలు చేపడితే ప్రమాదాల సంఖ్య తగ్గించ వచ్చని ప్రయాణికులు అంటున్నారు. బల్లికురవ మండలం వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాల సమీపంలో ఏబీసీ కాలువపై రెండు బ్రిడ్జిలు ఉన్నాయి. ఎన్నో ఎళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జిలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. ఏ సమయంలో కూలిపోతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జిలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు ఇప్పుడు ఊడిపోయాయి. దీంతో ప్రయాణికులు వాహనాలను బ్రిడ్జిలపై గుండా నడపాలంటే కింది ఉన్న నీటిని చూసి భయపడి పోతున్నారు. రాత్రుళ్ల అయితే వాహనదారులకు బ్రిడ్జి అర్థంకాక నీటిలోకి బోల్తా కొడుతున్నారు. రెండు వైపలా ఉన్న మలుపులతో వేగంగా వచ్చే వాహనదారులు అయితే వేగాన్ని నియంత్రించలేక నేరుగా ఏబీసీ కాలువలోకి వాహనాలతో పడిపోతున్నారు. గతంలో పలువురు కాలువలోకి వాహనాలతో పాటు పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. బల్లికురవ, సంతమాగులూరు, పల్నాడు జిల్లాకు చెందిన ప్రజలు అద్దంకి, ఒంగోలు వెళ్లేందుకు ఈ బ్రిడ్జిపై గుండానే ప్రయాణాన్ని సాగిస్తున్నారు. కొత్తగా ఈ రోడ్డులో వచ్చే వ్యక్తులు అయితే ఏబీసీ కాలువ బ్రిడ్జి అర్థంకాక కాలువ నీటిలో పడిపోతున్నారు. వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు కూడా ఈ బ్రిడ్జిలపై గుండా ట్రాక్టర్లు, ఎద్దుల ఆరకలు తీసుకు వెళ్లాలంటే భయపడుతున్నారు. శిథిలావస్థకు చెందిన బ్రిడ్జిపై గుండా ప్రతి రోజు పరిమితికి మించి గ్రానైట్ ముడిరాయిని లారీలలో రవాణా చేస్తున్నారు. ఈ రాయి లారీలు వెళుతుంటే చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు సైతం ఎప్పుడు బ్రిడ్జి కులిపోతుందో అని మనకు రాకపోకలు కూడా నిలిచిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఏబీసీ కాలువలపై ఉన్న బ్రిడ్జిలకు ఇరువైపులా రెడ్ లైట్ సిగ్నల్స్‌ను ఏర్పాటు ఏయాలని, రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



ఏబీసీ కాలువ మీదుగా వెళ్లే మలుపు

22న జిల్లాకు గవర్నర్ రాక

నెల్లూరు(హరనాథపురం): రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈనెల 22న జిల్లా పర్యటనకు రానున్నారని కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగే విక్రమ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఈనెల 22న ఉదయం 9.45 గంటలకు గన్నవరం నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు నెల్లూరు పోలీసు పరేడ్ మైదానానికి చేరుకుంటారని, 11.30 నుంచి మధ్యాహ్నం 12.55 వరకు జరిగే వీఎస్‌యూ స్నాతకోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5.35 గంటలకు పోలీసు పరేడ్ మైదానం నుంచి హెలిక్యాప్టర్‌లో గన్నవరం చేరుకుంటారని తెలిపారు.





పెంచలకోనలోని నృసింహుడి ఆలయం (ఇన్‌సర్ట్‌లో) స్వామి, అమ్మవార్లు

నేటి నుంచి

నృసింహుడి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన పెంచలకోన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వివిధ జిల్లాల నుంచి 120 ప్రత్యేక బస్సులు
- భక్తులకు త్వరితగతిన దర్శనం: ఉప కమిషనర్
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు

రాపూరు(డక్కిలి), మే 18: రాపూరు మండలంలోని పెంచలకోనలో ఆదివారం నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు పెంచలకోన ముస్తాబైంది. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ సాగర్‌బాబు, ఆర్డీవో మాలోల తదితరులు ఏర్పాట్లు చేశారు.

గోనుపల్లి నుంచి ఉత్సవమూర్తుల రాక

ఆదివారం నుంచి ఈనెల 25వ తేదీవరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోనుపల్లి నుంచి శోభాయాత్రగా పెంచలకోనకు ఉత్సవమూర్తులు రానున్నారు. అనంతరం అంకురార్పణ, రాత్రి సేనాపతి ఉత్సవం నిర్వహిస్తారు. 20న ఉదయం స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, 21న ఉదయం హంస వాహనసేవ, రాత్రికి బంగారు హనుమంత సేవ, 22న ఉదయం సింహవాహన సేవ, రాత్రికి నృసింహ జయంతి సందర్భంగా బంగారు గరుడసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం తిరుకల్యాణం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ జరుగుతాయి. 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి అశ్వవాహనసేవ, ధ్వజావరోహణం, 25న ఉదయం కోన నుంచి గోనుపల్లికి ఉత్సవమూర్తుల తిరుగు ప్రయాణం, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయి.

పటిష్ట పోలీసు బందోబస్తు

కోన బ్రహ్మోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పర్యవేక్షణలో రాపూరు, సంగం, ఆత్మకూరు సీఐలతోపాటు 10 మంది ఎస్‌ఐలు, మహిళా పోలీసులు, హోంగార్డులు, ప్రత్యేక పోలీసులు కలిపి మొత్తం 250 మంది వరకు బందోబస్తు నిర్వహిస్తారని రాపూరు ఎస్‌ఐ మాలాద్రి తెలిపారు.

భక్తుల కోసం 120 ఆర్టీసీ బస్సులు

కోన ఉత్సవాలకు నెల్లూరు, చిత్తూరు, కడప, తిరుపతి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి సుమారు 120 బస్సులు నడుపుతున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్ కుమార్ తెలిపారు. ఇంకా అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.



ఆలయం వద్ద వేసిన చలువ పందిళ్లు

కోనలో వసతుల మెరుగు



ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు

కోనలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుం డా ఏర్పాట్లు చేశామని ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. సామాన్య భక్తులు స్వామివారిని సులభంగా, త్వరితగతిన దర్శించుకునేలా చర్యలు చేపట్టా మన్నారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా చలవ పందిళ్లు వేశామని ఆయన వివరించా రు. భక్తులకు తాగునీటి వసతి కూడా కల్పించామని చెప్పారు.

● ఉత్సవాలకు ప్రచారమేది ?

ప్రతిఏటా కోన బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలు మూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. అయితే ఈ ఏడాది అందుకు తగ్గట్టుగా ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఉత్సవాలకు పదిరోజుల ముందు నుంచే వాల్‌పోస్టర్లను వివిధ డిపోల బస్సులకు అంటిస్తారు. కానీ ఈసారి అలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాలకు భారీగా ఆదాయం వస్తున్నా నామమాత్రంగా ప్రచారం కల్పించారనే విమర్శలు ఉన్నాయి.

● పట్టువస్త్రాలు ఎవరు సమర్పిస్తారు ?

స్వామివారికి గరుడసేవ రోజున స్థానిక ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈసారి బ్రహ్మోత్సవాలు జరిగే సమయానికి ఎన్నికల ఫలితాల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. అంతేకాక కోడ్ అమలులో ఉంది. ఈ పరిస్థితుల కారణంగా ఈ ఆనవాయితీ కొనసాగుతుందా.. లేదా ? అన్నది అంతుబట్టడం లేదు. ఇక శ్రీవారి కల్యాణం రోజున ముత్యాల తలంబ్రాలను గతంలో ఆలయ చైర్మన్ సమర్పించేవారు. కానీ ఈ సారి ఆలయ పాలక మండలి పదవీకాలం పూర్తి అయింది. కొత్త పాలకమండలి ఏర్పాటు కాలేదు. దీంతో స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు అందచేసే సంప్రదాయం ఉంటుందా... ఉండదా..? అని భక్తులు సందేహిస్తున్నారు.



హంసవాహనంపై గ్రామోత్సవంలో లక్ష్మీనరసింహుడు

వేదగిరీశుడికి హంసవాహన సేవ

నెల్లూరు(రూరల్), మే 18: వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హంస వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారిని అలంకరణ మండపానికి మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తీసుకువచ్చిన అర్చకులు, ఆపై విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అలంకరించి హంసవాహనంపై ఆశీనులను చేసి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలను వీక్షించేందుకు భక్తులు వేదగిరికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాలకొండలోని క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు

మాలకొండలో భక్తుల రద్దీ

● ఘాట్‌రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

వలేటివారిపాలెం, మే 18 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. నరసింహస్వామిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. వేసవి కాలం కావడం, స్కూళ్లకు సెలవులు రావడంతో మాలకొండ భక్తులతో పోటెత్తింది. క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పక్కకు తొలగేందుకు కూడా అవకాశం లేనంతగా రద్దీ నెలకొంది. ప్రత్యేక దర్శనానికి సుమారు నాలుగు గంటలకుపైగానే సమయం పట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు గర్భగుడిలో ప్రత్యేక పూజలను నిలిపివేశారు. క్యూలో ఉన్న భక్తులను అదుపు చేయడంలో ఆలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌రోడ్డులో వచ్చే పోయే వాహనాలతో గంటల తరబడి ట్రాపిక్ నిలిచిపోయింది. ట్రాపిక్‌ను అదుపు చేయండంలో పోలీసులు నానా అగచాట్లు పడ్డారు.

పోలింగ్ ముగిసినా

ఇదేంటి?

- యథావిధిగా చెక్‌పోస్టుల కొనసాగింపు
- వాహనాల తనిఖీలు ప్రారంభం
- ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీలకు మళ్లీ విధులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వ ఉద్యోగులకూ అవస్థలే..!

నెల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ ముగిసినా ఎన్నికల నిబంధనల నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటి వరకు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిం చారు. ఎక్కడ చెక్‌పోస్ట్ వద్ద ఆపినా... ఓపిగ్గా తమ వద్ద ఉన్న బ్యాగులు చూపించడం, కార్లు, ఇతర తనిఖీలకు సహకరించారు. అయితే పోలింగ్ ముగిసినా ఈ తనిఖీలు మాత్రం ఆగడం లేదు. ఈనెల 13న ఎన్నికల చెక్‌పోస్ట్ పాయింట్లను తొలగించారు. అయితే శనివారం నుంచి మళ్లీ వాటిని తెరిచారు. ఆ మార్గాల నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేయడం ప్రారంభించారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఎందుకిలా చేస్తున్నారు... ఏమి ప్రయోజనం...? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నా చెక్ పాయింట్ల వద్ద ఉన్నవారి నుంచి సమాధానం లేదు. అసలు చెక్ పాయింట్లు ఎందుకు ఏర్పాటు చేశారో.. తమకు కూడా తెలియదంటూ అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం.

మళ్లీ ఏంటిది ?

సాధారణంగా పోలింగ్ ముగిసే వరకు అధికారులు కఠిన ఆంక్షలను అమలు చేస్తుంటారు. పరిమితులకు మించి నగదు, ఇతర వస్తువులను తీసుకెళ్లేందుకు అనుమతివ్వరు. పారదర్శక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నిబంధనలను ఎన్నికల కమిషన్ అమలు చేస్తుంది. పోలింగ్ అయిపోగానే మళ్లీ ప్రజా జీవనం యథావిధిగా సాగుతుంది. ఇప్పటి వరకు ఒక్కో నియోజకవర్గంలో మూడుచోట్ల చెక్ పాయింట్ల(స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్స్)లో ఎస్ఎస్‌టీలు విధులు నిర్వహించాయి. అలాగే మూడు షిఫ్టులలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ పనిచేసింది. ఒక్కొక్క ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీల్లో ఐదుగురు చొప్పున అధికారులు, పోలీసులు విధులు నిర్వహించారు. పోలింగ్ ముగియగానే వీరందరి విధులు ముగిసినట్లు ప్రకటించిన అధికారులు ఇప్పుడు మళ్లీ వారికి విధులకు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.



నెల్లూరు : ఇరుగాళమ్మ ఆలయం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న బారికేడ్లు

ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీల ఏర్పాటు

ఇటీవల ఎన్నికల కమిషన్ ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలను ఏర్పాటు చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం పోలింగ్ ముగిసిక రాష్ట్రాల్లో జిల్లాకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌ను నియమించమని చెప్పినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ పక్క రాష్ట్రాల్లో పోలింగ్ జరగాల్సి ఉంటే బార్డర్ జిల్లాల్లో ఇతర రాష్ట్రాల చెక్‌పోస్టులను కొనసాగించాలని ఎన్నికల కమిషన్ సూచించినట్లు తెలిసింది. మిగిలిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలతో పనిలేదని ఆ సర్క్యులర్‌లో పేర్కొనట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు అన్ని నియోజక వర్గాల్లో పాత పద్ధతి లోనే టీమ్‌లన్నీ ఏర్పాటు చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే ఒక్కొక్క టీమ్‌లో నలుగురు చొప్పున పోలీసులు పనిచేస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలోని సిబ్బంది ఈ టీమ్‌ల్లో విధులే సరిపోతున్నారు. కౌంటింగ్ తరువాత సమస్యాత్మక ప్రాంతాల్లో గొడవ జరిగే అవకాశం ఉందని ఇప్పటికే నిఘా వర్గాలు హెచ్చరించి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు సిబ్బందిని ఉపయోగం లేని తనిఖీ కేంద్రాల్లో విధులు కాకుండా, సమస్యాత్మక ప్రాంతాలపై పర్యవేక్షణకు ఉపయోగించుకుంటే ప్రయోజనం ఉంటుందని రాజకీయ నిపుణులు సూచిస్తున్నారు. గడిచిన నెలరోజు లుకు పైగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ సొంత కార్యాలయాలకు వెళ్లడం మానేశారు. తిరిగి మళ్లీ విధులు కేటాయిం చడంతో వారి సొంత శాఖల్లోని పనులను పూర్తి చేయడం సిబ్బందికి కష్టంగా మారింది.



చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సైదాపురం వ్యవహారంపై

కలెక్టర్ సీరియస్

● నివేదిక ఇవ్వాలని ఆదేశం

నెల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సైదాపురం మండలం లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలకు సంబంధించి మైనింగ్‌శాఖ పట్టుకున్న వాహనాలను ఆ శాఖకు తెలియకుండా విడుదల చేయడంపై జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మైనింగ్‌శాఖే తెల్లబోయింది' అన్న కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ విషయమై నివేదిక ఇవ్వాలని మైనింగ్, రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించినట్లు తెలిసింది. మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేయనపుడు వారికి తెలియకుండా రెవెన్యూ అధికారులు ఎలా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎలా కేసు నమోదు చేశారన్న విషయాలను కలెక్టర్ ఆరాతీసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి విజిట్

అందని పౌష్టికాహారం

- తలుపులు తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు
- మామూళ్లతో సరిపెట్టుకుంటున్న అధికారులు
- లోపాయికారీ ఒప్పందంతో సిబ్బంది
- మధ్యాహ్న భోజనం లేక పస్తులున్న చిన్నారులు

'ఇదిగో.. మీరేమీ వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వండీవార్చేది లేదు.. కాకుంటే ఏదో నామమాత్రంగా సెంటర్లు తెరిచి ఉంచండి. ఇందుకు మీరు చేయాల్సింది. అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.300, ఆయాలు రూ. 200 చెల్లిస్తే సరిపోతుంది'

\- అంగన్‌వాడీ కేంద్రాలకు ఆశాఖలోని కొంతమంది సూపర్‌వైజర్లు మౌఖికంగా జారీ చేసిన ఆదేశాలు

'ఇది మేము చెప్పేది కాదమ్మో... జిల్లా అధికారి నుంచి సీడీపీవోకు, వారి నుంచి మాకు ఇలాగే చెప్పారు. ఇదంతా మాకే అనుకోకండి. జిల్లా అధికారి నుంచి అందరికి ఇచ్చుకోవాలి'.

\- ఇవండీ..! అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన చీకటి ఆదేశాలు

\- నెల్లూరు (వీఆర్వీ)

ఇంకేముంది...!? అంతా మామూలుగా జరిగిపోయింది. ఈ వ్యవహారం శనివారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో బట్టబయలైంది. ఉదయగిరిలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వేసిన తాళాలు వేసినట్టే ఉన్నాయి. ఇందులో 62 మంది చిన్నారులున్నారు. వీరికి మధ్యాహ్నభోజనం అందలేదు. దీంతో ఆ చిన్నారులు పస్తులుండి పోయారు. బుచ్చిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి కూడా ఇంతే. వలేటివారిపాలెం అంగన్ వాడీ కేంద్రంలో కూడా తలుపులు తెరుచుకోలేదు. ఇలా చాలా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యహ్న భోజనం పెట్టకుండానే సరిపెట్టేశారు. కేంద్రాలకు వచ్చిన చిన్నారులు భోజనం లేక నిరాశగా ఇంటిముఖం పట్టారు.



మూసి ఉన్న వలేటివారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం

మే ఒకటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ఒక్కపూట మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను అంగన్‌వాడీ టీచరు మొదటి 15రోజులు విధులు నిర్వహించాలి. రెండో విడత 15రోజులు ఆయా నిర్వహించాలి. ఈ సమయంలో యథావిధిగా చిన్నారులకు అందించాల్సిన పాలు, గుడ్లతోపాటుగా మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉంది. అలాంటివి ఏమీ లేకుండానే మే నెల సగం పూర్తయింది. అయినా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడనేలేదు. ముందుగానే అనుకున్న ప్రథకం ప్రకారం మేలో పౌష్టికాహారం బంద్ చేశారు. అయితే పెట్టినట్లుగా రికార్డులు సృష్టించారు.ఏప్రిల్ నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, ఎన్నికల విధులకు కొంతమంది సిబ్బందిని నియమించారు. అదే వీరికి కలిసొచ్చింది.

● లోపాయికారీ ఒప్పందం

ఐసీడీఎస్‌శాఖలోని కొంతమంది సిబ్బంది లోపాయికారీ ఒప్పందంతో పలు అంగన్‌వాడీ కేంద్రాలు తలుపులు కూడా తెరుచుకోలేదు. గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ అందించిన సిబ్బంది, పసిబిడ్డలకు అందించాల్సిన పౌష్టికాహారం అందకుండా బొక్కేశారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2,705 ఉండగా, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 229 ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 13,389 మంది, బాలింతలు 12,449 మంది, 6నెలలు నుంచి 3 ఏళ్ల లోపు చిన్నారులు 67,606 మంది, 3-6 సంవత్సరాలలోపు పిల్లలు 51,904 మంది ఉన్నారు. పేదపిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు... ఇలా కొంతమంది స్వార్థపరుల వల్ల లక్ష్యం నీరుగారిపోతున్నది. కాగా ఆ శాఖ ప్రాజెక్టు అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా సెలవులో ఉన్నారని సిబ్బంది తెలియజేశారు.

వైభవంగా దత్తాత్రేయుడి కలశ మహోత్సవం

లింగసముద్రం, మే 18: మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో దత్త దీక్ష మాలధారణ స్వాముల కలశ మహోత్సవం వైభవంగా జరిగింది. దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా గత ఏప్రిల్ నెలలో దత్త దీక్ష మాల ధరించిన 800 మందికి పైగా స్వాములు శనివారం సాయంత్రం కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా వీరు గ్రామంలోని రామాలయం వద్ద కలశా లను ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం దత్తాత్రేయస్వామిని ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



దత్తాత్రేయుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఆరాధనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

దత్తాత్రేయస్వామి మందిరం వద్ద ఆదివారం జరగనున్న స్వామివారి ఆరాధన మహోత్సవానికి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ముఖ్యంగా భక్తులు ప్రతి శనివారం రాత్రి ఈ దేవాలయం వద్దకు వచ్చి రాత్రికి అక్కడే నిద్రించి ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకొని పూజలు చేసి వెళతారు. దీంతో ప్రతి శని, ఆదివారాల్లో ఇక్కడ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం మంచినీరు, అన్నదాన సౌకర్యం కల్పించారు. అలాగే రాత్రి దత్తదీక్ష మాలాధారులచే పండరి భజన, అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు.

ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు



కలశాల ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

కందుకూరు, మే 18: వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను శనివారం కందుకూరు పట్టణంలో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో ఆర్యవైశ్య మహిళలు కలశాల ఊరేగింపు, అమ్మవారి నగరోత్సవం నిర్వహించటంతో పాటు పెద్దబజారులో ఉన్న వాసవీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వాసవీక్లబ్ లెజెండ్స్, వాసవీ వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవీ గ్రంథాలయంలో అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీచేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో వీరబ్రహ్మేంద్రస్వామి

సంగం, మే 18: స్థానిక కొత్తూరులో వెలసి ఉన్న వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పోతూరి వీర బ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరమ్మ మూల విరాట్‌లకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బోగోలు మండలంలో

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు బ్రహ్మంగారి మఠాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం జరిగాయి. విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో ఉన్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, విఘ్నేశ్వర పూజలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం జరిగాయి. రాత్రి భజన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొండబిట్రగుంట, పాతబిట్రగుంట బ్రహ్మగారి మఠాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఉలవపాడు, మే 18: మండల కేంద్రం ఉలవపాడులోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 27వ తేదీ వరకు స్వామివారికి రోజు అఖండ దీపారాధన, నిత్య త్రికాల మహానివేదన, ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపించి 24న స్వామివారి రథోత్సవం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కుడారి పెండల వరప్రసాద్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు, భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షములు పొందాలని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్తలు కోటిరెడ్డి సుధీష్ చంద్రారెడ్డి కోరారు.

మాలకొండ ఆదాయం రూ. 12,75,827

వలేటివారిపాలెం, మే 18 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 12,75,827 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 7,900, కుంకుమార్చన ద్వారా రూ. 28,600, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 91,700, వాహన పూజలు ద్వారా రూ. 5,280, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,22,600, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 480, రూములద్దెలు ద్వారా రూ. 35,250, కవర్లు ద్వారా రూ. 8,700, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,13,505, అన్నదానం ద్వారా రూ. 3,28,696, విరాళముల ద్వారా రూ. 32,116 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

నేటినుంచి పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

సీతారామపురం, మే 18 : మండలంలోని నారాయణప్ప పేటకు నైరుతి దిశాన పండ్రంగి గ్రామ సమీపంలో కావు కొండ సానువులపై వెలసి ఉన్న శ్రీ పాండు రంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మే 19వ తేదీ నుంచి 23వ తేది వరకు జరుగుతాయని దేవస్థాన కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవస్థాన కమిటీ మాట్లాడుతూ మే 19వ తేదీ ఉదయం 7గంటలకు కలశ స్థాపనతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 22వ తేది స్వామి వారి కల్యాణం, 23వ తేదీ గురువారం రథోత్సవం, పారు వేటతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.



శ్రీ పాండు రంగ విఠలేశ్వర స్వామి

ప్రజల మనసులు గెలిచాం.. !

● పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు

కావలిటౌన్, మే 18: స్వతంత్ర అభ్యర్థినైనా ప్రజల ఆదరాభిమానాలు చూరగొని వారి మనసులను గెలిచామని కావలి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు పేర్కొన్నారు. పసుపులేటి దంపతులు ఆంధ్రజ్యోతితో ఎన్నికల తీరు పట్ల తమ మనోభావాలు పంచుకున్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికల తీరు, పోలింగ్ సరళిని, ప్రజల ఆదరణను బట్టి చూస్తే తాము తప్పక గెలుస్తామన్న ధీమా కలుగుతోందన్నారు. సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమకు కుళ్ళు రాజకీయాలు తెలియదని, ప్రజలకు చేతనైనంత సాయం, సేవ చేయడమే తెలుసన్నారు. బోగోలులో పుట్టి పెరిగి పేదరికాన్ని అనుభవించి కష్టపడి అంచెలంచలుగా ఎదిగామన్నారు. ఈక్రమంలో జన్మభూమి రుణం తీర్చుకోవాలన్న దృఢమైన సంకల్పమే పీఎస్సార్ ట్రస్ట్‌కు పునాది పడిందన్నారు. 20ఏళ్ళ నుంచి నిరాటంకంగా నియోజకవర్గంలో సొంత నిధులతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఎన్నికల్లో పోటీచేశామని పదవుల కోసం కాదని, ఇతర ప్రాంతాల్లో ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసేందుకు ప్రధాన పార్టీలు టిక్కెట్ ఇచ్చేందుకు ముందుకొచ్చినప్పటికీ సున్నితంగా తిరస్కరించానన్నారు. ప్రజల నుంచి తమపట్ల వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేనివారు తమపై లేనిపోని ఆరోపణలు, దుష్ప్రచారం చేశారన్నారు. జీవితకాలం కావలి నియోజకవర్గాన్ని వీడమని, రాజకీయాలు, పదవులతో పనిలేకుండా తమవంతు అభివృద్ధి, సాయం, సేవ చేస్తామని స్పష్టం చేశారు.



పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు

డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు

మర్రిపాడు. మే 18: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు రైతులకు రోజు రోజుకు ఊరటనిస్తున్నాయి. శనివారం బోర్డుకు రైతులు 881 బేళ్లను తీసుకొని రాగా, 21 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 794 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 81 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ308 కాగా, కనిష్ఠ ధర రూ205 పలకగా సగటున ధర రూ274.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

ఉదయగిరి రూరల్, మే 18: ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కొండకింద గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కొన్నిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ఘాట్‌రోడ్డు కోతకు గురై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఘాట్‌రోడ్డు నిర్మాణమంటూ పాలకులు హడావుడి చేస్తారే తప్ప పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కలిగిరి, మే 18: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు శనివారం తెలిపారు. మండలంలో జీలుగ 22 క్వింటాళ్ళు, పిల్లిపెసర 143 క్వింటాళ్ళు, జనుము 116 క్వింటాళ్ళు అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీపై సరఫరా చేసే విత్తనాలను ఆన్‌లైన్ విధానంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సోమవారం నుండి పంపిణీచేయడం జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావలిసిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారుపుస్తకం తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. పచ్చిరొట్ట విత్తనాలు తీసుకున్న రైతులు సాగుబడి తప్పనిసరిగా చేయాలన్నారు, లేదా ప్రభుత్వం ద్వారా అందే ప్రయోజనాలు నిలిపివేయబడతాయని పేర్కొన్నారు.

బిలకూట క్షేత్రంపై మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

బిట్రగుంట, మే 18: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దాత గుర్రం ప్రభాకర్ 3లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును శనివారం ప్రారంభించారు. ప్రభాకర్ కుటుంబసభ్యులు మొదట స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అర్చకులచే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాధాకృష్ణ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిలకూట క్షేత్రవాసిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు గుర్రం కుటుంబ సభ్యులు అన్న సంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు.



పూజా కార్యక్రమంలో దాతలతో ఈవో రాధాకృష్ణ

నేడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

ఉదయగిరి రూరల్, మే 18: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఫరుద్దీన్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం, సీఐటీయూ సంఘాల నాయకులు, కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాదాలు జరిగితే ఆహుతి అవ్వాల్సిందే..

● అగ్నిమాపక కేంద్రం లేక ప్రజల ఇబ్బందులు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అల్లూరు, మే 18 : మండలంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ఏదైనా అగ్నిప్రమాదం చోటుచేసుకుంటే నిలువునా అగ్నికి ఆహుతవ్వాల్సిందేనని, వేసవికాలం సమీపిస్తుందంటే ఏ సమయంలో ఏ అగ్ని ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సమీపంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో అగ్ని ప్రమాదం జరిగితే సుదూర ప్రాంతాలైన కావలి, నెల్లూరు నుండి అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేసరికే అంతా కాలి బూడిద అయిపోతుంది. వచ్చినవారు చివరి సమయంలో ఉన్న మంటలను ఆర్పడం తప్ప ఇంకేమీ లాభం లేకుండా పోతోంది. అప్పటికే స్థానికులు మంటలను ఆర్పేయడం, బాధితులు నష్టపోవడం అంతా జరిగిపోతుంది. ఒక ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే వేసవి కాలం కావడంతో చుట్టుపక్కల ఉండే గడ్డివాములు, పూరిగుడిసెలు తదితరాలకు నిప్పంటుకొని భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ప్రజలు, రైతులు వాపోతున్నారు.



అగ్నిప్రమాదానికి గురైన గృహాలు (ఫైల్)

అల్లూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మండల కేంద్రమైన అల్లూరులో గత ప్రభుత్వాలు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలు చేశాయి. ఇక్కడ ఏర్పాటుచేస్తే అల్లూరుతోపాటు కొడవలూరు, దగదర్తి, బోగోలు మండలాలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతాల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న అరగంటలోపే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని అరికట్టవచ్చు. ప్రస్తుతం నెల్లూరు, కావలిలోని అగ్నిమాపక కేంద్రాల నుంచి సిబ్బంది ఘటనా స్థలానికి రావాలంటే దాదాపు మూడు గంటల వ్యవధి పడుతోంది. దీంతో ప్రమాద స్థలంలో పూర్తిగా ఆస్థులు నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అల్లూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

సామాజిక మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు

● పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, మే 18: మండల కేంద్రమైన వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో సామాజిక మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మల మూత్ర విసర్జనకు సుమారు రెండు ఫర్లాంగుల దూరం చిల్లచెట్ల మాటుకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. చెన్నై, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, వైజాగ్, నెల్లూరు తదితర పట్టణాలకు వివిధ పనులపై వెళ్లేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి ప్రతి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు వస్తుంటారు. అంతేగాకుండా ప్రతి శనివారం మాలకొండ పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు వేలాది మంది భక్తులు వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు వస్తుంటారు. దీంతో బస్టాండు సెంటరు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అలాంటి బస్టాండు సెంటరులో సామాజిక మరుగదొడ్లు లేక నిత్యం ప్రయాణికులు మల మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండు సెంటరులో సామాజిక మరుగుదొడ్లు నిర్మించి రూ. 5, రూ. 10 వసూలుచేసే విధంగా ఏర్పాట్లుచేస్తే పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరడమే కాకుండా ఒకరిద్దరికి ఉపాధి కలుగుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండు సెంటరులో సామాజిక మరుగుదొడ్లు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



వలేటివారిపాలెం బస్టాండు సెంటరు

బీసీజీ వ్యాక్సిన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 18: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌కు అర్హులైన ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్ శనివారం తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం అడల్ట్ బీసీజీ టీకా వేయడం జరుగుతుందన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు, మే 18: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి గోరంట్ల పున్నయ్య, పద్మావతి దంపతులు శనివారం రూ. 50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్పసేవాసంఘం కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహ్మం, నల్లబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి దుప్పి మృతి



మరణించిన దుప్పి

ఉలవపాడు, మే 18 : దారితప్పి జనావాసాల్లోకి వచ్చిన ఓ దుప్పి కుక్కల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గాయాలపాలై మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. ఉలవపాడు ఫారెస్ట్ సెక్షన్ అధికారి నరసయ్య, గార్డ్ సుభానీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వే ట్రాక్‌కు తూర్పున ఉన్న చిట్టడవి నుంచి ఒక దుప్పి దారితప్పి గ్రామంలోకి వచ్చింది. వీధి కుక్కలు వెంబడించడంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో వడ్డెరపాలెం వద్ద కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న ప్రహరీ గోడను దాటే సమయంలో పక్కనే ఉన్న బావిలో పడింది. స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో వారు దుప్పిని బావిలో నుంచి బయటకు తీసి పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం ఫారెస్ట్ బంగళాకు తీసుకెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందింది. నియమ నిబంధనల ప్రకారం దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి దహనం చేసినట్లు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఉలవపాడు, మే 18 : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఉలవపాడు జాతీయ రహదారి మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై బాజీరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోవూరుకి చెందిన దేవళ్ల రాధాకృష్ణారెడ్డి (65) పొలాల్లో రైతుల పాత విద్యుత్ మోటార్లు కొని అమ్ముకుంటూ ఉంటాడు. ఈక్రమంలో ఉలవపాడుకు వచ్చిన రాధాకృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి మన్నేటికోట వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు వెళ్లే గుర్తుతెలియని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో రాధాకృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదుచేసి ప్రమాదానికి కారణమైన కారును గుర్తించే పనిలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల ఫలితాలపై పల్లెల్లో పందేలు

సీతారామపురం, మే 18 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎర్టీలకు చెందిన పలువురు నాయకులు తమ పార్టీ అంటే తమ పార్టీ గెలుస్తుందని పల్లెల్లో పందేలు కాస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తుందని, ఉదయగిరిలో కాకర్ల సురేష్ విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు, అలాగే వైసీపీ వారు తమ పార్టీనే మరలా వస్తుందని బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇంకా ఓట్ల లెక్కింపునకు 17 రోజుల సమయం ఉండడంతో పల్లెల్లో బెట్టింగులు మరింత జోరందుకునే అవకాశం ఉంది. ఉదయగిరి నియోజకవర్గంలో 83.64 శాతం పోలింగ్ జరగడంతో ఇరు పార్టీల వారు గెలుపు తమదేనంటూ ధీమాతో ఉన్నాయి.

కావ్యతోనే కావలి కనకపట్నం

● కాపు నేతల అభినందనలు

కావలి, మే 18: కావలి కనకపట్నం కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితోనే సాధ్యమవుతుందని కాపు నేతలు పేర్కొన్నారు. కావలి పట్టణం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం కాపునేతలు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి భారీ మెజార్టీతో విజయం తథ్యమని పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో కాపులపై దాడులు, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించి వారిపై కూడా కేసులు పెట్టడం జరిగిందన్నారు. చిన్న సమస్యను కూడా పరిష్కరించలేని ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కాపునేత సురేష్ చావుకు కారకుడయ్యాడని ఆరోపించారు. ఎమ్మెల్యే కాపులకు ఎలాంటి రాజకీయ పదవులలో ప్రాధాన్యత కల్పించలేదన్నారు. ఎన్నో అవమానాలను, దాడులను, దౌర్జన్యాలను ఎదుర్కొన్న కాపులంతా ఏకమై ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని ఆశీర్వదించటం జరిగిందన్నారు. కావ్య మాట్లాడుతూ తన గెలుపునకు విశేషంగా కృషిచేసిన కాపులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ఇచ్చిన హామీలు అమలు చేస్తానన్నారు.



కావ్య క్రిష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న బలిజ, కాపు నేతలు

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు

కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని క్రిష్ణారెడ్డి తెలిపారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో క్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

దాహార్తి తీరుస్తున్న మహిళల సేవలు అభినందనీయం

రోడ్ల వెంబడి పాదాచారుల దాహార్తి తీర్చేందుకు ట్రంకు రోడ్డు వెంబడి చలివేంద్రం ఏర్పాటు చేసిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కావలి మహిళా విభాగం సేవలు అభినందనీయమని టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి అర్చక సంఘం అధ్యక్షుడైన శ్రీనివాసాచార్యులు పుట్టినరోజు సందర్భంగా తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ, పులిహోర, మిఠాయిలు పంపిణీ చేయటంతో ఆయనను క్రిష్ణారెడ్డి అభినందించారు.

రూపు కోల్పోతున్న ఉదయగిరి ఆనకట్ట

● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, మే 18 : ఉదయగిరిని శ్రీకృష్ణ దేవరాయులు పరిపాలిస్తున్న సమయంలో పట్టణానికి ఈశాన్యంలో ఆనకట్ట నిర్మించారు. వర్షాలకు ఈ ఆనకట్ట నిండితే బోర్లకు నీటిమట్టం పెరిగి ప్రజలకు కొళాయిల ద్వారా నీటి సరఫరా అందేది. అలాంటి ఆనకట్ట రోజు రోజుకి రూపు కోల్పోయి జమ్మూగుర్రపు డెక్కతో నిండిపోయింది. పట్టణంలో సుమారు 3 వేల నివాస గృహాలు, 20 వేల మంది జనాభా ఉన్నారు. పట్టణంలోని కోళ్ల వీధి, ఆవుల వీధి కరిమ వీధి, బాలాజీ నగర్, నాగుల బావి వీధి, అగ్రహారం షామీర్ షా వీధి, దేవలగడ్డ గొల్లపాలెం తదితర వీధుల్లో నుంచి వచ్చే మురికి నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆనకట్టలో పేరుకుపోయి నీరు కలుషితమవుతోంది. టీడీపీ హయాంలో అయినా కొంతమేర ఆనకట్ట పూడిక పనులు జరిగాయి, కానీ వైసీపీ పాలనలో అభివృద్ధి లేక పనులు కుంటుపడ్డాయి, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనకట్టలో మొలచిన జమ్మూగుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి నీరు కలుషితం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఆనకట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయిన నీటి బోరు

క్రీడా మైదానంలో పరిశుభ్రత మరిచారు.. !

ఉదయగిరి రూరల్, మే 18: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని నిర్వహించిన అధికారులు అనంతరం పరిశుభ్రతను మరిచారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి అందజేసిన భోజనాల ప్యాకెట్లు, తదితర వాటిని శుభ్రం చేయక మైదానంలోనే వదిలేశారు. ఈ క్రీడా మైదానంలో యువకులు ప్రతిరోజు క్రికెట్, ఇతరత్రా ఆటలు ఆడుతూ మానసికోల్లాసాన్ని పొందుతున్నారు. అయితే మైదానంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మైదానాన్ని శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన క్రీడా మైదానం

ఆత్మకూరులో ట్రాఫిక్ సమస్య

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

ఆత్మకూరు, మే 18 : ఆత్మకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా తయారైంది. దుకాణాలు, హోటళ్ల ఎదురుగా వాహనాలను అడ్డదిడ్డంగా రోడ్లపైనే నిలిపేయడంతో ప్రజలు, ద్విచక్రవాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా తోపుడుబండ్లను కూడా రోడ్డుపైనే అడ్డంగా ఉంచి వ్యాపారాలు చేసుకుంటుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సెంటర్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు నాలుగురోడ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. దాంతో ఆర్టీసి బస్టాండ్‌సెంటర్ నుంచి సోమశిలరోడ్డు సెంటర్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా స్తంభిస్తోంది. దానికితోడు వరిగడ్డి ట్రాక్టర్లు కూడా అటుగానే వస్తుండడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి దీంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువై ప్రజలు, వాహనదారులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఆటోలను కూడా ఎక్కడ పడితే అక్కడ నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తుండడంతో వెనకాల ఉండే బస్సులు సైతం రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. దుకాణాలు, హోటళ్ల ఎదురుగా వాహనాలను నిలుపుకునేందుకు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుకోవాల్సిన పరిస్థితి. దీంతో ప్రతి చోట అడుగడుగునా ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పట్టణంలోని సోమశిలరోడ్డు సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్